పుస్తక ప్రియులకు ఇదే మా ఆహ్వానం
38వ హైదరాబాద్ జాతీయ పుస్తక ప్రదర్శన
తెలంగాణ కళాభారతి (ఎన్టీఆర్ స్టేడియం), హైదరాబాద్
డిసెంబర్ 19 నుండి 29 వరకు - మ॥ 1 నుండి రా॥ 9 వరకు
నవచేతన బుక్ హౌస్ స్టాల్ నం. 292 - 295
నవచేతన పబ్లిషింగ్ హౌస్ స్టాల్ నం. 339 - 344

www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
PRAJAPAKSHAM ★★★★

కొత్త జిఓతో జర్నలిస్టులకు ఎలాంటి నష్టం జరగదు
మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి

ఎస్ఐబి మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు విడుదల 03

సంపుటి 09, సంచిక: 30 | శనివారం | 27-12-2025 | ఖమ్మం | Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00



# హక్కులు హననం

## పోరాడి సాధించుకున్న హక్కులు, చట్టాలను రద్దుచేస్తున్న మోదీ ప్రభుత్వం

- తిరోగమన దిశగా ఎన్‌డిఎ సర్కార్
- ప్రజలకోసం పోరాడి ప్రాణత్యాగం చేసిన మహనీయుల ఆశయాలతో సిపిఐని మరింత ముందుకు తీసుకెళతాం
- ఎర్రజెండాలన్నీ ఏకమై ఒకే జెండాగా మారి ఎర్రకోటపై ఎగరేయాలి
- వక్తల ఉద్ఘాటన

మఖ్దూంభవన్‌లో అరుణపతాకాన్ని ఆవిష్కరించిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

ప్రజాపక్షం/హైదరాబాద్

ఎర్ర జెండాలన్నీ ఏకమై ఒకే జెండాగా మారి, ఆ జెండా ఢిల్లీలోని ఎర్రకోటపై ఎగరాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివ రావు అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ లేకపోతే ప్రస్తుతం అనుభవిస్తున్న చట్టాలు, హక్కులు ఉండేవే కాదని, కమ్యూనిస్టు పార్టీ లేకపోతే ప్రజలకు రక్షణ కవచం లేనట్టేనని స్పష్టం చేశారు. అనేక వీరోచిత పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను, చట్టాలను రద్దు చేస్తూ మోదీ ప్రభుత్వం తిరోగ మన దిశగా వెళ్తుందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల కోసం పోరాడి తమ ప్రాణాలు అర్పించిన మహనీయుల ఆశయాలతో సిపిఐని మరింత ముందుకు తీసుకెళ్తామని కూనంనేని సాంబశివ రావు చెప్పారు. 'వందేళ్ల సిపిఐ ఆవిర్భావ దినోత్సవ సభ' సిపిఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌లో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ పతాకాన్ని కూనంనేని సాంబశివరావు ఆవిష్కరించారు. సభకు సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నర్సింహా అధ్యక్షత వహించగా, కూనంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ కార్యదర్శులు తరువాయి 2లో

ఘనంగా సిపిఐ వందేళ్ల ఉత్సవాలు 12




వరంగల్ నగరంలో సిపిఐ శతవార్షికోత్సవాల భారీ ర్యాలీ

### ఎర్రజెండా అంటే
## బిజెపికి వణుకు : పల్లా



ప్రజలను చైతన్యం చేసే శక్తి ఎర్రజెండాకు ఉన్నదని, అందుకే ఎర్రజెండాను చూసి బిజెపి వణికిపోతున్నదని, ఎర్ర జెండా కనిపించొద్దనే ఎజెండాతో బిజెపి పని చేస్తున్నదని పల్లా వెంకటరెడ్డి విమర్శించారు. భారత కమ్యూనిస్టు పార్టీయే దేశంలో మొట్టమొదటిగా ఏర్పడిన రాజకీయ పార్టీ అని తరువాయి 2లో

### ఖమ్మంలో.. చరిత్ర ఎరగని రీతిలో
## జనవరి 18న బహిరంగ సభ

చరిత్రలో కనీవిని ఎరగని రీతిలో సిపిఐ వందేళ్ల ఉత్సవాల సందర్భంగా జనవరి 18న ఖమ్మంలో భారీ బహిరంగ సభను నిర్వహించి, కమ్యూనిజాన్ని అంతమొందించలేరని నిరూపిస్తామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు అన్నారు. కమ్యూనిస్టులు ఎక్కడ అని అనే వారికి కనువిప్పు కలిగే విధంగా ఎర్ర సముద్రాన్ని తలపించేలా లక్షలాది మందితో ఖమ్మం 'బహిరంగ సభ'ను నిర్వహించనున్నట్టు వెల్లడించారు. హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో శుక్రవారం ఆయన తరువాయి 2లో

### ఫోన్ ట్యాపింగ్ కేసు
## మస్తాన్‌ను విచారించిన సిట్

ప్రజాపక్షం/హైదరాబాద్

ఫోన్ ట్యాపింగ్ కేసులో సెఫాలజిస్ట్ ఆరా మస్తాన్‌ను సిట్ శుక్రవారం విచారించింది. రెండున్నర గంటల పాటు మస్తాన్‌ను విచారించిన ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) అధికారులు రెండో సారి ఆయన స్టేట్‌మెంట్ నమోదు చేశారు. విచారణ అనంతరం ఆరా మస్తాన్ మీడియాతో మాట్లాడుతూ.. గతంలో తాను చెప్పిన వివరాలనే సిట్ అధికారులు మళ్లీ అడిగారని, తనకు తెలిసిన అన్ని అంశాలను సిట్ అధికారులకు చెప్పానన్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు ప్రభాకర్ రావు వెల్లడించిన అంశాలను క్రాస్ చెక్ చేసుకునేందుకే తనను మరోసారి అధికారులు విచారణకు పిలిచారని తెలిపారు. సిట్ అధికారులు తన ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించిన డేటాను తన ముందే ఉంచారని, ఆ డేటా ప్రకారం 2020 నుంచే తన రెండు ఫోన్లు ట్యాప్ అయినట్లు పేర్కొన్నారని ఆయన చెప్పారు. ముఖ్యమైన సాక్షులను సిట్ విచారిస్తోందని, ఉన్నత స్థాయి అధికారులతో సిట్ ఏర్పాటు చేయడంతో దర్యాప్తు తుది దశకు చేరుకుందని అభిప్రాయపడ్డారు. వారం రోజుల్లో మళ్లీ విచారణకు పిలిచే అవకాశముందని తెలిపారు.

# లీగల్ అకాడమీ ఉండాల్సిందే




- ఎఐ, సైబర్ నేరాలపై శిక్షణ అవసరం
- న్యాయవాదులు ఎప్పటికప్పుడు కఠోరమైన తర్ఫీదు పొందాలి
- సరికొత్త పంథాలో నేరస్తులు సవాళ్లు విసురుతున్నారు
- ఇది రానురాను మరింత జఠిలం కావొచ్చు
- చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ ఆందోళన

**పనాజి :** కృత్రిమ మేధ, సైబర్ నేరాలవల్ల దేశానికి ఎదురవుతున్న సమస్యలు పరిష్కరించడంలో న్యాయవాదులకు శిక్షణ ఇవ్వడానికి జాతీయస్థాయిలో ఒక లీగల్ ఆకాడమీని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. సైబర్ నేరాలకు సంబంధించిన వృత్తిపరమైన సాధనాలు సమకూర్చుకుని న్యాయవాదులు ఎప్పటికప్పుడు కఠోరమైన శిక్షణ పొందాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. ఒకరోజు లేదా రెండు రోజుల శిక్షణ సరిపోదు, కనీసం రెండునెలలైనా శిక్షణ పొందాల్సి ఉంటుందని అన్నారు. మధ్యవర్తిత్వం అనే అంశంపై శుక్రవారం పనాజీలో జరిగిన సదస్సులో ఆయన జాతీయ అకాడమీ ఏర్పాటు ఆవశ్యకతను పదే పదే ఉద్ఘాటించారు. దక్షిణగోవాలోని 'ఇండియా ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ లీగల్ ఎడ్యుకేషన్–రీసెర్చ్'లో మధ్యవర్తిత్వం అనే అంశంపై న్యాయవాదుల మండలి నిర్వహించిన జాతీయ సదస్సు–చర్చావేదిక ప్రారంభ సమావేశంలో ఆయన ప్రసంగించారు. "ఇప్పుడు మనం కృత్రిమ మేధ యుగంలోకి ప్రవేశించాం, న్యాయవాదుల వేదికకు సహకరించడంలో ఇది చాలా శక్తిమంతమైన సాధనం, కానీ తరువాయి 2లో

### అర్థరహిత విమర్శలకూ
# హద్దుండాలి

- ప్రజారంజక పాలనతో కెసిఆర్‌కు గుబులు
- రెండేళ్ల తరువాత ఫాంహౌస్ నుంచి బయటకు వచ్చి వ్యంగ్య విమర్శలు
- మంత్రులు గడ్డం వివేక్, పొన్నం ప్రభాకర్ మండిపాటు



ప్రజాపక్షం/గజ్వేల్

మాజీ సిఎం కెసిఆర్ చేస్తున్న వ్యంగ్య విమర్శలను ప్రజలు క్షమించరని, అర్థరహిత విమర్శలకు కూడా హద్దంటూ ఉండాలని మంత్రులు గడ్డం వివేక్ వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు తూంకుంట అంక్షా రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన నూతన సర్పంచ్‌ల ఆత్మీయ సమ్మేళనం, సన్మాన కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. రాష్ట్రంలో సిఎం రేవంత్ రెడ్డి చేపడుతున్న ప్రజా రంజక పాలనతో చక్కటి ఫలితాలు రాగా, గుబులు పుట్టిన కెసిఆర్ ఫాం హౌస్ వీడినట్లు ఎద్దేవా చేశారు. సర్పంచ్ ఎన్నికల్లో లక్షకుపైగా ఓట్లు సాధించిన కాంగ్రెస్ అభ్యర్థులు కెసిఆర్‌ను నైతికంగా ఓడించినట్లు స్పష్టం చేశారు. గతంలో ఎన్నడూ లేని దరిద్రపు భాషను ప్రవేశపెట్టిన కెసిఆర్ ఇంకా తన పద్ధతి మార్చుకోవడం లేదని ఎద్దేవా చేశారు. ముఖ్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న చారిత్రాత్మక పథకాలైన ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, సన్న బియ్యం తరువాయి 2లో

### హెచ్–1బి వీసా ఇంటర్వ్యూలు రద్దు
## భారత్ ఆందోళన

- ఆటంకాలు తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం జోక్యం
- అమెరికా దృష్టికి దరఖాస్తుదారుల ఫిర్యాదులు
- ఎంఇఎ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వెల్లడి




**న్యూఢిల్లీ:** హెచ్1బి వీసాల ఇంటర్వ్యూల ముందస్తు షెడ్యూలును రద్దు చేయడంపై అమెరికాకు భారత ప్రభుత్వం తన ఆందోళన తెలియజేసింది. భారీసంఖ్యలో ఉన్న భారత దరఖాస్తుదారులు, కుటుంబాలు ఎదుర్కొంటున్న ఆటంకాలను కొంతమేరకైనా తొలగించేందుకు ప్రభుత్వం క్రియాశీలంగా వ్యవహరిస్తున్నట్లు విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ శుక్రవారం మీడియాకు చెప్పారు. ఇంటర్వ్యూ తరువాయి 2లో

# వచ్చే శతాబ్దంలోకి ఎర్రజెండాను సగర్వంగా తీసుకెళదాం!

## శతాబ్దకాలపు రాజకీయ కార్యాచరణను సమీక్షించుకుందాం ! సమానత్వం, లౌకికత, న్యాయం పునాదులపై దేశాన్ని పునర్నిర్మాణం చేద్దాం!!



**డి. రాజా**
సిపిఐ ప్రధాన కార్యదర్శి

2025 డిసెంబర్ 26వ తేదీన భారత కమ్యూనిస్ట్ పార్టీ (సిపిఐ) 100 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. ఈ శతాబ్ది కేవలం ఒక రాజకీయ పార్టీకి సంబంధించిన అంశం మాత్రమే కాదు. ఇది భారత దేశ స్వాతంత్ర్య పోరాటానికి రూపాన్నిచ్చిన ఒక ఉధృత ఉద్యమం, దేశ భవిష్యత్తు కోసం ముందు చూపును, సామాజిక, ఆర్థిక దార్శనికతను ప్రతిబింబించే చారిత్రక ఘట్టం. తన తొలినాళ్ళలోనే చారిత్రక కాన్పూర్ సమావేశానికి ఆహ్వాన సంఘానికి అధ్యక్షుడుగా ఉన్న మౌలానా హస్రత్ మోహని రూపొందించిన 'ఇంక్విలాబ్ జిందాబాద్' అనే విప్లవ నినాదానికి సిపిఐ గొంతును అందించింది. ఆ నినాదాన్ని భగత్ సింగ్, ఆయన సహచరులు అమరత్వాన్ని అందించారు. కమ్యూనిస్టు కార్యకర్తల ద్వారా, విప్లవాత్మక పరివర్తన కోసం ఈ నినాదం దేశంలోని ప్రతి మూలకు పయనించి, ప్రతిఘటన, ఆశ, దేశభక్తికి సజీవ వ్యక్తీకరణగా మారింది. వలస పాలనతో సంఘర్షిస్తూ సిపిఐ ఆవిర్భవించింది. జాతీయ ఉద్యమం ఎదుర్కొంటున్న ఎవరికి, ఎందుకు కోసం స్వాతంత్ర్యం అనే ప్రాథమిక ప్రశ్నకు సమాధానం కోసం ప్రయత్నించింది. సామాజిక, ఆర్థిక పరివర్తన లేకుండా రాజకీయ స్వాతంత్ర్యం ప్రజలను పాత, కొత్త రూపాల్లో దోపిడీలో చిక్కుకుపోయేలా చేస్తుందని సిపిఐ శతాబ్ద కాలంగా నిరంతరం వాదిస్తున్నది. వలసవాద పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా సిపిఐ చేసిన రాజీలేని పోరాటంలో దాని చారిత్రక మూలాలు ఉన్నాయి. బ్రిటిష్ సామ్రాజ్యవాదం భారతదేశ ఆర్థిక వ్యవస్థను విదేశీ మూలధన పెట్టుబడి అవసరాలకు కట్టబెట్టి, స్వదేశీ పరిశ్రమలను నాశనం చేసింది. దోపిడీ భూ సంబంధాలను మోపింది. పేదరికాన్ని విస్తరించింది. అదే సమయంలో, అది ఆధునిక కార్మికవర్గాన్ని సృష్టించి, భారతీయ విప్లవకారులను ప్రత్యేకించి 1917 రష్యన్ విప్లవం తర్వాత ప్రపంచ సోషలిస్ట్ ఆలోచనల తరువాయి 2లో




> సిపిఐ రెండవ శతాబ్దంలోకి అడుగుపెడుతున్న సమయంలో భారతదేశం తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొంటుంది. మతతత్వం, పెరుగుతున్న ఫాసిజం గణతంత్ర పునాదులకు ముప్పుగా మారాయి. ఆర్థికాభివృద్ధికి తీవ్ర నిరుద్యోగం, అనిశ్చితి, విస్తృతమవుతున్న అసమానతలు తోడయ్యాయి.

> మన ముందున్న కర్తవ్యం స్పష్టంగా ఉంది. వ్యవస్థల్లో క్షీణ ప్రభావాన్ని ప్రక్షాళన చేయడం, గణతంత్రాన్ని తిరిగి సాధించడం, సమానత్వం, లౌకికవాదం, న్యాయం పునాదులపై భారతదేశాన్ని పునర్నిర్మించడం.



అజయ్ భవన్‌లో పార్టీ పతాకాన్ని శుక్రవారం ఆవిష్కరించిన డి.రాజా



# ప్రపంచం
WORLD NEWS

## కెనడాలో భారత వైద్య విద్యార్థి కాల్చివేత

**టొరంటో:** కెనడాలో భారత వైద్యవిద్యార్థి కాల్పుల్లో మరణించాడు. టొరంటోలోని స్కార్బరో యూనివర్సిటీ క్యాంపస్ సమీపంలో వైద్యవిద్యార్థి కాల్పుల్లో మరణించాడు. మృతుణ్ని శివాంక్ అవస్థిగా గుర్తించారు. అతడి వయసు ఇరవై సంవత్సరాలు. మంగళవారం మధ్యాహ్నం దాటాక 3.30 గంటలకు ఈ ఘటన జరిగినట్లు కెనడా బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ ప్రకటించింది. ఒకప్పుడు నదివెరుకుండా భారత విద్యార్థి కాల్పులకు గురై రోడ్డు మీద పడి ఉండటాన్ని గుర్తించారు. వెంటనే పోలీసులకు తెలియజేశారు. ఓల్డ్ కింగ్‌స్టన్ రోడ్‌లో ఘటన జరిగింది. ఘటనాస్థలంలో సాక్ష్యాలకోసం పోలీసులు పరిశీలిస్తున్నారు. ఇదిలా ఉండగా టొరంటోలోని భారత కాన్సులేట్ కార్యాలయం వైద్య విద్యార్థి హత్య ఘటనపట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. మృతుడి కుటుంబంతో కాన్సులేట్ కార్యాలయం సంభాషణలు చేస్తోంది. వారికి పూర్తి సహకారం అందించి అండగా ఉంటామని ఎక్స్ వేదికగా కాన్సులేట్ కార్యాలయం ప్రకటించింది. కాల్పుల ఘటన వార్త తెలిసిన వెంటనే యూనివర్సిటీలో విషాదఛాయలు అలముకున్నాయి. టొరంటో యూనివర్సిటీ వెంటనే విద్యార్థులందరూ జాగ్రత్తగా ఉండాలని ఒక నోటీసు జారీ చేసింది.

## బంగ్లాదేశ్‌లో మరో మైనార్టీ హిందూ హత్య

ఇది విద్వేష హత్య కాదు : యూనుస్

**ఢాకా/న్యూఢిల్లీ:** బంగ్లాదేశ్‌లో మరో మైనార్టీ హిందువును స్థానికులు కొట్టి చంపారు. పంగ్సా ఉపజిల్లాలోని రాజ్‌బరి టౌన్‌లో బుధవారం ఈ ఘటన జరిగిందని పోలీసులు చెప్పారు. హతుణ్ణి అమృత్ మండల్‌గా గుర్తించారు. ఐతే అమృత్ మండల్ ఒక నేరస్థుల ముఠాను ఏర్పాటు చేసి వారిని పెంచిపోషిస్తున్నాడని, దోపిడీలకు, బలవంతపు వసూళ్ళకు పాల్పడుతున్నాడని అతడిపై ఆరోపణలు చేసి కొట్టి చంపారు. బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ ప్రధాన సలహాదారు మహ్మద్ యూనుస్ ఈ హత్య ఘటనను తీవ్రంగా ఖండించారు. ఇది హిందూ మైనార్టీలపై మతోన్మాద దాడి కాదని సమర్థించారు. బంగ్లాదేశ్ ప్రభుత్వం అక్రమ చర్యలను, దోపిడీలను, హింస, మతోన్మాదాలను సహించబోదని ఆయన అన్నారు. బుధవారం అమృత్ మండల్‌ను ఆయనతోపాటు వ్యక్తులపై స్థానికులు దాడి చేశారు. ఒక ఇంట్లోకి చొరబడి డబ్బులు ఇవ్వాలని బలవంతపు వసూళ్ళకు తెగబడ్డాడని అతడిపై ఆరోపణలు వచ్చాయి. స్థానికులు దాడి చేస్తున్న విషయం తెలియగానే పోలీసులు అక్కడికి చేరుకున్నారు. తీవ్రగాయాలతో ఉన్న మండల్‌ను పోలీసులు మధ్యాహ్నం రెండు గంటలకు ఆసుపత్రికి తరలించారు. ఐతే అప్పటికే అతడు మరణించినట్లు వైద్యులు చెప్పారని పంగ్సా సర్కిల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ దెబ్రత సర్కార్ చెప్పారు.

**భారత విదేశీ మంత్రిత్వశాఖ తీవ్ర ఆందోళన**

బంగ్లాదేశ్‌లో మైనారిటీ మతస్థులపై నిరంతర శత్రుత్వం, దాడులు కొనసాగడంపై భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ (ఎంఇఎ) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. హింసాత్మకమైన, మతోన్మాద దాడులు విరామం లేకుండా కొనసాగుతున్నాయని పేర్కొంది. ఎంఇఎ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ శుక్రవారం పాత్రికేయులతో మాట్లాడుతూ పొరుగుదేశంలో మైనారిటీ వర్గాలపై తీవ్ర విద్వేషం, శత్రుత్వ చర్యలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని, భారత్‌కు సమస్యగా ఉందని అన్నారు. మైమెన్‌సింగ్‌లో హిందూ కార్మికుడు దీపూ చంద్ర దాస్ (27) హత్య, దహన ఘటనలకు కారకులైన వారిని చట్టం ముందు నిలబెట్టి కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. బంగ్లాదేశ్‌లో నిత్యం జరుగుతున్న పరిణామాలను భారత ప్రభుత్వం చాలా సునిశితంగా పరిశీలిస్తోందని చెప్పారు. ఆ దేశంలో మహ్మద్ యూనుస్ ప్రభుత్వ హయాంలో ఇప్పటిరకూ మైనారిటీలకు వ్యతిరేకంగా 2,900 ఘటనలు జరిగాయి. బంగ్లాదేశ్‌లో జరుగుతున్న మత విద్వేషం, దాడులను 'మీడియా చిన్న విషయాన్ని పెద్దదిగా చూపిస్తోంది' అనే పేరుతో పక్కకు తోసేయడానికి వీల్లేదని రణధీర్ జైస్వాల్ అన్నారు. బంగ్లాదేశ్‌లో శాంతి, సుస్థిరతలతోపాటు రెండు పొరుగుదేశాల ప్రజల మధ్యా సన్నిహిత సంబంధాలను భారత్ కోరుకుంటున్నదన్నారు. బంగ్లాదేశ్‌లో ఫిబ్రవరిలో జరిగే ఎన్నికలు స్వేచ్ఛగా, న్యాయబద్ధంగా, సజావుగా జరిగేందుకు భారత్ పూర్తి మద్దతు ఇస్తుందన్నారు.

## నైజీరియాలో క్రిస్మస్ రోజు ఐఎస్‌పై అమెరికా దాడులు

పలువురు ఉగ్రవాదులు మృతి



**అబుజా:** పశ్చిమ ఆఫ్రికాదేశం నైజీరియాలో ఐఎస్ఐఎస్ (ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఇరాక్ అండ్ సిరియా) ఉగ్రవాదులపై క్రిస్మస్ పర్వదినాన గురువారం అమెరికా క్షిపణులతో దాడులు చేసింది. ఈ దాడుల్లో అనేకమంది ఐఎస్ ఉగ్రవాదులు మరణించారు. వాయువ్య నైజీరియాలో అమెరికా సైన్యం క్షిపణులతో దాడులు చేసిందని నైజీరియా ప్రభుత్వం కూడా ధ్రువీకరించింది. వ్యూహాత్మక సహకారంతో ఈ దాడులు చేసినట్లు నైజీరియా విదేశీమంత్రిత్వశాఖ రాజధాని అబుజాలో విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. అనేక దశాబ్దాలుగా అమెరికా విదేశాలలో యుద్ధాలలో మునిగితేలుతోందని, ఈ పరిస్థితి నుండి దేశాన్ని బయట పడేస్తామని, ఎవరి వ్యవహారాల్లో జోక్యం చేసుకునేది లేదని 2024 అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో చేసిన వాగ్దానాన్ని ట్రంప్ ఈ తాజా దాడులతో మరోసారి ఉల్లంఘించారు. దీనిపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యంత్రాంగం కూడా ఒక ప్రకటన చేస్తూ నైజీరియా ప్రభుత్వం చేసిన విజ్ఞప్తి మేరకే ఈ దాడులు చేసినట్లు పేర్కొంది. కానీ ట్రంప్ చాలా రోజులుగా నైజీరియాలో ఐఎస్ఐఎస్ ఉగ్రవాద స్థావరాలపై దాడులు చేస్తామని సోషల్ మీడియా ద్వారా హెచ్చరికలు చేస్తూ వచ్చారు. నైజీరియా పత్రికలు కూడా ఈ వార్తలను చాలా ప్రముఖంగా ప్రచురిస్తూ వచ్చాయి. నైజీరియాలో క్రైస్త మతస్థులపై ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాదులు ఎడతెగని దాడులు చేస్తూ వారి మనుగడను సవాలు చేస్తున్నారని, వారి స్థావరాలను ధ్వంసం చేయక తప్పదని ట్రంప్ గతంలో చేసిన ప్రకటనలను నైజీరియా పత్రికలు తాజాగా గుర్తుచేస్తున్నాయి. అనేక నెలలపాటు ట్రంప్ నైజీరియా ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ వచ్చారు. నైజీరియాలో క్రైస్తవులపై ఇస్లామిక్ ఉగ్రవాదుల దాడులను అరికట్టడంలో ప్రభుత్వంవిఫలమైందని ట్రంప్ విమర్శిస్తూ చివరకు ఉగ్రవాదులపై దాడులు చేసేందుకు ఆదేశాలు జారీ చేశారు. ఇటీవలి సంవత్సరాలలో ఇంకా చెప్పాలంటే శతాబ్దాల చరిత్రలో ఎన్నడూలేనిరీతిలో నైజీరియాలో క్రైస్తవులపైదాడులు పెరిగిపోయాయని, అమాయకులైన క్రైస్తవులను ఇస్లామిక్ ఉగ్రవాదులు హతమారుస్తున్నారని, వారికి గుణపాఠం చెప్పేందుకే దాడులు చేసినట్లు వైట్‌హౌస్ ప్రకటించింది.

## హోండూరాస్ అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ విధేయుడు నస్రీ అస్ఫురా గెలుపు



**తెగుసిగల్ప:** సెంట్రల్ అమెరికా దేశం హోండూరాస్ అధ్యక్ష ఎన్నికల్లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బహిరంగంగా మద్దతు ఇచ్చిన ఆయన విధేయుడు నస్రీ జువాన్ అస్ఫురా జెబ్రాహ్ (67) విజయం సాధించారు. కానీ ఆ దేశ కాంగ్రెస్ అధ్యక్షుడు లూయిస్ రెడోండో సోషల్ మీడియాలో పోస్టింగ్ పెడుతూ ఈ ఎన్నికల ఫలితాలు పూర్తిగా చట్టవిరుద్ధం, న్యాయవిరుద్ధమని విమర్శించారు. నెలరోజుల క్రితం పోలింగ్ జరిగింది. సాంకేతిక కారణాల రీత్యా రెండుసార్లు కౌంటింగ్ వాయిదా పడింది. ఐతే ఈ ఫలితాలను పట్టికలో ఉంచడానికి ఒక ప్రైవేటు కంపెనీకి బాధ్యతలు అప్పగించామని, వారివల్లే తీవ్ర జాప్యం జరిగిందని ఎన్ఈసి (నేషనల్ ఎలక్టోరల్ కౌన్సిల్) అధ్యక్షురాలు అనాపావోలా హాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రియల్‌టైమ్ ఫలితాలను ప్రదర్శించే పోర్టల్ క్రాష్ అవడంతో ఫలితాల ప్రకటన నిలిచిపోయిందన్నారు. ఈ సందర్భంగాఅమెరికా విదేశాంగమంత్రి మార్కో రుబియో ఒక ప్రకటన చేస్తూ, హోండూరాస్‌లో ఉన్న అన్ని రాజకీయపార్టీలూ ఎన్నికల సంఘం తీర్పును గౌరవించాలని, అప్పుడే శాంతియుత వ్యవస్థలో అధికార మార్పిడి సాధ్యం అవుతుందని ఉద్ఘాటించారు. 1940వ దశకంలో ఇజ్రాయెలీ–అరబ్ సంఘర్షణ సమయంలో సెంట్రల్ అమెరికాకు వలస వచ్చిన క్రిస్టియన్ పాలస్తినా కుటుంబానికి చెందిన అస్ఫురా 2026 జనవరి 27వ తేదీన ఆయన అధ్యక్ష పదవీ బాధ్యతలు తీసుకుంటారు. కన్జర్వేటివ్ నేషనల్ పార్టీ (సిఎన్‌పి)కి చెందిన అస్ఫురాకు 40.27 శాతం ఓట్లు లభించాయి. అధికార లిబరల్ పార్టీ తరఫున అధ్యక్ష అభ్యర్థిగా పోటీ చేసిన సాల్వాదార్ నస్రల్లా (72) కు 39.53 శాతం ఓట్లు లభించాయి. నేషనల్ ఎలక్టోరల్ కౌన్సిల్ (ఎన్ఈసి) అస్ఫురాను విజేతగా ప్రకటించింది. నవంబరు 30వ తేదీన హోండూరాస్‌లో అధ్యక్ష పదవికి ఎన్నికలు జరిగాయి. దీంతో పాటే 128 మంది సభ్యులున్న నేషనల్ కాంగ్రెస్‌కు, సెంట్రల్ అమెరికన్ పార్లమెంటులో 20 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. లాటిన్ అమెరికా దేశాలపై ట్రంప్ తన ప్రభావం చూపిస్తూ ఉండటంతో ఇటీవలికాలంలో ఈ ప్రాంతంలో జరుగుతున్న ఎన్నికల్లో ట్రంప్ అనుకూల మితవాదపార్టీ నాయకులే వరుస విజయాలు సాధిస్తున్నారు. చిలీలో కూడా ట్రంప్ మద్దతు ఇచ్చిన పచ్చి మితవాది జోస్ ఆంటోనియో కాస్ట్ అధికారంలోకి వచ్చారు. దశాబ్దాలుగా అధికారంలో ఉన్న కమ్యూనిస్టు పాలనకు ట్రంప్ తెరదించారు.

శాన్‌ఫ్రాన్సిస్కోలో హైస్కూలు విద్యాభ్యాసం చేసిన అస్ఫురా హోండూరాస్ యూనివర్సిటీలో సివిల్ ఇంజనీరింగ్ పూర్తిచేశారు. మొదట ఒక మున్సిపల్ ప్రాసిక్యూటర్‌కు అసిస్టెంట్‌గా పనిచేశారు. తర్వాత మేయర్ నారా మెల్గారెక్ సహాయకుడుగా పనిచేశారు. 2010 2014 వరకు నేషనల్ కాంగ్రెస్ సభ్యుడుగా ఉన్నారు. 2014 2022 వరకు దేశరాజధాని తెగుసిగల్ప మేయర్‌గా పనిచేశారు. 2020లో ఆయన అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నారు. 2021లో నేషనల్‌పార్టీ తరపు దేశాధ్యక్షుడిగా పోటీచేసి ఓడిపోయారు. 2025లో మరోసారి పోటీచేసి ట్రంప్ మద్దతుతో విజయం సాధించారు.

## ఎర్రజెండాను సగర్వంగా తీసుకెళదాం!

(మొదటి పేజీ తరువాయి)

స్రవంతులకు చేరువయ్యేలా చేసింది. విదేశాలలో మార్క్సిజంకు దగ్గరైన లేదా అంతర్జాతీయ నెట్‌వర్క్‌ల ద్వారా సన్నిహితమైన భారతీయ కార్యకర్తలు, విప్లవకారులు జాతీయ విముక్తి, సామాజిక చైతన్యం విడదీయరానివని గ్రహించడం ప్రారంభించారు. ఈ అవగాహనే 1925 డిసెంబర్‌లో కాన్పూర్‌లో సిపిఐని స్థాపించే విధంగా సంస్థాగత రూపంలోకి పరిణతి చెందింది.

**మార్క్సిస్టు సిద్ధాంతం, భారతీయ వాస్తవాలు**

మార్క్సిస్టు సిద్ధాంతం, భారతీయ వాస్తవికతల మూలాలు కలిగిన విప్లవాత్మక పార్టీని నిర్మించడానికి కట్టుబడి ఉన్న విప్లవకారులు, కార్మిక సంఘాలు, సామ్రాజ్యవాద వ్యతిరేక కార్యకర్తలను కాన్పూర్ సమావేశం ఒకచోటకు చేర్చింది. వలస పాలనకు వ్యతిరేకంగా పోరాటంలో సిపిఐ పాత్ర రాజీలేనిది, అత్యంత దేశభక్తితో కూడుకున్నది. సామ్రాజ్యవాద శక్తితో సర్దుబాటు కోరుకునే జాతీయవాద సమూహాల మాదిరిగా కాకుండా, కమ్యూనిస్టులు వలసవాదాన్ని రాజకీయ ఆధిపత్యం ద్వారా ఆర్థిక దోపిడీని కొనసాగించే వ్యవస్థగా అర్థం చేసుకున్నారు. వారు ట్రేడ్ యూనియన్ పోరాటాలు, రైతు ఉద్యమాలు, అజ్ఞాత జీవితం నుంచి ప్రతిఘటన, సైద్ధాంతిక పోరాటాల రూపాలలో బ్రిటిష్ పాలనపై పోరాడారు. వారి దేశభక్తి ఉన్నత వర్గాల చర్చలలో కాకుండా, సామాన్య భారతీయుల జీవితాలు, పోరాటాలలో పాతుకుపోయింది. సిపిఐ అత్యంత ముఖ్యమైన ఘనతలలో ఒకటి ప్రజా సంఘాల నిర్మాణానికి ప్రాధాన్యతనివ్వడం. సమాజాన్ని దానిలోని వైవిధ్యాలతో సమీకరించకుండా రాజకీయ విముక్తి సాధించలేమని పార్టీ గుర్తించింది. ఇది ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఎఐటియుసి), ఆల్ ఇండియా కిసాన్ సభ (ఎఐకెఎస్), ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్(ఎఐఎస్ఎఫ్), ప్రోగ్రెసివ్ రైటర్స్ అసోసియేషన్(పిడబ్ల్యుఎ), ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ (ఇప్టా) వంటి సాంస్కృతిక, రచయితల సంస్థలు, లేదా అనంతరకాలంలో మహిళలు, యువజన సంఘాలు వంటి వేదికలను నిర్మించడానికి, బలోపేతం చేయడానికి సహాయపడింది. ఈ పొందికల ద్వారా కార్మికులను, రైతులను, విద్యార్థులను, మేధావులను, కళాకారులను సిపిఐ ఉమ్మడి పోరాటాల చుట్టూ ఏకం చేసింది. ప్రజా పోరాటాల ద్వారానే కమ్యూనిస్టు రాజకీయాలు లోతైన మూలాలను కలిగి ఉన్నాయి. భూమి, ఆత్మగౌరవం కోసం జరిగిన చారిత్రక పోరాటాలకు సిపిఐ నాయకత్వం వహించింది. భూస్వామ్య అణచివేతకు వ్యతిరేకంగా తెలంగాణ సాయుధ పోరాటం, బెంగాల్‌లో రైతులకు తమ ఉత్పత్తులపై హక్కులను దఖలు పరిచిన తెభాగ ఉద్యమం, భూస్వామ్య నిరంకుశత్వానికి వ్యతిరేకంగా కేరళలో పున్నప్ర–వయలార్ పోరాటం, తంజావూర్ డెల్టా, మిలిటెంట్ భూపోరాటాలు ఉన్నాయి. అలాగే కాన్పూర్, బొంబాయి, కలకత్తా, పుదుచ్చేరి వంటి పారిశ్రామిక కేంద్రాలలో, కమ్యూనిస్టు నాయకత్వంలో ట్రేడ్ యూనియన్ ఉద్యమం కార్మికుల హక్కులు, వేతనాలు, గౌరవాన్ని కాపాడుతూ ప్రధాన కార్మిక విజయాలను సాధించింది.

సిపిఐ జాతీయ పోరాట ఎజెండాను నిర్ణయాత్మకంగా సమూలంగా మార్చింది. రాజీ మార్గంగా అధినివేశ ప్రతిపత్తి (డొమినియన్ స్టేటస్) గురించి చర్చించబడుతున్న సమయంలో, కమ్యూనిస్టులు సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం పట్టుబట్టారు. రాజ్యాంగ పరిషత్తు కోసం తొలినాళ్ళలోనే, అత్యంత స్థిరంగా డిమాండ్ చేసిన వారిలో వారు ఉన్నారు. ప్రజలచే ఎన్నుకోబడిన సర్వసత్తాక సంస్థ మాత్రమే ప్రజాస్వామ్య రాజ్యాంగాన్ని రూపొందించగలదని వాదించారు. ఈ డిమాండ్ తరువాత భారతదేశం స్వాతంత్ర్యం కోసం పరివర్తన చెందడానికి మూలంగా మారింది. భూ సంస్కరణలు, కార్మిక హక్కులు, సామాజిక సమానత్వం లేని స్వాతంత్ర్యం కేవలం విదేశీ పాలకులను స్వదేశీ ఉన్నత వర్గాలతో భర్తీ చేస్తుందని వాదిస్తూ, పార్టీ స్వాతంత్ర్య పోరాటానికి కేంద్రంగా నిర్మాణాత్మక సంస్కరణలను ఉంచింది.

కమ్యూనిస్టు నేతృత్వంలోని ఉద్యమాల ద్వారానే భూమి పునఃపంపిణీ, భూస్వామ్యవ్యవస్థ రద్దు, కౌలుదారుల రక్షణ, ట్రేడ్ యూనియన్ హక్కులు, కనీస వేతనాలు, సామాజిక భద్రతలను జాతీయ ఎజెండాలోకి ప్రవేశపెట్టారు. కులాన్ని సాంస్కృతిక అవశేషంగా కాకుండా వర్గ దోపిడీతో లోతుగా ముడిపడి ఉన్న భౌతిక వ్యవస్థగా గుర్తించి, సిపిఐ వర్గరహిత, కులరహిత ప్రపంచం దృక్పథాన్ని స్పష్టంగా వ్యక్తీకరించింది. కుల అణిచివేతను ఆర్థిక వ్యవస్థలకు అనుసంధానించడం ద్వారా పార్టీ సామాజిక న్యాయం అనే అర్థాన్ని విస్తృతం చేసి, స్వాతంత్ర్య పోరాటానికి పరివర్తన కలిగించే సారాంశాన్ని అందించింది. ఈ డిమాండ్‌లలో చాలా వరకు రాజ్యాంగంలో, స్వాతంత్ర్యానంతర విధానపరమైన చర్చల్లో ప్రతిబింబించాయి. 1947లో స్వాతంత్ర్యం సిపిఐ పోరాటాన్ని ముగించలేదు. భూస్వామ్య వ్యవస్థలను కూల్చివేయడం, గుత్తాధిపత్య పెట్టుబడిదారీ విధానాన్ని నిరోధించడం, ప్రజాస్వామ్యాన్ని వేళ్ళూనుకునేలా చేయడంపై దృష్టి సారించిన కొత్త దశకు ఇది నాంది పలికింది. భూస్వామ్య వ్యతిరేకంగా చారిత్రాత్మక రైతు పోరాటాలకు పార్టీ నేతృత్వం వహించింది. అలాగే కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, త్రిపుర, బిహార్ వంటి రాష్ట్రాలలో భూ సంస్కరణలను ముందుకు తీసుకెళ్లడంలో నిర్ణయాత్మక పాత్ర పోషించింది. పార్లమెంటరీ, పార్లమెంటేతర రంగాలలో, సిపిఐ ఆర్థిక వ్యవస్థలోని కీలక రంగాలలో ప్రభుత్వ ఆధిపత్యాన్ని ఛాంపియన్ చేసింది. బ్యాంకులు, బొగ్గు, బీమా, ఇతర కీలక పరిశ్రమల జాతీయాకరణను నిరంతరం సమర్థించింది. వ్యూహాత్మక వనరులు అనేవి జాతీయ అభివృద్ధి, సామాజిక సంక్షేమం కోసం ఉపయోగపడాలే తప్ప ప్రైవేట్ సముపార్జన కోసం కాదని సిపిఐ ఎల్లప్పుడు వాదించింది.

**సమాఖ్యవాద పరిరక్షణ**

భారతదేశ ప్రజాస్వామ్య నిర్మాణాన్ని బలోపేతం చేసేందుకు సమాఖ్యవాదం, భాష, సాంస్కృతిక వైవిధ్యాన్ని సిపిఐ గట్టిగా సమర్థిస్తుంది. దళితులు, ఆదివాసీలు, మైనారిటీలు, మహిళల హక్కులను కాపాడటంలో, అలాగే లౌకికవాదం , హేతుబద్ధమైన ఆలోచనలకు దృఢంగా కట్టుబడి ఉండటంలో సామాజిక న్యాయం పట్ల సిపిఐ నిబద్ధత వ్యక్తమవుతుంది. దశాబ్దాలుగా, సంస్కరణ, పురోగతి కోసం, ప్రతీఘాత శక్తులపై ప్రతిఘటనకు ఎర్రజెండా సంకేతంగా నిలిచింది. ఇవాళ సిపిఐ తన రెండవ శతాబ్దంలోకి అడుగుపెడుతున్న సమయంలో భారతదేశం తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొంటుంది. మతతత్వం, పెరుగుతున్న ఫాసిజం గణతంత్ర పునాదులకు ముప్పుగా మారాయి. ఆర్థికాభివృద్ధికి తీవ్ర నిరుద్యోగం, అనిశ్చితి, విస్తృతమవుతున్న అసమానతలు తోడయ్యాయి.

**వామపక్షాల ముందున్న సవాలు**

మరోసారి ప్రజల ఆకాంక్షలకు పర్యాయపదంగా మారడమే వామపక్షాల ముందున్న సవాలు. దీనికి సమానత్వం, ప్రజాస్వామ్యం, న్యాయం అనే తన ప్రధాన విలువలను గట్టిగా కొనసాగిస్తూనే, సమకాలీన పెట్టుబడిదారీ విధానం పట్ల దాని అవగాహనను పునరుద్ధరించడం అవసరం.

మన చరిత్రలోని ఈ కీలక సమయంలో సిపిఐ శతాబ్ది కేవలం గుర్తుంచుకునే క్షణం మాత్రమే కాదు, ఇది కార్యాచరణకు పిలుపు. ప్రజాస్వామ్యం దాడికి గురవుతోంది. ప్రజల హక్కులు, జీవనోపాధి క్రమంగా క్షీణిస్తున్నాయి. స్వాతంత్ర్య ఉద్యమం సాధించిన విజయాలు ఉద్దేశపూర్వకంగా రద్దు చేయబడుతున్నాయి. ఆర్ఎస్ఎస్ – బిజెపి కలయిక మన సామాజిక సంఘీభావాన్ని కూల్చివేసి, మన ఆర్థిక సార్వభౌమత్వాన్ని డొల్ల చేసి, రాజ్యాంగాన్ని ధ్వంసం చేయడం ద్వారా నిరంకుశత్వాన్ని, కొన్ని విభాగాలను వెలివేసే వ్యవస్థను విధించడానికి ప్రయత్నిస్తుంది. ఈ ప్రమాదాన్ని విడివిడిగా నిరోధించలేము. సిపిఐ, వామపక్షాలను బలోపేతం చేసి, మరింత చేరువై విస్తృత ప్రజాస్వామ్య ప్రతిఘటనగా ఆవిర్భవించాలి. బలమైన నిర్మాణాలుగా కొనసాగుతున్న వర్గ దోపిడీ, కుల అణచివేత, పితృస్వామ్య వ్యవస్థలపై సంఘటిత, రాజీలేని పోరాటాలు అవసరం. మన ముందున్న కర్తవ్యం స్పష్టంగా ఉంది. వ్యవస్థల్లో క్షీణ ప్రభావాన్ని ప్రక్షాళన చేయడం, గణతంత్రాన్ని తిరిగి సాధించడం, సమానత్వం, లౌకికవాదం, న్యాయం పునాదులపై భారతదేశాన్ని పునర్నిర్మించడం. ఐక్యంగా మనం ప్రతిఘటించాలి. ఐక్యంగా మనం ముందుకు సాగాలి. ఐక్యంగా మనం సమానత్వంతో కూడిన, ప్రజాస్వామ్యబద్ధ, సుసంపన్నమైన ఒక నూతన భారతదేశాన్ని సృష్టించాలి. ఎర్ర జెండా మరింత ఎత్తుకు ఎగరాలి. ప్రజలు విజయం సాధించాలి. భవిష్యత్తు మనదే.

## బహిరంగ సభ

(మొదటి పేజీ తరువాయి)

మీడియాతో మాట్లాడుతూ ఖమ్మంలో జరిగే బహిరంగసభలో సౌహార్ద్ర సందేశం నిమిత్తం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, అలాగే జాతీయ వామపక్ష పార్టీల నాయకులను, 40 దేశాల నుంచి ప్రతినిధులను ఆహ్వానిస్తున్నామని వివరించారు. సభకు ఐదు లక్షల మందిని సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వివరించారు. జనవరి 19న జాతీయ వామపక్ష పార్టీల నాయకులతో సదస్సు, ఆ తర్వాత సిపిఐ జాతీయ కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తామని కూనంనేని తెలిపారు. వందేళ్ల ముగింపు ఉత్సవం సందర్భంగా నిర్వహించే సిపిఐ బహిరంగ సభ ద్వారా ప్రజలకు విశ్వాసం కలగాలన్నారు. సభను జయప్రదం చేసేందుకు జిల్లాల వారిగా జాతాలను నిర్వహిస్తామని, ఎపి, తమిళనాడు, కేరళ, వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో హాజరుకానున్నట్లు తెలిపారు.

## బిజెపికి వణుకు : పల్లా

(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. సర్దార్ వల్లభాయ్‌పటేల్ స్వయంగా వచ్చి హైదరాబాద్‌ను విలీనం చేసుకున్నట్టు చరిత్రను వక్రీకరిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేసేందుకు నాటి నిజాం నిరాకరించడంతో మఖ్దూం మొయియుద్దీన్, రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డిలు తెలంగాణ సాయుధ పోరాటానికి పిలుపునిచ్చారని, ఈ క్రమంలో మూడు వేల గ్రామాలను విముక్తి చేశారని గుర్తు చేశారు. నిజాం నవాబుల ఏజెంట్లు ఎర్రజెండాలను చూసి భయపడ్డారని, గ్రామాలన్నీ కమ్యూనిస్టుల వశమౌతాయని, వారంతా నిజాం నవాబును మొరపెట్టుకుంటే, ఆయన సర్దార్ వల్లభాయపటేల్‌ను ఆహ్వానించి భారతదేశంలో విలీనమయ్యారని పల్లా గుర్తు చేశారు. అధికారం కోల్పోగానే కొన్ని రాజకీయ పార్టీలు తెరమరుగవుతున్నాయని, కమ్యూనిస్టు పార్టీ అవసరం లేదని చెప్పే ధైర్యం ఎవరికీ లేదన్నారు. ఎన్నికల సమయంలో ఇతర రాజకీయ పార్టీలు కూడా కమ్యూనిస్టుల భావజాలం, కమ్యూనిస్టుల త్యాగాల గురించి మాట్లాడుతారని, భారత కమ్యూనిస్టు పార్టీ చరిత్ర,నాయకుల సిద్ధాంతాలను, నినాదాలను ఉచ్ఛరించకుండా ఏ రాజకీయ పార్టీ కూడా అధికారంలోనికి రాలేదని, టిఆర్ఎస్, టిడిపి, కాంగ్రెస్ కూడా కమ్యూనిస్టుల ప్రణాళికపైన మాట్లాడారని వివరించారు. ఎన్నికలు పూర్తి కాగానే ఆ రాజకీయ పార్టీల ఎజెండాలే వేరుగా ఉంటాయన్నారు. దేశంలోనే మొట్టమొదటి సారి భూ సంస్కరణలు తీసుకొచ్చిన మొట్టమొదటి రాష్ట్రం కేరళ అని అన్నారు. అందరికీ విద్య, వైద్యం అనే నినాదంతో కేరళలోని కమ్యూనిస్టు ప్రభుత్వం పనిచేస్తుందని, అతి పేదరిక నిర్మూలన రాష్ట్రంగా కేరళ ప్రభుత్వం ప్రకటించిన విషయాన్ని పల్లా గుర్తు చేశారు.

## భారత్ ఆందోళన

(మొదటి పేజీ తరువాయి)

షెడ్యూలును సామూహికంగా రద్దు చేయడంవల్ల, తనిఖీలవల్ల ఉద్యోగపరంగా చెల్లుబాటైన వీసాతో అమెరికాకు తిరిగివెళ్ళేవారు నిస్సహాయంగా దేశంలోనే ఉండిపోయారన్నారు. వేలాదిమంది వీసా ఇంటర్వ్యూలకోసం ఎదురుచూస్తున్నారని, ఈ విషయం అమెరికా దృష్టికి తీసుకువచ్చినట్లు చెప్పారు. వీసాల గడువు పొడిగించకపోవడంతో చాలామంది భారతీయులు స్తంభించిపోయారని, పొడిగింపుకోసం ఎదురుచూస్తున్నారని, దీనివల్ల వారు, వారి కుటుంబ సభ్యులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఈ ఆటంకాలను కొంతలో కొంత మేరకైనా తగ్గించి భారతీయ కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్య తీవ్రత పరిష్కరించాలని అడిగేందుకు క్రియాశీల చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. నిర్ణీత ప్రకారం దరఖాస్తుదారుల ఇంటర్వ్యూలు ఈనెల రెండో వారంలోనే జరగాల్సి ఉంది. కానీ దరఖాస్తుదారుల సోషల్ మీడియా ఖాతాలను పరిశీలించాలనే పేరుతో అమెరికా ఇమ్మిగ్రేషన్ అధికారులు ఎటూ చెప్పకుండా ఆకస్మికంగా ఇంటర్వ్యూలను అనేక నెలలపాటు నిరవధికంగా వాయిదా వేశారు. తిరిగి ఎప్పుడు ఈ ఇంటర్వ్యూలు జరుగుతాయన్న విషయంపై పూర్తి స్పష్టత లేకపోయినప్పటికీ వచ్చే ఏడాది మే నెల నాటికి జరిగే అవకాశం ఉందని అమెరికా ఇమ్మిగ్రేషన్ విభాగం తెలియజేసింది. ఈ లోపు సంబంధిత దరఖాస్తుదారులవారి నిర్దేశిత నిబంధనల ప్రకారం సోషల్ మీడియా హిస్టరీలను తనిఖీలు చేసే ప్రక్రియను వారు పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇంటర్వ్యూలు వాయిదా వేయడం, స్పష్టత ఇవ్వకపోవడం అమెరికా అంతర్గత, సార్వభౌమాధికార వ్యవహారమైనప్పటికీ భారత దరఖాస్తుదారుల సమస్యను అమెరికా అధికారుల దృష్టికి తీసుకువెళ్ళామని జైస్వాల్ చెప్పారు.

## హద్దుండాలి

(మొదటి పేజీ తరువాయి)

పంపిణీతో పేద ప్రజలు సంతోషంగా ఉన్నట్లు తెలిపారు. ఈ క్రమంలో రాష్ట్రంలో జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో చక్కటి ఫలితాలు రాగా, అదే స్ఫూర్తితో గజ్వేల్‌లో ఎంపిటిసి, జెడ్పిటిసి ఎన్నికల్లో సత్తా చాటాలని ఆకాంక్షించారు. కార్యకర్తల కష్టంతోనే 92 సర్పంచ్ స్థానాలను గెలుచుకోగా, త్వరలోనే గజ్వేల్ సర్పంచులను సిఎంతో కలిపిస్తానని హామీ ఇచ్చారు. క్రమశిక్షణ కలిగిన గజ్వేల్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు జూబ్లీహిల్స్ ఎన్నికల్లో సైతం కష్టపడగా, సమిష్టి కృషితో కెసిఆర్‌ను ఎదుర్కొంటుండడం హర్షనీయమన్నారు. నియోజకవర్గ కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ నిమ్మ రంగారెడ్డి అధ్యక్షత వహించగా, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు, భూం రెడ్డి, ఎలక్షన్ రెడ్డి, డిసిసిబి మాజీ చైర్మన్ దేవేందర్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు నరేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, విజయ మోహన్, సర్దార్ ఖాన్, ప్రభాకర్ గుప్త, సర్పంచుల ఫోరం అధ్యక్షులు అశోక్‌రెడ్డి, వెంకటేష్, ఆయా మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సందీప్ రెడ్డి, రవీందర్ రెడ్డి, శ్రీనివాస్, కిష్టా గౌడ్, సుఖేందర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉండాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

ఈ సాంకేతికత విభిన్న రకాల నేరాలకు కూడా దారితీస్తోంది, సైబర్ నేరాలు అనేవి ఇప్పటివరకూ మనం ఏనాడూ వినని నేరాలు, నేరస్థులు సరికొత్త పంథాలో నేరాలు చేస్తూ న్యాయవ్యవస్థకు సవాళ్ళు విసురుతున్నారు, ఇది పోను పోను మరింత పెద్ద సమస్యగా మారవచ్చు, చాలా తీవ్రమైన సమస్యగా రాబోయేరోజుల్లో మన ముందుకు వచ్చిని లబడవచ్చు'అని చెబుతూ, న్యాయవాదులు వీటిని ఎదుర్కోవడానికి, నిరూపణలకు భవిష్యత్తులో ఏ విధంగా తగిన సాధనాలను సమకూర్చుకోగలుగుతారో..! అని దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 'సైబర్ నేరాల కేసులను మనం విచారణ చేస్తున్నప్పుడు ఒక సైబర్ నేరస్థుడి బారిన పడిన బాధితుడితో మాట్లాడాలి, వారి సమస్యలు తెలుసుకోవాలి, ఈ విధమైన సవాళ్ళు ఎదుర్కొనేముందు మీరు పూర్తిగా వీటికి సంబంధించిన వృత్తిపరమైన విజ్ఞానాన్ని సమకూర్చుకున్నారా?' అని ప్రశ్నించారు. ఈ విజ్ఞానాన్ని, సంబంధిత వృత్తిపరమైన సాధనాలను సమకూర్చుకోవడానికి మనకు జాతీయస్థాయిలో ఒక జ్యుడీషియల్ అకాడమీ ఉన్నవిధంగానే ఒక లీగల్ అకాడమీ ఉండాలి అని ఉద్ఘాటించారు. 'న్యాయవాదుల సంఘంలో ఉండే సభ్యులు ఎప్పటికప్పుడు ఈ విషయాల్లో శిక్షణ పొందటానికి సమయం ఆసన్నమైంది, ఇది కేవలం ఒక్కరోజు లేదా 48 గంటల సమయంలో పొందే శిక్షణ కాదు, రోజువారీగా ఎప్పటికప్పుడు ఈ శిక్షణ తీసుకుంటూనే ఉండాలి, దీనికి రెండు నెలలపాటు అకాడమీలో చాలా కఠినతరమైన శిక్షణ పొందాల్సి ఉంటుంది, ఈ లీగల్ అకాడమీలో మనసొంత శిక్షకుల ముందు ఈ శిక్షణ తీసుకోవాలన్నారు. 'ఈ రంగానికి సంబంధించిన నిపుణులు పాఠ్యాంశాల వారీగా శిక్షణకు సంబంధించిన విధి విధానాలను, పద్ధతులను రూపొందించకపోతే న్యాయవాదులు వివిధ రకాలైన కేసులను పరిశీలించి బాధితులకు న్యాయం చేయడం, దోషులను గుర్తించడం కష్టమైపోతుంది, అందువల్ల ఇప్పుడు వృత్తిపరమైన కోర్సులను, అంకితభావంతో కూడిన సంస్థలను ఏర్పాటు చేసుకోవడానికి వీలుగా బార్ కౌన్సిల్ తగిన ప్రణాళికలను రూపొందించుకోవాల్సిన సమయం వచ్చింది' అని కర్తవ్యోపదేశం చేశారు. వివాదాల పరిష్కారం కోరుకునే బాధితులకు మధ్యవర్తిత్వం, కోర్టు కేసు విచారణ అన్నీ ఒక్కచోటో లభించే సమగ్ర వివాద పరిష్కార 'మల్టీ–డోర్ కోర్ట్‌హౌస్‌ను దార్శనికత దృష్టిలో భవిష్యత్తులో ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉందని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. పనాజీలో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ, కేవలం ట్రయల్ కోర్టులు మాత్రమే ఇప్పుడు ఒకచోట ఉన్నాయని, మధ్యవర్తిత్వం మరోచోట ఉందని, అలా కాకుండా మధ్యవర్తిత్వం కేసు విచారణ అన్నీ సమగ్రంగా బాధితులకు అందుబాటులో ఉండాలన్నారు. మధ్యవర్తిత్వం అంటే శస్త్రచికిత్స ద్వారా ప్రాణం ఉన్న రోగిని కాపాడేందుకు చేసే ప్రయత్నం లాంటిది, కోర్టులో కేసు విచారణ అంటే మృతదేహానికి పరీక్ష చేసి ఎక్కడ తప్పు జరిగిందనే విషయాన్ని నిర్ధారించి కార్యకారణ సంబంధాన్ని విశ్లేషించి దోష నిర్ధారణ చేసే వేదిక అని అన్నారు.

## హక్కులు హననం



(మొదటి పేజీ తరువాయి)

పల్లా వెంకట రెడ్డి, కె.రామకృష్ణ, జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్యపద్మ, సీనియర్ నాయకులు సయ్యద్ అజీజ్ పాషా హాజరయ్యారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి వందేళ్లు పూర్తయిందని, దోపిడీవర్గాల నుంచి మానవ జాతి విముక్తి కోసం అనేక త్యాగాలు, వీరోచిత పోరాటలు చేసిన ఘనమైన చరిత్ర సిపిఐకే ఉందన్నారు. బ్యాంకుల జాతీయకరణ, భూ సంస్కరణలు, రైతాంగ విముక్తి, కార్మికులకు 8గంటల పనిదినాలు, అసంఘటితరంగ కార్మికులు, దళితులు, బడుగు బలహీన వర్గాలకు, పీడిత వర్గాలు కూడా ప్రధాన స్రవంతిలో భాగస్వాములనే విషయన్ని సిపిఐ నినదించిందన్నారు. తెలంగాణ సాయుధ పోరాట చరిత్ర ప్రపంచ పుటల్లో లిఖించదగిందన్నారు. జైళ్లలోనే భారత కమ్యూనిస్టు పార్టీ పుట్టిందని, పుట్టుకలోనే పార్టీ గొంతు నులిమేయాలని ప్రయత్నించారని, కొందరికి యావజ్జీవ శిక్ష విధించారని, మరి కొందరిని ఉరి తీశారని, అనేక మంది నాయకులపై కుట్ర కేసులు నమోదు చేసినప్పటికీ వాటన్నింటినీ తట్టుకుని కమ్యూనిస్టులుగా నిలబడ్డారని గుర్తు చేశారు. కమ్యూనిజం, ఎర్రజెండా లేకపోతే ప్రజలకు రక్షణ కవచం లేదని, ఎప్పుడు ఏమైతుందోననే భయానక పరిస్థితులు ఉంటాయని తెలిపారు. ప్రధాని మోదీ, బిజెపి లాంటి తిరోగమనం, కార్పొరేట్లకు ఊడిగం చేసే సిద్ధాంతం కలిగిన వాళ్లు కమ్యూనిజం అంటేనే ఒక భూతంగా చూపించే ప్రయత్నం చేస్తున్నారని, కమ్యూనిస్టులు ఉండకూడదని కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఒక లక్ష్యాన్ని పెట్టుకున్నదన్నారు. పేదరికం లేకుండా చేస్తామని చెప్పాల్సిన ప్రభుత్వం, 2026 మార్చి నాటికి మావోయిస్టులు లేకుండా చేస్తామని చెప్పడం సిగ్గుచేటన్నారు. కమ్యూనిస్టులు, అర్బన్ నక్సలైట్ల పేరుతో ప్రజల తరపున ప్రశ్నించే వారిని లేకుండా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. బ్రిటీష్ కాలంలోనే పోరాటం చేసి సాధించుకున్న హక్కులను, చట్టాలను మోదీ ప్రభుత్వం తీసివేస్తోందని, కార్మికులకు సమ్మె చేసే హక్కు కూడా లేదని, రాష్ట్రంలో ఆర్‌టిసిలో కూడా అదే పరిస్థితి నెలకొందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా జీతాలు ఇచ్చే పరిస్థితి లేదని, ఇచ్చిన జీతాలు తగ్గిస్తున్నారన్నారు. మావోయిస్టుల గురించి మాట్లాడే వారిని కూడా జైలులో పెడుతున్నారని విమర్శించారు. కె.రామకృష్ణ మాట్లాడుతూ ఇటీవలే వందేళ్ల ఉత్సవాలను పూర్తి చేసుకున్న ఆర్‌ఎస్‌ఎస్ సంస్థ తమ వందేళ్ల చరిత్రలో ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. భారతస్వాతంత్ర్య పోరాటంలో ఆర్‌ఎస్‌ఎస్ తరపున ఒక్కరైనా జైలుకు వెళ్లారా?, స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారా?, ఏనాడైనా నాటి బ్రిటిష్ ప్రభుత్వాన్ని నిలదీశారా? ప్రశ్నించారు. ఈ దేశంలో సిపిఐ భారత కమ్యూనిస్టులందరికీ మాతృసంస్థ అని, తల్లి పార్టీ సిపిఐ తర్వాతనే మిగతా కమ్యూనిస్టు పార్టీలు ఆవిర్భవించాయన్నారు. అభివృద్ధి నిరోధక, మతోన్మాద శక్తిని ఎదిరించేందుకు కమ్యూనిస్టులందరూ ఏకం కావాల్సిన అవసరం ఉందని, కమ్యూనిస్టుల ఉద్యమ పునరేకీకరణ జరిగి మునుముందుకు సాగుతూ, విజయం సాధించాలని ఆయన చెప్పారు. సిపిఐ సీనియర్ నాయకులు సయ్యద్ అజీజ్ పాషా మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీకి మంచి స్థానం ఇవ్వాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారని, రాబోయే కాలంలో సిపిఐకి మంచి స్థానం దక్కుతుందన్నారు. దేశంలో 1950 నుంచి 1960 సంవత్సరం వరకు కమ్యూనిస్టు పార్టీనే ప్రధాన ప్రతిపక్ష పార్టీగా ఉండేదని గుర్తు చేశారు. దేశంలో మొదటి సారి జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో జవహర్‌లాల్ నెహ్రూ కంటే కూడా నల్లగొండ నుంచి ఎంపిగా పోటీచేసిన రావి నారాయణ రెడ్డికి అత్యధిక ఓట్లు సాధించారని వివరించారు.

కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, రమావత్ అంజయ్య నాయక్, ప్రజా సంఘాల నాయకులు ప్రేంపావని (శ్రామిక మహిళా ఫోరం) ఎన్.జ్యోతి(ఎన్ఎఫ్ఐడబ్ల్యు), ఎం.నర్సింహా, బి.వెంకటేశం, నందూరి కరుణకుమారి (ఎఐటియుసి), కలకొండ కాంతయ్య (తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం), పల్లె నర్సింహా, ఉప్పలయ్య (ప్రజానాట్యమండలి), వలీ ఉల్లా ఖాద్రీ (ఎఐవైఎఫ్), కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ (ఎఐఎస్ఎఫ్), సిపిఐ సీనియర్ నాయకులు ఉజ్జిని రత్నాకర్, సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్, సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, కార్యవర్గ సభ్యులు నెర్లేకంటి శ్రీకాంత్ పాల్గొన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

శాసనసభ నూతన కార్యదర్శిగా రేండ్ల తిరుపతి కార్యదర్శి చాంబర్‌లో శుక్రవారం పదవీ బాధ్యతలను స్వీకరించారు. ప్రస్తుత కార్యదర్శి డాక్టర్ వి.నరసింహాచార్యుల నుండి తిరుపతి బాధ్యతలను స్వీకరించారు. అనంతరం తిరుపతి, నరసింహాచార్యులు శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌ను ఆయన అధికార నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా తిరుపతికి స్పీకర్ ప్రసాద్ కుమార్ పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.





# పెట్టుబడిదారీ వ్యవస్థకు కాలం చెల్లింది

- ఎర్రజెండా వైపు చూస్తున్న ప్రపంచ యువత
- సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు
- వరంగల్ నగరంలో సిపిఐ శత వార్షికోత్సవాల భారీ ర్యాలీ




**ప్రజాపక్షం/వరంగల్ :** పెట్టుబడిదారీ వ్యవస్థకు కాలం చెల్లిందని, కమ్యూనిజమే ప్రత్యామ్నాయంగా ఎర్రజెండా వైపు చూస్తున్న ప్రపంచ యువత అని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ శత వార్షికోత్సవాల ముగింపు ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం వరంగల్ నగరంలోని రైల్వే స్టేషన్ నుండి చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ భాష్మియా అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో ముఖ్య అతిథిగా హాజరైన తక్కళ్లపల్లి శ్రీనివాస రావు మాట్లాడుతూ ప్రపంచంలో పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రత్యామ్నాయ సిద్ధాంతాన్ని కారల్ మార్క్స్ కనుగొన్నాడని ఆ సిద్ధాంతమే ప్రపంచంలో దోపిడీ నుండి మానవాళి విముక్తికి మార్గం చూపిందన్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థ రోజు రోజుకు సంక్షోభంలో కూరుకుపోతున్నదని, పెట్టుబడిదారీ వ్యవస్థ పతనంతో ప్రపంచ యువత ప్రత్యామ్నాయంగా ఎర్ర జెండా వైపు చూస్తున్నదని తెలిపారు. భారతదేశంలో భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి నూరు సంవత్సరాలు డిసెంబర్ 26కు పూర్తి చేసుకుంటున్నదని అని తెలిపారు. జాతీయ ప్రజాతంత్ర విప్లవం లక్ష్యంగా, సోషలిజం ధ్యేయంగా, సామాజిక న్యాయం లౌకికవాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమంలో సిపిఐ కీలక పాత్ర పోషించిందన్నారు. దేశ స్వాతంత్ర పోరాటంలో సిపిఐ అనేక త్యాగాలు చేసిందని, ఎంతోమంది అమరవీరులను అందించిన చరిత్ర సిపిఐదని అన్నారు. దున్ని వాడికి భూమి దక్కాలని, భూమిలేని నిరుపేదలకు భూమి పంచాలని పోరాడి లక్షలాది ఎకరాల భూములను పేదలకు పంచిందని, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాయుధ రైతాంగ పోరాటాన్ని చేపట్టి వేలాది గ్రామాలను విముక్తి చేసిన ఘన చరిత్ర సిపిఐకి మాత్రమే ఉందన్నారు. దేశంలో వామపక్ష పార్టీల ఐక్యతా పోరాటాలను ఉధృతం చేస్తూ, లౌకిక ప్రజాస్వామిక శక్తుల్ని ఏకం చేస్తూ ప్రజాస్వామ్య పోరాటాలను నిర్వహించడం జరుగుతున్నదన్నారు. అనంతరం వంద సంవత్సరాలు పురస్కరించుకొని కేక్ కట్ చేశారు.


## వరంగల్ నగరంలో కదం తొక్కిన ఎర్రదండు

వరంగల్ నగరంలో జరిగిన సిపిఐ శతవార్షికోత్సవాల ముగింపు ర్యాలీలో మహిళలు ఎర్ర చీరలు, పురుషులు ఎర్ర చొక్కాలు ధరించి ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్నారు. పాలకులు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్, మేకల రవి, జిల్లా సహాయ కార్యదర్శులు దండు లక్ష్మణ్, పనాస ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు గన్నారపు రమేష్, గుండె బద్రి, అక్కపెల్లి రమేష్, తోట చంద్రకళ, బుస్స రవీందర్, కందిక చెన్నకేశవులు, సంఘీ ఏలేందర్, అయితే యాకయ్య, వీరగోని శంకరయ్య, జిల్లా సమితి సభ్యులు ల్యాదల శరత్, ఓర్సు రాజు, తాళ్లపల్లి జాన్ పాల్, సుంకరి భవాని, జన్ను రవి, పరికరాల రమేష్, యాకాప్రమ చారి, మియాపురం గోవర్ధన చారి, పార్థసారథి, మస్క సుధీర్, చిట్యాల సువర్ణ, ఆరెల్లి రవి, ఆరెల్లి ప్రభాకర్, నల్లతీగల కుమార్, విజయలక్ష్మి, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన 38వ హైదరాబాద్ బుక్ ఫెయిర్‌ను శుక్రవారం సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామక్రిష్ణ సందర్శించారు. బుక్‌ఫెయిర్ కోశాధికారి నారాయణరెడ్డితో కలిసి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నవచేతన బుక్ హౌస్‌తో పాటు పలు స్టాళ్లను సందర్శించి వివిధ పుస్తకాలను పరిశీలించారు.




# నేటి తరానికి నాటి త్యాగాల చరిత్ర



- 'శతారుణ గీతాంజలి', 'వందేళ్ళ మైలురాళ్ళు' పుస్తకాల ఆవిష్కరణలో వక్తలు

**సిపిఐ శతాబ్ది ఉత్సవాలు**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దోపిడీదారులను దేశ భక్తులుగా, మరో వైపు దేశ సంపదను కాపాడేందుకు ప్రాణత్యాగాలు చేస్తున్నవారిని దోపిడీదారులుగా పాలకవర్గాలు చూస్తున్నాయని హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలు, అభ్యుదయ కవులు, కళాకారులు, మేధావుల సమ్మేళనం తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్టు, తెలంగాణ అరసం సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్ బంజారా హిల్స్, లోటస్ పాండ్, రావి నారాయణ రెడ్డి ఆడిటోరియంలో శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి జస్టిస్ చంద్రకుమార్, సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట రెడ్డి, తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్టు అధ్యక్షులు, మాజీ ఎంఎల్‌ఏ చాడ వెంకట్ రెడ్డి, ట్రస్ట్ కార్యదర్శి కందిమళ్ల ప్రతాపరెడ్డి, అరసం ప్రధాన కార్యదర్శి డాక్టర్ రాపోలు సుదర్శన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ ఎస్.వి.సత్యనారాయణ, కందిమళ్ళ భారతి సంకలనం చేసిన 'శతారుణ గీతాంజలి' వంద పాటల పుస్తకం, 'ప్రజాపక్షం' సంపాదకులు మక్కెన సుబ్బారావు రూపొందించిన 'వందేళ్ల సిపిఐ చరితలో మైలురాళ్లు' అనే పుస్తకాలను ఆవిష్కరించారు. సభకు కందిమళ్ళ ప్రతాప రెడ్డి అధ్యక్షత వహించారు. సభలో జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ 2020 నాటి నుంచి కార్పొరేట్ సంస్థలు దోచుకుంటున్నాయని, ఆదానీ, అంబానీలకు ఓడరేవులు, ప్రభుత్వ రంగ సంస్థలను కట్టబెడుతున్నారని విమర్శించారు. మహారాష్ట్ర, చత్తీస్‌గడ్, రాజస్థాన్ అడవులను అప్పగించారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమెరికాతో చేసుకున్న ఒప్పందం ప్రకారం దేశంలోకి అక్కడి పత్తి వస్తుందన్నారు. దీంతో వచ్చే ఏడాది నుంచి ఇక్కడి పత్తి రైతులకు కనీస మద్ధతు రూ.4 వేలు కూడా వచ్చే పరిస్థితి ఉండదని ఆవేదన వ్యక్తం చేశారు. సిద్ధాంతాలతో కూడిన ప్రజా ఉద్యమాలను నిర్మించాల్సిన అవసరం ఉందని అన్నారు. పల్లా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో బిజెపి మతోన్మాద పార్టీని ఎదుర్కొనేందుకు కమ్యూనిస్టులందరూ ఏకం కావాల్సిన అవసరం ఉందన్నారు. సిద్ధాంతపరంగా వందేళ్ళుగా అనేక పోరాటాల చరిత్ర కమ్యూనిస్టు పార్టీకి ఉందన్నారు. ఉద్యమాల్లో కవులు, కళాకారుల పాత్ర గొప్పదని తెలిపారు. భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యానికి పిలుపునివ్వడంతో పాటు తెలంగాణలో నిజాం నిరంకుశ రాజరిక పాలనకు వ్యతిరేకంగా రైతాంగ సాయుధ పోరాటాన్ని కమ్యూనిస్టు పార్టీ నడిపిందని పల్లా వెంకట్ రెడ్డి గుర్తు చేశారు. సాయుధ పోరాటం ద్వారా 3500 గ్రామాలకు విముక్తి కల్పించిందన్నారు. చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ వందేళ్లలో కమ్యూనిస్టు పార్టీ అనేక అటుపోటుల మైలురాళ్లు దాటిందన్నారు. వందేళ్ళ మైలురాళ్లు పుస్తకంలో తొలి ప్రధాన కార్యదర్శ ఘాటే నుండి సురవరం సుధాకర్ రెడ్డి, డి.రాజా వరకు పూర్తి సమాచారం రచయిత మక్కెన సుబ్బారావు ఇచ్చారని ప్రశంసించారు. ఈ తరానికి సంబంధించిన వారికి ఈ పుస్తకం తప్పకుండా ఉపయోగపడుతుందన్నారు. గతం లేకుంటే భవిష్యత్ లేదని, ఈనాటి తరానికి ఆనాటి త్యాగాల చరిత్రను అందించాలని అన్నారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, సినీ నటులు మాదాల రవి, సినీ దర్శకులు బాబ్జి, అరసం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కెవిఎల్, కార్యదర్శి విజయ్ భాస్కర్, అరసం హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డమీది చంద్రమోహన్ గౌడ్, కవులు నాళేశ్వరం శంకరం, సోమశిల తిరుపాల్, డాక్టర్ ప్రసాద్, గంగాధర్, ఎస్. సూర్య ప్రకాష్, సీనియర్ కమ్యూనిస్టు నాయకుడు వెంకట్రామిరెడ్డి, ఉజ్జని రత్నాకర రావు, డా.బి.వి.విజయలక్ష్మి, జోస్యభట్ల కల్పన, చక్రవర్తుల జ్యోత్స్న, రావి ప్రతిభ, డి.ప్రేంపావని, డా॥ వై.వి.కె.ప్రతిభ, వంకా లక్ష్మి, టి.ఎం.ఉషా రాణి పాల్గొన్నారు.



## కొత్త జీఓతో జర్నలిస్టులకు ఎలాంటి నష్టం జరగదు

మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన అక్రిడిటేషన్ మార్గదర్శకాలు వృత్తిపరమైన జర్నలిస్టులకు ఎలాంటి నష్టం కలిగించవని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. ఈమేరకు శుక్రవారం ఆయన విడుదల చేసిన ఒక ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. జర్నలిస్టుల సంక్షేమానికి సంబంధించిన చర్యలు ఎలాంటి వివక్షత లేకుండా అందరికీ సమానంగా వర్తించేలా మరింత మెరుగైన విధానాలను అమలు చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలు యోచిస్తున్నారని ఆయన తెలిపారు. గత ప్రభుత్వ కాలంలో అమలులో ఉన్న అక్రిడిటేషన్ ఉత్తర్వుల్లో ఉర్దూ జర్నలిస్టుల పట్ల, చిన్న పత్రికల పట్ల వివక్షత చోటు చేసుకున్న అంశాన్ని తెలంగాణ హైకోర్టు కొట్టివేసిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఆ తీర్పు నేపథ్యంలోనే నూతన జి.ఓలో అవసరమైన మార్పులు చేసినట్లు తెలిపారు. నూతన జి.ఓపై కొందరు ఉద్దేశపూర్వకంగా అవాస్తవాలను ప్రచారం చేస్తూ, సంక్షేమ చర్యలు కేవలం విలేకరులకు మాత్రమే వర్తిస్తాయని వక్రీకరిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇందులో ఎలాంటి వాస్తవం లేదని, వృత్తిపరమైన జర్నలిస్టులందరికీ ఈ సంక్షేమ పథకాలు వర్తిస్తాయని స్పష్టం చేశారు. ఈ అంశాలపై అవసరమైతే మరింత వివరణ ఇచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామని పేర్కొన్న ఆయన, జర్నలిస్టుల సంక్షేమంపై ముఖ్యమంత్రి, సమాచార శాఖ మంత్రితో ఎప్పుడైనా చర్చించే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. అయితే రాజకీయ ఉద్దేశాలతో కొన్ని శక్తులు ఆందోళనలకు పిలుపునివ్వడం అత్యంత విచారకరమని అన్నారు. జర్నలిస్టుల పట్ల, వారి సమస్యల పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఎల్లప్పుడూ సానుకూల పరిష్కారాల దిశగానే ముందుకు సాగుతుందని, గత ప్రభుత్వంలా వివక్షతకు తావు ఉండదని ఆయన స్పష్టం చేశారు. నూతన జి.ఓపై కొందరు చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మవద్దని వర్కింగ్ జర్నలిస్టులకు కె.శ్రీనివాస్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.



మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ మొదటి వర్ధంతి సందర్భంగా జూబ్లీహిల్స్ నివాసంలో మన్మోహన్ సింగ్ చిత్రపటానికి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు, వేం.నరేందర్ రెడ్డి, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, నల్లగొండ ఎంపి రఘువీర్ రెడ్డి నివాళులు అర్పించారు.

## ఆర్‌టిసి కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఎండికి వినతి పత్రం అందించిన టిజిఎస్‌ఆర్‌టిసి జెఎసి నేతలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆర్‌టిసి కార్మికుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోరుతూ ఆర్‌టిసి వైస్ ఛైర్మన్, ఎండి నాగిరెడ్డిని టిజిఎస్‌ఆర్‌టిసి జెఎసి ఛైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ ఛైర్మన్ ఎం.థామస్ రెడ్డి, కో కన్వీనర్లు కత్తుల యాదయ్య, సుద్దాల సురేష్‌లు శుక్రవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 22 డిమాండ్లతో కూడిన అంశాలపై సుదీర్ఘంగా ఎండితో చర్చించినట్లు తెలిపారు. వాటిలో 2017 వేతన సవరణకు చెందిన అలవెన్సులను పెంచి చెల్లించుటకు ఎండి సానుకూలంగా స్పందించారన్నారు. అలాగే కారుణ్య నియామకాలను 3 సంవత్సరాల పాటు కన్సాలిడేటెడ్ పే కింద పని చేసే విధానాన్ని 2 సంవత్సరాలకు మారుస్తామని, 2021 వేతన సవరణను వీలైనంత త్వరలో అమలు చేయడానికి ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు వీలైనంత త్వరగా చెల్లిస్తామని, మహాలక్ష్మి పథకంలో ప్రయాణిస్తున్న మహిళలకు స్మార్ట్ కార్డు ఇవ్వడానికి సుముఖత వ్యక్తం చేశారన్నారు. కార్మికులపై పనిభారాలు తగ్గిస్తామని, జనం లేని రూట్లలో కిలోమీటర్లను తగ్గిస్తామని, కారుణ్య నియామకాల వయో పరిమితిని 44 సంవత్సరాలకు పెంచడానికి బోర్డు అనుమతి కోరుతామని తెలిపారన్నారు. యూనియన్ల పునరుద్ధరణ అంశం యాజమాన్యం పరిధిలో లేదని, ప్రభుత్వం అనుమతితో యూనియన్ల కార్యకలాపాలను అనుమతిస్తామని చెప్పారని అన్నారు. తార్నాక హాస్పిటల్‌లో పేషెంట్‌తో వచ్చే అటెండెంట్‌కి మౌలిక సౌకర్యాలు కల్పిస్తామని, త్వరలో విశ్రాంతి భవనం నిర్మించి అందులో డైనింగ్ హాల్‌ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని అన్నారు. ఆర్‌టిసి ఆదాయానికి గండి కొడుతున్న అక్రమ ప్రైవేట్ వాహనాల రవాణాను అరికట్టేందుకు తగు చర్యలు చేపడతామన్నారు. అలాగే యాజమాన్యం పరిధిలో ఉన్న సమస్యలన్నింటిని ఒక్కొక్కటిగా పరిష్కరించటానికి ప్రయత్నిస్తామని జెఎసి నాయకులకు హామీ ఇచ్చినందుకు మేనేజింగ్ డైరెక్టర్‌కి వారు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్.కమలాకర్ గౌడ్, జె.రాఘవులు, బుద్ధ విశాల్, ఎం.ఎ.మజీద్, జి.రాములు, జి.రాంచందర్ పాల్గొన్నారు.

## గుంటూరులో చదువుకుంటే తప్పా?



బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తాను గుంటూరులో చదువుకుంటే సిఎం రేవంత్‌రెడ్డికి ఏం తప్పు అని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు ప్రశ్నించారు. తాను ఆంధ్రాకు పోయి ఇంటర్మీడియట్ చదువుకుంటే తప్పా అని అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు బిఆర్‌ఎస్‌లో శుక్రవారం చేరారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ తన తండ్రి తెలంగాణ తెచ్చిన మొగోడని, మొనగాడని, తప్పనిసరిగా ఆయన పేరు చెప్పుకుంటానని, అందులో తప్పు ఏముందని అన్నారు. తెలంగాణ రాష్ట్రం తీసుకొచ్చిన నాయకుడు, రెండు సార్లు సిఎం చేసిన తన తండ్రిని తిడితే కొడుకుగా తనకు ఆవేశం రాదా అని కెటిఆర్ చెప్పారు. రోడ్ల మీద పెయింటింగ్స్ వేసుకునే వ్యక్తి రేవంత్ రెడ్డి అని, జీవితంలో ఎవరైనా చిన్న స్థాయి నుంచి పెద్ద స్థాయికి రావడంలో తప్పులేదని, కానీ మంచి పనులు చేసి రావాలని అన్నారు. రేవంత్ రెడ్డి ఢిల్లీలో పైసలు ఇచ్చి ముఖ్యమంత్రి పదవిని తెచ్చుకున్నారని ఆరోపించారు. ఎన్నికల హామీల అమలు ఏమైందని ప్రశ్నిస్తే 'గుడ్లు పీకి గోటీలాడతారా' అని అన్నారు. కెసిఆర్ ఒక మీడియా సమావేశం పెడితేనే తట్టుకోవడం లేదని ఎద్దేవా చేశారు.

# 'ఉపాధి హామీ' పునరుద్ధరణకు పోరాటాలు

బికెఎంయు జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు పిలుపు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన విబి– జి రామ్ జి విధానాన్ని రద్దు చేసి, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పూర్తిస్థాయిలో పునరుద్ధరించే వరకు నిరంతర పోరాటాలు నిర్వహించాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ (బికెఎంయు) జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు పిలుపునిచ్చారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య అధ్యక్షతన హైదరాబాద్‌లోని మగ్దూం భవన్‌లో జరిగిన సమావేశంలో వెంకట్రాములు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కోట్లాది గ్రామీణ కార్మికులకు చట్టబద్ధంగా కల్పించిన ఉపాధి హక్కును రద్దు చేయాలనే ప్రయత్నం దుర్మార్గమని ఆయన విమర్శించారు. ఉపాధి హామీ చట్టంలో ఉన్న మహాత్మా గాంధీ పేరును తొలగించడం అత్యంత అన్యాయమన్నారు. గాంధీని గాడ్సే హత్య చేసిన చరిత్రను గుర్తు చేస్తూ, నేడు ఆయన వారసులమని చెప్పుకునేవారు గాంధీ పేరునే తొలగించేందుకు కుట్రలు చేయడం మహాదారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టానికి ఇచ్చే నిధులను 60 శాతానికి తగ్గించి, రాష్ట్రాల వాటాను 40 శాతానికి పెంచడం ద్వారా ఈ చట్టాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నాలు చేస్తోందని విమర్శించారు. ఈ కుట్రలను గ్రామ గ్రామాన విస్తృతంగా ప్రచారం చేసి, ఐక్య పోరాటాల ద్వారా కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని వెంకట్రాములు పిలుపునిచ్చారు.




**డిసెంబర్ 29న రాష్ట్రవ్యాప్త నిరసనలు : కలకొండ కాంతయ్య**

సమావేశానికి అధ్యక్షత వహించిన కలకొండ కాంతయ్య మాట్లాడుతూ, ఉపాధి హామీ చట్ట పరిరక్షణ కోసం ఈనెల 29వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ప్రభుత్వ కార్యాలయాల ముందు ధర్నాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. నిరసనల అనంతరం ప్రభుత్వ అధికారులకు వినతిపత్రాలు అందజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో గ్రామీణ శ్రమజీవులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉద్యమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు తాటి వెంకటేశ్వరరావు, బుద్ధుల జంగయ్య, డి.ధనంజయనాయుడు, సృజన్ కుమార్, ఎం.తాజుద్దీన్, అక్క పెల్లి బాబు, యేసయ్య, చింతకుంట్ల వెంకన్న పాల్గొన్నారు.

# ఎస్ఐబి మాజీ చీఫ్ ప్రభాకర్ రావు విడుదల

- ఫోన్ ట్యాపింగ్ కేసులో ముగిసిన విచారణ
- రెండు వారాల పాటు ప్రశ్నించిన సిట్ అధికారులు
- జనవరి 16న సుప్రీంకోర్టుకు సిట్ విచారణ నివేదిక
- త్వరలో మాజీ సిఎం, మంత్రులను విచారించే అవకాశం!

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాజకీయాలలో ప్రకంపనలు సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడు, స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబి) మాజీ చీఫ్ ప్రభాకర్ రావును ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) శుక్రవారం విడుదల చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రెండు వారాల పాటు కస్టడీలో విచారించిన అనంతరం, గడువు ముగియడంతో ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించి, అనంతరం జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ నుంచి ఆయనను విడిచిపెట్టారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో ఈనెల 12న సిట్ ఎదుట లొంగిపోయిన ప్రభాకర్ రావును హైదరాబాద్ సిపి సజ్జనార్ నేతృత్వంలోని 9 మంది స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ సుదీర్ఘంగా విచారించింది. పదవీ విరమణ తర్వాత కూడా బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఆయనను ఎస్ఐబి చీఫ్‌గా ఎందుకు నియమించిందనే కోణంలో సిట్ ప్రశ్నించినట్లు సమాచారం. దీని వెనుక రాజకీయ దురుద్దేశాలు ఉన్నాయని దర్యాప్తు సంస్థ అనుమానిస్తోంది. విచారణలో భాగంగా చివరి రోజు కేసులో సహ నిందుతులైన ప్రణీత్‌రావు, భుజంగరావు, రాధాకిషన్ రావు, తిరుపతన్నలను జూబ్లీహిల్స్ పీఎస్‌కు పిలిపించి కీలక సమాచారాన్ని రాబట్టారు. మాజీ మంత్రి హరీశ్‌రావుతో తరచూ ఎందుకు భేటీ అయ్యారని ప్రశ్నించగా, మావోయిస్టుల ముప్పు గురించి వివరించడానికేనని ఆయన చెప్పినట్లు తెలుస్తోంది. దీంతో పాటు మాజీ డిజిపి మహేందర్ రెడ్డి, మాజీ సిఎస్ సోమేశ్ కుమార్ వంటి ఉన్నతాధికారుల వాంగ్మూలాలను కూడా సిట్ నమోదు చేసింది. ప్రభాకర్ రావు కస్టడీ విచారణపై జనవరి 16న సుప్రీంకోర్టుకు సిట్ నివేదిక సమర్పించనుంది. మరోవైపు ఈ కేసులో తదుపరి చర్యలపై ఇంటెలిజెన్స్ చీఫ్ విజయ్ కుమార్, హైదరాబాద్ సిపి విసి.సజ్జనార్ సమావేశమై చర్చించారు. మాజీ సిఎం కెసిఆర్, మాజీ మంత్రులు కెటిఆర్, హరీశ్ రావులను కూడా విచారణకు పిలిచే అవకాశం ఉందన్న ఊహాగానాల నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యత ఏర్పడింది. బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రాజకీయ ప్రత్యర్థులు, వ్యాపారులు, జర్నలిస్టుల ఫోన్లను ప్రభాకర్ రావు నేతృత్వంలోని బృందం అక్రమంగా ట్యాపింగ్ చేసిందని ప్రధాన ఆరోపణగా ఉంది.

**సూపరింటెండెంట్ కార్యాలయం, ఉస్మానియా జనరల్ హాస్పిటల్, హైదరాబాద్.**

Rc.No. M2/OGH/2025-26/1874 టెండర్ ప్రకటన తేది: 24.12.2025

విషయం : M2 స్టోర్స్-OGH యొక్క వివిధ విభాగాలలో ఉన్న వినియోగానికి పనికిరాని వస్తువులను పారేయడం / Obsolete Condemned articles పారవేయడం-షార్ట్ టెండర్ నోటిఫికేషన్ విషయం గురించి.

రిఫరెన్స్ : అప్రోవల్ ఆఫీస్ నోట్ RC.No. M2/OGH/2025-26 తేదీ: 24-12-2025.

((0))

హైదరాబాద్ ఉస్మానియా జనరల్ హాస్పిటల్‌లోని వివిధ విభాగాలలో ఉన్నటువంటి వినియోగానికి పనికిరాని వస్తువులను పారేయడం/ వాడుకలోలేని కండెమ్డ్ ఆర్టికల్స్ పారవేయడం కోసం అధీకృత/ ఏజెన్సీలు/ వెండర్స్/ సర్వీస్ ప్రొవైడర్ల నుండి సీల్డ్ టెండర్లను ఆహ్వానించడమైనది.

01. టెండర్ ఫారమ్ ఫీజు రూ.5,000/- OGH యొక్క క్యాష్ సెక్షన్‌లో చెల్లించాలి మరియు రశీదు పొందాలి.
02. టెండర్ ఫారమ్ అమ్మకం తేదీ: 29.12.2025 నుండి ప్రారంభమై 06.01.2026 వరకు OGH యొక్క సెక్షన్ M2 నుండి అన్ని పనివేళల్లో ఉదయం 10-30 నుంచి సాయంత్రం 4గంటల వరకు ఉంటుంది.
03. సీల్డ్ టెండర్ సమర్పించడానికి చివరి తేదీ: 08.01.2026. దీనితోపాటు రూ.50,000 డి.డి సూపరింటెండెంట్, ఉస్మానియా జనరల్ హాస్పిటల్, హైదరాబాద్ పేరిట తీసినది హైదరాబాద్ ఉస్మానియా జనరల్ హాస్పిటల్ ఇన్‌వార్డ్‌లో సమర్పించాలి.
04. హైదరాబాద్‌లోని ఉస్మానియా జనరల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ ఛాంబర్లలో సీల్డ్ టెండర్లను తేదీ: 12.01.2026న మధ్యాహ్నం 3గంటలకు వెండర్స్ / ఏజెన్సీల యొక్క రిప్రజెంటేటివ్స్ సమక్షంలో తెరువడం జరుగుతుంది.

సూపరింటెండెంట్, ఉస్మానియా జనరల్ హాస్పిటల్, హైదరాబాద్, ఎటువంటి నోటీస్ లేకుండా ఏదైనా లేదా అన్ని టెండర్లను అంగీకరించడం / తిరస్కరించడం / రద్దు చేయడం వంటి అన్ని హక్కులను కలిగి ఉన్నారు.

సం/- సూపరింటెండెంట్, ఉస్మానియా జనరల్ హాస్పిటల్, హైదరాబాద్.

DIPR R.O. No. : 12607-PP/CL/ADVT/1/2025-26, Date: 24-12-2025

## టిజిఎస్ఐఐసి 'ఇడి'గా వీరారెడ్డి


ప్రజాపక్షం/యాదాద్రి : యాదాద్రి భువనగిరి జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి బదిలీ అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయనను తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ(ఎస్ఏ) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నియామకం అయ్యారు. వీరారెడ్డి గత సంవత్సరం పైగా భువనగిరిలో రెవెన్యూ అదనపు కలెక్టర్‌గా పనిచేశారు. భూ సమస్యల పరిష్కారంలో ఆయనకు విశేష అనుభవం ఉంది. గతంలో యాదాద్రి భువనగిరి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా సైతం పని చేశారు.




## సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ బదిలీ

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్‌ను బదిలీ చేస్తూ గురువారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నారాయణ్‌అమిత్‌ను నారాయణ్‌పేట జిల్లా అదనపు కలెక్టర్(లోకల్ బాడీస్)గా పదోన్నతి కల్పిస్తూ బదిలీ చేశారు. నారాయణ్‌అమిత్ 2024 సెప్టెంబర్ 5న మిర్యాలగూడ సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. తన 15నెలల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను అర్హులైన పేదలకు అందించేలా కృషి చేశారు. రైతులకు మద్దతు ధర అందించేలా నిరంతరం పర్యవేక్షణ చేశారు. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలు పకడ్బందీగా, ప్రశాంతంగా నిర్వహించడంతో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి చేతులమీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు. మిర్యాలగూడ రెవెన్యూ డివిజన్ పరిధిలో అర్హులైన పేదలకు ప్రభుత్వపరమైన సేవలను అందించి అన్ని వర్గాల ప్రజల మన్ననలను పొందారు.



## అలుపెరుగని పోరాటయోధుడు మూరగుండ్ల లక్ష్మయ్య

ప్రజాపక్షం/నూతనకల్ (మద్దిరాల) : ప్రజాపోరాటాలలో ప్రజా ఉద్యమాలలో అలుపెరుగని పోరాట యోధుడు మూరగుండ్ల లక్ష్మయ్య అని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. శుక్రవారం మద్దిరాల మండలం ముకుందాపురం గ్రామంలో జరిగిన లక్ష్మయ్య సంతాప సభలో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసిన అనంతరం ఆయన మాట్లాడారు. తన కొరకు తను జీవించేవాడు మనిషి, ప్రజల కొరకు జీవించేవాడు మహామనిషి అని కొనియాడారు. ప్రజల సమస్యలే తన సమస్యలుగా ప్రజా జీవితంలో ఉంటూ గ్రామస్థాయి వార్డు మెంబర్ నుంచి, జడ్పిటిసి స్థాయి వరకు ఎదిగి ఈ ప్రాంతంలో అనేక ఉద్యమాలు నిర్వహించి ముఖ్యంగా భూ పోరాటం నిర్వహించి కబ్జాలో ఉన్న రైతులకు ప్రభుత్వ హక్కుపత్రాలు ఇవ్వాలని రైతాంగాన్ని సమీకరించి అనేక ఉద్యమాలు నిర్వహించిన ఘనచరిత్ర ఆయనదని గుర్తు చేశారు. చివరి శ్వాస వరకు ఎర్రజెండా నీడలోనే జీవించాడన్నారు. యల్లంల యాదగిరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, బిసి హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూళిపాళ ధనుంజయ నాయుడు, యల్లావుల రాములు, కోటగిరి యాదగిరిరావు, ములకలపల్లి రాములు, కంబాల శ్రీనివాస్, బద్దం కృష్ణారెడ్డి, బూర వెంకటేశ్వర్లు, దేగల జనార్ధన్, తొట్ల ప్రభాకర్, గుండు వెంకటేశ్వర్లు, ఆకుల లింగయ్య, బుక్క రాంబాబు, కందాల శంకర్ రెడ్డి, చిలకరాజు శ్రీను, ఉప్పతల కోటమ్మ, మూరగుండ్ల లక్ష్మయ్య, కుమారులు శ్రీనివాస్, సతీష్, ఖమ్మంపాటి అంతయ్య పాల్గొన్నారు.

## నరసింహ్మా మృతి ఎఐటియుసికి తీరని లోటు



ప్రజాపక్షం/ రామన్నపేట: మాజీ ఎంపిటిసి, ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు, సివిల్ సప్లయ్ హమాలి యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొరిగె నరసింహ్మా మృతి ఎఐటియుసికి, హమాలీ సంఘానికి తీరని లోటని సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నరసింహా మృతదేహాన్ని ఆయన సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. దాదాపు 30 సంవత్సరాలుగా సివిల్ సప్లయ్ హమాలీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేసి యాదాద్రి భువనగిరి జిల్లా ఏర్పాటు తరువాత కూడా సంఘానికి జిల్లా కార్యదర్శిగా పనిచేస్తూ అనేక ఉద్యమాలు నిర్వహించారని, యూనియన్ పట్ల ఆయన ఎంతో నిబద్ధదతో ఉండేవారని అన్నారు. నరసింహ్మా అంతిమయాత్రలో హమాలీలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆయన వెంట సీపీఐ మండల కార్యదర్శి ఉట్కూరి నరసింహా, ఎఐటియుసి జిల్లా కార్యవర్గ సభ్యులు సామల శోభన్‌బాబు, మండల అధ్యక్షుడు బత్తుల సత్యం, ప్రధాన కార్యదర్శి శివరాత్రి సమ్మయ్య, సివిల్ సప్లయ్ హమాలి యూనియన్ జిల్లా అధ్యక్షుడు పల్లె శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు పాపగళ్ల శంకరయ్య, గౌరవంతల శ్రీనివాస వెంకన్న,జగన్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

## భువనగిరి అభివృద్ధికి కృషి చేస్తా

భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



ప్రజాపక్షం/బీబీనగర్ : ఎన్నికల అప్పుడే పార్టీలు గ్రామాల అభివృద్ధి కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం బీబీనగర్ మండల కేంద్రంలో పిఆర్‌జి గార్డెన్‌లో నూతనంగా ఎన్నికైన 17 గ్రామపంచాయతీ సర్పంచులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా హాజరైన అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ గత 40 సంవత్సరాల కాలంలో భువనగిరి ఖిల్లా పై కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేసిన ఘనత పార్టీ కార్యకర్తలకు దక్కిందన్నారు. రాబోవు ఎంపిటిసి ఎన్నికల్లో అందరూ కలిసికట్టుగా పనిచేసి పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం పనిచేయలన్నారు. భువనగిరి నియోజకవర్గం అభివృద్ధి కోసం నా శాయశక్తుల కృషి చేస్తూ గ్రామాల మౌలిక సదుపాయాలు కల్పిస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలందరికీ తెలియజేయలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ కసిరెడ్డి నారాయణరెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు గోలి పింగాల్ రెడ్డి, పంజాల రామాంజనేయులు గౌడ్, ఫోటోల శ్యామ్ గౌడ్, సింగల్ విండో మాజీ చైర్మన్ మెట్టు శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

## బుద్ధవనంలో ప్రముఖుల సందడి

ప్రజాపక్షం/నందికొండ: నాగార్జునసాగర్‌లోని ప్రపంచ ప్రసిద్ధ బుద్ధవనం శుక్రవారం ప్రముఖుల సందర్శనతో కళకళలాడింది. మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి దండపాణి సతీసమేతంగా నాగార్జునసాగర్‌కు చేరుకుని బుద్ధవనాన్ని సందర్శించారు. విజయ విహార్ టూరిజం వసతి గృహానికి చేరుకున్న న్యాయమూర్తి దంపతులకు రెవెన్యూ ప్రోటోకాల్ అధికారి దండ శ్రీనివాస్ రెడ్డి, సాగర్ ఎస్ఐ ముత్తయ్య, నిడమనూరు కోర్టు ప్రోటోకాల్ సిబ్బంది మహేందర్ రెడ్డి, కాలిక్‌లు ఘన స్వాగతం పలికారు. అనంతరం వారు నాగార్జునసాగర్ ప్రధాన డ్యామ్, ప్రధాన జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని సందర్శించారు. తదుపరి బుద్ధవనాన్ని వీక్షించారు.ఇదే రోజున ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రైల్వే కోర్టు న్యాయమూర్తి రమాదేవి, నల్గొండ జిల్లా ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ పవన్ కుమార్ కుటుంబ సమేతంగా బుద్ధవనాన్ని సందర్శించారు. స్థానిక టూరిజం గైడ్ సత్యనారాయణ బుద్ధవనం చారిత్రక విశేషాలను వారికి వివరించారు. ఈ సందర్భంగా బుద్ధవనం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శాసన, ఎస్టేట్ మేనేజర్ రవిచంద్రలు అతిథులను బుద్ధవనం కండువాలు, బ్రోచర్లతో సత్కరించారు.



# భారత గడ్డపై ఎర్రజెండాకు వందేళ్లు

పేద ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన ఎర్రజెండా: ఆవిర్భావ దినోత్సవంలో నర్సింహారెడ్డి






ప్రజాపక్షం/దేవరకొండ: సామ్రాజ్య వాదులకు వ్యతిరేకంగా, భూస్వామ్య, పెట్టుబడిదారి వర్గాలకు వ్యతిరేకంగా బలమైన ఉద్యమాలు నిర్వహించిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)ది అని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి అన్నారు. సిపిఐ 101వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం దేవరకొండలోని కామ్రేడ్ పల్లా పర్వత్‌రెడ్డి భవన్ సిపిఐ కార్యాలయంలో సిపిఐ జెండాను ఆయన ఎగరవేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 100 వసంతాల ఉత్సవాల ముగింపు సందర్భంగా జనవరి 18న ఖమ్మంలో బహిరంగ సభ ఉంటుందని ఈ భారీ బహిరంగ సభకు దేశ నలుమూలల నుండి 5 లక్షల మంది కామ్రేడ్స్ పాల్గొంటున్నారని , దేవరకొండ నియోజకవర్గం నుండి ప్రజలు అధిక సంఖ్యలో ఈ సభకు తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, మండల కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి, మండల సహాయ కార్యదర్శి రామస్వామి, పట్టణ కార్యదర్శి ఆంజనేయులు, మండల కార్యవర్గ సభ్యులు రంగారెడ్డి, స్థులోచన, వెంకట్రాములు, రాంరెడ్డి, యాదయ్య,మాధవరెడ్డి, వెంకటయ్య, మైనోద్దీన్, వెంకటేశ్వర్‌రావు, సర్పంచ్ భారతిధర్మనాయక్, శాఖ కార్యదర్శులు జ్యోతిబస్, నగేష్, భూపాల్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, వెంకటయ్య, శివకుమార్; రామాంజనేయులు, గోపి, గోవర్ధన్, నర్సింహా, భ్రారీములు, బుచ్చయ్య, నగేష్, బద్దీ,జంగయ్య,అంజమ్మ, లక్ష్మీ పాల్గొన్నారు.

### పేదల కోసం పోరాటాలు చేసిన సిపిఐ : ఉస్తెల సృజన

ప్రజాపక్షం/చింతలపాలెం (మేళ్లచెరువు) : పేదల కోసం గత వంద సంవత్సరాలుగా పోరాటాలు చేసిన ఏకైక పార్టీ సిపిఐ అని రాష్ట్ర మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఉస్తెల సృజన అన్నారు. శుక్రవారం సిపిఐ పార్టీ ఆవిర్భవించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా మేళ్ళచెరువు మండల కేంద్రంలోశతాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా పేదల కోసం పార్టీ చేసిన పోరాటాలను గుర్తు చేశారు. అనంతరం పార్టీ ఆశయ సాధన కోసం కృషి చేస్తామని అందరూ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ మండల కార్యదర్శి భద్రారెడ్డి, పార్టీ నేతలు పాపిరెడ్డి, ఎలమంద, కోటమ్మ, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఇంటింటికీ సిపిఐ కార్యక్రమం

ప్రజాపక్షం/యాదగిరిగుట్ట : భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆవిర్భవించి 100 ఏళ్లు పూర్తి చేసుకుని, 101వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా యాదగిరిగుట్ట పట్టణంలోని పార్టీ కార్యాలయం వద్ద శత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గోదా శ్రీరాములు అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఇంటింటికీ సిపిఐ కార్యక్రమం ప్రారంభం పార్టీ శత జయంతిని పురస్కరించుకుని యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలోని 12 వార్డుల్లో ప్రజా సమస్యల గుర్తింపు కోసం 'ఇంటింటికీ సిపిఐ' కార్యక్రమాన్ని ప్రారంభించారు. 1వ వార్డు హనుమాన్ టెంపుల్ నుండి ప్రారంభించి 4వ వార్డు వరకు పర్యటించి ప్రజల ఇబ్బందులను తెలుసుకున్నారు. రేపు 8వ వార్డు నుండి 5వ వార్డు వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని నాయకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, కొల్లూరి రాజయ్య, పేరబోయిన మహేందర్, మండల కార్యదర్శి కల్లెపెల్లి మహేందర్, పట్టణ కార్యదర్శి బబ్బూరి శ్రీధర్, మాజీ కోఆప్షన్ సభ్యులు పేరబోయిన పెంటయ్య పాల్గొన్నారు.



## కెటిఆర్ ది 'మేనేజ్‌మెంట్ కోటా'.. రేవంత్ రెడ్డిది 'మెరిట్ కోటా'!

ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి



ప్రజాపక్షం/యాదాద్రి : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై అవాకులు చవాకులు పేలుతున్న బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌పై భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శుక్రవారం ఆయన క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ కేటీఆర్ రాజకీయ ప్రస్థానంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. 'నువ్వు మేనేజ్‌మెంట్ కోటాలో రాజకీయాల్లోకి వచ్చి మంత్రివి అయ్యావు కానీ రేవంత్ రెడ్డి జడ్పీటీసీ నుంచి ఎంపీ వరకు స్వతంత్రంగా గెలిచి, మెరిట్ కోటాలో ముఖ్యమంత్రి అయ్యారు అని ఎద్దేవా చేశారు. 'కట్టే, కొట్టే, తెచ్చే' అనే సామెత కేవలం కేసీఆర్ కుటుంబానికే వర్తిస్తుందని ఎంపీ విమర్శించారు. ఉద్యమకారుని వేషంలో వచ్చి, పిట్టకథలు చెప్పి అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని మండిపడ్డారు. నీళ్ల, నిధులు, నియామకాల పేరుతో తెలంగాణ ప్రజలను పదేళ్లు వంచించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైడ్రా: బీఆర్ఎస్ హయాంలో నాళాలు, పార్కులను కబ్జా చేసి 'దండుపాళ్యం ముఠా'లా దోచుకున్నారని, ఆ కబ్జాలను తొలగిస్తుంటే ప్రజలు సంతోషపడుతున్నారని ఎంపి తెలిపారు. మీరు గొప్పగా చెప్పుకున్న కాళేశ్వరం ప్రాజెక్టులో మీ అవినీతిని బయటపెట్టడానికే దేవుడు మేడిగడ్డ పిల్లర్లను కుంగేలా చేశారని వ్యాఖ్యానించారు. కేటీఆర్‌ను 'ఐరన్ లెగ్'గా అభివర్ణిస్తూ, ఆయన నాయకత్వంలోనే పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీకి 'గుండు సున్నా' వచ్చిందని చామల విమర్శించారు. కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ప్రజలు కేటీఆర్‌కు బుద్ధి చెప్పారని గుర్తు చేశారు. 2023లో ఓడించినట్లుగానే, 2029లో కూడా రేవంత్ రెడ్డి చేతిలో బీఆర్ఎస్కు పరాభవం తప్పదని హెచ్చరించారు.

## రాజేష్ కుటుంబానికి ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ అండ : బుక్కి వెంకటయ్య



ప్రజాపక్షం/కోదాడ: కోదాడ పట్టణంలోని కర్ల రాజేష్ కుటుంబాన్ని శుక్రవారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిసన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పరామర్శించారు. రాజేష్ మృతికి దారితీసిన పరిస్థితులను ఆయన తల్లి లలితమ్మను అడిగి తెలుసుకున్నారు. పుట్టెడు దుఖంలో ఉన్న ఆమెను ఓదార్చుతూ న్యాయం జరిగే వరకు కమిసన్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ఘటనపై వారం రోజుల్లోగా సమగ్ర విచారణ జరిపి నివేదిక అందించాలని జిల్లా కలెక్టర్, ఎస్‌పిలను అదేశించినట్లు తెలిపారు. బాధ్యులైన పోలీస్ అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, ఇప్పటి వరకు సిఐని సస్పెండ్ చేశారని, మిగిలిన వారిపై కూడా విచారణ జరిపిస్తామని అన్నారు. ప్రభుత్వం నుంచి రూ. 4,12,000 చెక్కును తల్లి లలితమ్మకు అందజేశారు. మిగిలిన మొత్తాన్ని త్వరలనే అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. బాధిత కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, నివసించేందుకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రాజేష్ మృతికి కారణమైన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు శంకర్, జిల్లా సంక్షేమ అధికారి దయానందరాణి, కోదాడ ఆర్డీవో సూర్యానారయణ, తహసిల్దార్ వాజీద్‌అలీ, ఎమ్మార్పీఎస్ నాయకులు రాజు పాల్గొన్నారు.

## యూరియా స్లాట్ కోసం కష్టాలు

ప్రజాపక్షం/మఠ్రిగూడ : ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన ఫర్టిలైజర్ బుకింగ్ యాప్‌తో రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. కొంతమంది అన్నదాతలు యూరియా కోసం స్లాట్ ఎలా బుక్ చేసుకోవాలో తెలియక ఇబ్బంది పడుతున్నారు. మఠ్రిగూడ మన గ్రోమోర్ సెంటర్ యూరియా కోసం వచ్చిన రైతులు స్లాట్ బుకింగ్ గురించి తెలియక చాలామంది వెనక్కి వెళ్లారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రైతులకు గ్రామాల వారిగా అవగాహన కల్పించాలని పలువురు కోరుతున్నారు.

# నూతన సంవత్సర వేడుకలు నిర్వహించే వారికి జాగ్రత్తలు

సూర్యాపేట జిల్లా ఎస్‌పి కె. నరసింహ్మా



ప్రజాపక్షం/సూర్యాపేట : నూతన సంవత్సర వేడకలు నిర్వహించే వారు జాగ్రత్తలు పాటించి ప్రమాదాలకు దూరంగా ఉంటూ పిల్లలు, పెద్దలు అందరూ వారి ఇండ్లలో ఉత్సవాలను జరుపుకుంటూ పోలీసు వారి సూచనలను పాటించాలని జిల్లా ఎస్‌పి కె నరసింహ తెలిపారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండ పోలీసు శాఖ తరపున భద్రత ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. డిసెంబర్ 31 రాత్రి వేడుకలు నిర్వహించుకునే నూతన సంవత్సర వేడుకల సందర్భంగా జిల్లా పోలీస్ యంత్రాంగం పటిష్టమైన బందోబస్త్, నిత్యం పెట్రోలింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోను డ్రంక్ అండ్ డ్రైవింగ్ తనిఖీలు నిర్వహించబడుతాయని చెప్పారు. అలాగే ప్రజలకు ఇబ్బందులకు గురిచేసే విధంగా బహిరంగ ప్రదేశాల్లో నూతన సంవత్సర వేడుకలను నిర్వహిస్తే తగు చర్యలు తీసుకోవడం జరుగుతుంది, వేడుకలు జరుపుకునే వారు కుటుంబంతో కలిసి ఇంట్లోనే ఉత్సవాలు జరుపుకోవడం మంచిదన్నారు.

**పోలీసుల సూచనలు నిబంధనలు...** డిసెంబర్ 31 రాత్రి ఆర్గనైజ్డ్‌గా ఏర్పాట్లు చేయడానికి పోలీసు అనుమతి లేదు. ఉత్సవం జరుపుకునే వారు ఇండ్లలో కుటుంబ సభ్యులతో జరుపుకోవడం మంచి అలవాటు. పిల్లలపట్ల జాగ్రత్తలు పాటించాలి, మైనర్స్‌కు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరం. టపాసులు, డిజెలు నిషేధం. మద్యం మత్తులో వాహనాలు నడపడం నేరం, వాహనాలు వేగంగా నడపవద్దు. రహదారులు బ్లాక్ చేసి ఉత్సవాలు చేయవద్దు. మహిళలపట్ల అసభ్యకరంగా ప్రవర్తించవద్దు, ఇతరులకు ఇబ్బంది కలిగించవద్దు. ఇల్లు, ప్రైవేటు ఆస్తులపై, వీధి దీపాలపై రాళ్లు వేయడం, అద్దాలను పగలగొట్టడం నేరం. ర్యాష్ డ్రైవింగ్, బైక్ రేసింగ్, త్రిబుల్ రైడింగ్, సైలెనర్సర్‌లను తీసివేసి వాహనాలు నడపడం, శబ్దకాలుష్యం చేస్తూ ఇతరులను ఇబ్బంది పెడితే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. న్యూ ఇయర్ వేడుకలలో నిషేధిత డ్రగ్స్, గాంజా వంటి మత్తు పదార్థాలు విక్రయించిన, వినియోగించిన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. మద్యం దుకాణాలు నిర్ణీత సమయంలో క్లోజ్ చేయాలి, మైనర్లకు మద్యం అమ్మకూడదు. బహిరంగ ప్రదేశాల్లో, ప్రభుత్వ స్థలాల్లో మద్యం సేవిస్తే కేసులు పెడుతాం. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసే ఎలాంటి కార్యక్రమాలు అయినా సరే నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసు అధికారుల నుండి ముందస్తు అనుమతులు తీసుకోవాలి. న్యూఇయర్ ఆఫర్ల పేరిట సైబర్ నేరగాళ్లు ఆర్థిక నష్టం కలిగించే అవకాశం ఉన్నది కావున ఆన్‌లైన్ నందు, అపరిచితులతో వ్యక్తిగత సమాచారం, బ్యాంక్ అకౌంట్ వివరాలు, పిన్ నంబర్లు ఇవ్వవదన్నారు. అంక్షల ను అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. అత్యవసర సమయంలో స్థానిక పోలీసు అధికారులకు, డయల్ 100కు ఫోన్ చేసి పోలీసు సేవలు ఉపయోగించుకోవాలని కోరారు.

## మావోయిస్టు నేత ఉయితే గణేష్ @ హనుమంతు ఎన్‌కౌంటర్

ఒడిశాలో కేంద్ర కమిటీ సభ్యుడు పాక హనుమంతు మృతి



ప్రజాపక్షం/నల్లగొండ: ఒడిశాలోని కందమాల్ జిల్లా చరపాద్ అడవుల్లో గురువారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు,ఒడిశా రాష్ట్రకమిటీ కార్యదర్శి పాక హనుమంతు అలియాస్ ఉయితే గణేష్ (64) సహా నలుగురు మావోయిస్టులు మరణించారు. మృతుల్లో ఇద్దరు మహిళలు ఉన్నారు. ఘటనా స్థలం నుంచి ఒక ఏకే 47, రెండు ఇన్సాస్,300 తుపాకులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మరణించిన మరో ముగ్గురిని గుర్తించాల్సి ఉందని పోలీసులు తెలిపారు.హనుమంతుపై రూ.1.10 కోట్ల రివార్డు ఉందని పేర్కొన్నారు.కందమాల్ జిల్లాలోనే బుధవారం సాయంత్రం జరిగిన ఎన్ కౌంటర్‌లో ఒడిశా ఏరియా కమిటీ సభ్యుడు రాకేశ్.ప్లటూన్ సభ్యుడు అమృత్ మరణించారు. వీరి వద్ద నుంచి 303 రైఫిల్,వాక్ బాకీలు స్వాధీనం చేసుకున్నారు.

**పుల్లెంల నుంచి మావోయిస్టు అగ్ర నేతగా ఎదిగిన హనుమంతు**

పాక హనుమంతు స్వస్థలం నల్లగొండ జిల్లా చండూరు మండలం పుల్లెంల గ్రామం. పాక చంద్రయ్య, ఎటమ్మ దంపతుల అడుగురు సంతానంలో హనుమంతు ఒకరు.1981లో నల్లగొండలోని ఎన్‌జి కాలేజీలో డిగ్రీ చదువుతున్న క్రమంలో రాడికల్ స్టూడెంట్ యూనియన్లో పని చేశాడు.అదే ఏడాది మార్చి 30న జరిగిన ఏబివిపి నాయకుడు ఏచూరి శ్రీనివాస్ హత్య కేసులో హనుమంతు కూడా నిందితుడు ఆహత్య తర్వాత ఆయన పీపుల్వర్ పార్టీలో చేరి అజ్ఞాతంలోకి వెళ్లాడు. హనుమంతుది బూటకపు ఎన్ కౌంటర్ అని భారత న్యాయవాదుల సంఘం జిల్లా అధ్యక్షుడు గుర్రం వెంకట్ రెడ్డి ఆరోపించారు. వృద్ధాప్యంలో ఉన్న వ్యక్తిని పట్టుకొని చట్టానికి అప్పించవలసింది పోయి పట్టుకొని చంపేసి ఎదురు కాల్పుల్లో చనిపోయారని పోలీ ములు కట్టుకథలు అల్లారని విమర్శించారు.



## కొమ్మాల నుండి బోడబండ ప్రధాన రహదారి బురదమయం

ప్రజలకు తీవ్ర ఇబ్బందులు



ప్రజాపక్షం/అర్వపల్లి : కొమ్మాల గ్రామం నుండి బోడబండ వెళ్లే ప్రధాన దారిలో కుమ్మరివారికుంట సమీపంలో అలుగుమీదుగా వెళ్లే రహదారి పూర్తిగా బురదతో నిండిపోయింది. గత వర్షాకాలంలో కురిసిన వర్షాల కారణంగా, ఈ దారి దాదాపు ప్రయాణానికి ఇబ్బందిగా మారింది. ఈ రహదారి మీదుగా ప్రతి రోజు వందలాది మంది రైతులు, రైతు కూలీలు పొలాలకు వెళ్లడం, రెండు గ్రామాల మధ్య గ్రామస్తుల రాకపోకులు నిత్యం జరుగుతూ ఉంటాయి. అంతేకాకుండా పొలంలో పండిన ధాన్యాన్ని తరలించటం చాలా ఇబ్బందికరంగా మారిందని రైతులు వాపోతున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ట్రాక్టర్లు బురదలో దిగబడిపోతున్నాయని తెలిపారు. ఇప్పటికే పలువురు జారిపడి గాయపడిన సంఘటనలు కూడా లేకపోలేదని రైతులు చెబుతున్నారు. ఇది గ్రామాలని కలిపే కీలక మార్గం అయినప్పటికి అధికారులు, స్థానిక లీడర్లు పట్టించుకోవడం లేదని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే బురద బాద నుండి విముక్తి చేసి, ఒక మంచి కల్వర్టును నిర్మాణం చేసి ప్రయాణాన్ని సులభతరం చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి రహదారి మరమ్మత్తులు చేయాలని కొమ్మాల గ్రామ నివాసి బయ్య ఉపేందర్ కోరుకుంటున్నారు.

## ఒంటరితనం భరించలేక వ్యక్తి ఆత్మహత్య

ప్రజాపక్షం/నందికొండ: మాచర్ల పట్టణానికి చెందిన నల్లమల్ల వెంకటేశ్వర్లు (65) అనే వ్యక్తి ఒంటరితనం భరించలేక ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం నందికొండ మున్సిపాలిటీలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం వివరాల్లోకి వెళితే నసరయ్య కుమారుడైన వెంకటేశ్వర్లు గౌడ్ కులానికి చెందినవాడు కాగా, జీవనోపాధిగా కూలీ పనులు చేసుకుంటూ జీవించేవాడు.ఎనిమిది నెలల క్రితం ఆయన భార్య మృతి చెందడంతో అప్పటి నుంచి తీవ్ర మానసిక ఆవేదనకు లోనై ఒంటరిగా జీవిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.ఈ క్రమంలో గురువారం ఉదయం సుమారు 10 నుంచి 12 గంటల మధ్యలో కంకర మిల్ డౌన్ ప్రాంతంలో,కృష్ణా నదిలోకి జాలర్లు వెళ్లే దారి వద్ద ఉన్న చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడి నట్లు పోలీసులు తెలిపారు. గమనార్హం ఏమిటంటే,వారం రోజుల క్రితమే జమ్మలమడుగు వద్ద కుడి కాలువలోకి దూకి ఆత్మహత్యకు ప్రయత్నించగా,అక్కడ స్నానం చేస్తున్న అయ్యప్ప స్వాములు గమనించి అతన్ని కాపాడినట్లు పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి,కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.



## బిసిలకు ప్రాధాన్యం కల్పించాలి

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: త్వరలో భర్తీ చేసే నామినేటెడ్ పదవుల్లో నల్లగొండ జిల్లా బీసీలకు ప్రాధాన్యం కల్పించాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ అన్నారు. శుక్రవారం ఆయన టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను హైద్రాబాద్‌లో కలిసి విజ్ఞప్తి చేసి మాట్లాడారు. నల్లగొండ జిల్లాలో కాంగ్రెస్ తరుపున బీసీ వర్గానికి చెందిన ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు లేరని జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు రాజకీయాల్లో ఎలాంటి ప్రాతినిధ్యం దక్కడం లేదని కావునా త్వరలో భర్తీ చేసే నామినేటెడ్ పదవుల్లో బీసీలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని అన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే ఎన్నికల్లో టికెట్ల కేటాయింపుల్లో బీసీలకు టికెట్లు ఇవ్వకుండా చేశారని, చాలామందికి నామినేటెడ్ పోస్టులు ఇస్తామని ఆశపెట్టి ఇప్పటివరకు పదవులు కేటాయించలేదన్నారు. కాంగ్రెస్ పార్టీకి నిజంగా బీసీల పట్ల చిత్తశుద్ధి ఉంటే 42శాతం నామినేటెడ్ పదవులను బీసీలకు అందించి సామాజిక న్యాయం చేయాలని అన్నారు. కార్యక్రమంలో గుజ్జ కృష్ణ, తాటికొండ విక్రమ్‌గౌడ్, మడత వెంకట్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## ఎర్రకోట పేలుడు నిందితులకు ఎన్ఐఏ కస్టడీ పొడిగింపు

**న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోట పేలుడు కేసులో ఇద్దరు నిందితులకు ఎన్ఐఏ కస్టడీని కోర్టు పొడిగించింది. నిందితుడు యాసిర్ అహ్మద్దారును మరో పది రోజుల పాటు కస్టడీలో ప్రశ్నించడానికి అడిషనల్ సెషన్స్ జడ్జి ప్రశాంత్ శర్మ దర్యాప్తు సంస్థకు శుక్రవారం అనుమతి ఇచ్చారు, మరో నిందితుడు డాక్టర్ బిలాల్ నసీర్ మల్లాను మరో పదిహేడు రోజుల పాటు విచారించనున్నారు. విచారణను మీడియా కవర్ చేయడాన్ని నిషేధించారు. జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) వివరాల ప్రకారం.. నవంబర్ 10న ఎర్రకోట వెలుపల పేలిన పేలుడు ఘటనలో పేలుడు పదార్థాలతో నిండిన కారును నడుపుతున్న ఉమర్ఉన్నబీ, 15 మంది ప్రాణాలను బలిగొన్న ఉగ్రవాద దాడికి ప్రణాళిక వేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) డిసెంబర్ 8న ఢిల్లీలో డాక్టర్ మల్లాను అరెస్టు చేసింది, ఆయనను కుట్రలో కీలక నిందితుడిగా పేర్కొంది. ఎన్ఐఏ దర్యాప్తు ప్రకారం నసీర్ ఉమర్ఉన్నబీకి ఉద్దేశపూర్వకంగా మద్దతు అందించడం ద్వారా ఆశ్రయం కల్పించాడని తెలుస్తోంది.

## మన్మోహన్‌సింగ్‌కు ఘననివాళి

- మాజీ ప్రధాని వినయం, నిజాయితీ, వారసత్వం భవిష్యత్ తరాలకు స్ఫూర్తి అని శ్లాఘించిన కాంగ్రెస్ నేతలు



**న్యూఢిల్లీ:** మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ వినయం, నిజాయితీ, వారసత్వం భవిష్యత్ తరాలకు స్ఫూర్తినిస్తూనే ఉంటాయని కాంగ్రెస్ నేతలు కొనియాడారు. మన్మోహన్ తొలి వర్ధంతి సందర్భంగా శుక్రవారం కాంగ్రెస్ నాయకులు ఆయనకు నివాళులు అర్పించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ సింగ్‌ను పరివర్తన కలిగించే నాయకుడిగా అభివర్ణించారు. ఆయన దేశ ఆర్థిక మార్గాన్ని పునర్నిర్మించారని, ఆర్థిక సంస్కరణల ద్వారా లక్షలాది మందికి అవకాశాలను విస్తరించారని, లక్షలాది మందిని పేదరికం నుండి బయటపడేశారన్నారు. 'తన వినయం, సమగ్రత, జ్ఞానానికి పేరుగాంచిన సింగ్... గౌరవం, కరుణతో నాయకత్వం వహించారని, పురోగతి అందరినీ కలుపుకుని ఉండేలా, సంక్షేమం అత్యంత అవసరమైన వారికి చేరేలా చూసుకున్నారు. హక్కుల ఆధారిత నమూనా ఆ విధానానికి నిదర్శనమని, ఆయన దార్శనికత కింద తాము బలమైన భారతదేశాన్ని నిర్మించామని చెప్పారు. 'నిజాయితీ గల ప్రజా సేవ, శాశ్వత సంస్కరణల వారసత్వం తరతరాలకు స్ఫూర్తినిస్తూనే ఉండే రాజనీతిజ్ఞుడికి హృదయపూర్వక నివాళి అర్పిస్తున్నాము' అని కాంగ్రెస్ చీఫ్ ఎక్స్‌లో పోస్టు చేశారు. లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ కూడా మాజీ ప్రధానికి నివాళులు అర్పించారు. 'తన దార్శనిక నాయకత్వం ద్వారా, ఆయన భారతదేశాన్ని ఆర్థికంగా సాధికారపరిచారు. ఆయన చారిత్రాత్మక ప్రయత్నాలు, పేదల కోసం సాహసోపేతమైన నిర్ణయాలు ప్రపంచ వేదికపై భారతదేశానికి కొత్త గుర్తింపును ఇచ్చాయి' అని గాంధీ అన్నారు. 'ఆయన వినయం, కృషి, నిజాయితీ ఎల్లప్పుడూ మనందరికీ స్ఫూర్తిదాయకంగా ఉంటాయి' అని ఆయన అన్నారు. 'సమగ్రత, వినయం, దార్శనికత కలిగిన రాజనీతిజ్ఞుడిని గుర్తుంచుకుంటాము' అని కాంగ్రెస్ ఎక్స్‌లో పేర్కొంది. మన్మోహన్ నాయకత్వం భారతదేశ ఆర్థిక వ్యవస్థను, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసిందని, నిస్వార్థంగా, దృఢ సంకల్పంతో దేశానికి సేవ చేసిన ప్రధానమంత్రికి నివాళులు అని పార్టీ పేర్కొంది. 'మన్మోహన్ సింగ్ జీ సమానత్వంలో బలమైన విశ్వాసం, బలమైన, ధైర్యవంతుడు, గౌరవప్రదమైన వ్యక్తి, దేశ పురోగతికి నిజంగా అంకితభావంతో ఉన్నారు. ఆయన సరళత, నిజాయితీ, దేశం పట్ల అంకితభావం ఎల్లప్పుడూ మనందరికీ స్ఫూర్తినిస్తాయి' అని ప్రియాంక గాంధీ వాద్రా అన్నారు. 2004 నుండి 2014 వరకు ప్రధానమంత్రిగా పనిచేసిన సింగ్ గత సంవత్సరం 92 సంవత్సరాల వయసులో మరణించారు. నరసింహారావు ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా పనిచేశారు. ఆర్థిక సంస్కరణల సమగ్ర విధానాన్ని ప్రవేశపెట్టిన ఘనత పొందారు.

### బాలల్లో నిండి ఉన్న దేశభక్తి, ఉన్నత ఆదర్శాలే...

## దేశం ఔన్నత్యాన్ని ఇనుమడిస్తుంది

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- 'వీర్ బాల్ దివస్'లో భాగంగా 20మంది బాలలకు 'ప్రధాన్ మంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్' ప్రదానం




**న్యూఢిల్లీ:** రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో అవార్డులు ప్రకటించబడుతోన్న ఆ 20 మంది బాలలు...పేరుకే బాలలు. కానీ... ధైర్యసహసాలు, ఉదారత, సమయస్ఫూర్తి నిండిన సమ్మిళిత సమర్థతను అఖండ భారతానికి చాటిచెప్పిన అసహాయ శూరులు. మానవత్వం నిలువెత్తునా పరిమళించిన చిన్నారులు. వారందరూ యావత్ భారత్‌దేశానికి నిత్యజ్వలిత స్ఫూర్తి ప్రదాతలు. ఆ చిన్నారి చిరుతలు ధైర్యసహసాలు ప్రదర్శిస్తున్న సమయంలో అక్కడికక్కడే అసువులు బాసిన వాళ్లు కొందరు ఉన్నారు. వారి తరపున అవార్డు స్వీకరణకు బరువెక్కిన బాధాతప్త హృదయులై హాజరైన తల్లిదండ్రులు కొందరుకాగా, రికార్డులు సృష్టించిన ఇంకొందరు చిన్నారులు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా శుక్రవారం నాడు 'ప్రధాన్‌మంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్'ను అందుకునే అరుదైన అద్భుత సందర్భం...రాష్ట్రపతిభవన్ లో సంతోషం ఒకవైపు నిర్వేదం మరొకవైపు సమానంగా ఆవరించిన ఒక ఘట్టం ఆవిష్కృతమైంది. ధైర్య సాహసాలు, సామాజిక సేవ, పర్యావరణం, క్రీడలు, కళలు, సంస్కృతి, సైన్స్ అండ్ టెక్నాలజీ రంగాలలో అసాధారణ విజయాలు సాధించడాన్ని గుర్తించి కేంద్ర ప్రభుత్వం ఎంపికచేసిన 20మంది బాలలు ప్రతి ఏటా డిసెంబరు 26న జరుపుకునే 'వీర్ బాల్ దివస్'లో భాగంగా ప్రధాన్‌మంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్‌లను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ముర్ము మాట్లాడుతూ తొలుత ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్ గ్రహీతలను అభినందించారు. అవార్డులు గెలుచుకున్న బాలలు వారి కుటుంబాలకు, సమాజాలకు, దేశానికి కూడా గర్వకారణమని అన్నారు. ఈ అవార్డులు దేశవ్యాప్తంగా ఉన్న పిల్లలందరికీ స్ఫూర్తినిస్తాయని రాష్ట్రపతి విశ్వాసం వ్యక్తం చేశారు. ధైర్య సాహస ప్రతిభావంతులైన వారిని ప్రోత్సహించేందుకు ఈ పురస్కారాలు అందజేస్తున్నాయని ఆమె తెలియజేశారు. డిసెంబరు 26న జరుపుకునే 'వీర్ బాల్ దివస్' ప్రాముఖ్యత గురించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మాట్లాడుతూ దాదాపు 320సంవత్సరాల క్రితం భారతీయులు అందరూ గౌరవించే పదవ సిక్కు గురువు గురు గోవింద్ సింగ్ జీ, అతని నలుగురు కుమారులు సత్యం, న్యాయానికి మద్దతుగా పోరాడుతూ 'అత్యున్నత త్యాగాలు' చేశారని ఆమె శ్లాఘించారు. బాబా జోరావర్ సింగ్, బాబా ఫతే సింగ్ అనే ఇద్దరు చిన్న సాహిబ్జాదాల ధైర్యాన్ని భారతదేశమే కాకుండా విదేశాలలో కూడా గౌరవిస్తున్నారని రాష్ట్రపతి చెప్పారు. అదే సమయంలో సత్యం, న్యాయం కోసం ప్రాణాలర్పించిన ఇక్కడి గొప్ప బాల కథానాయకులు, నాయకురాళ్లను ఆమె గుర్తుచేశారు. ఒకదేశం గొప్పతనం ఆ దేశ పిల్లల్లో దేశభక్తి, ఉన్నత ఆదర్శాలు నిండిఉంటే ఖచ్చితంగా ఇనుమడిస్తుందని ముర్ము చెప్పారు. ధైర్యం, కళ, సంస్కృతి, పర్యావరణం, ఆవిష్కరణలు, సైన్స్ అండ్ టెక్నాలజీ, సామాజిక సేవ, క్రీడల వంటి వివిధ రంగాలలో పిల్లలు తమ అసాధారణ ప్రతిభను ప్రదర్శించారని గమనించి తాను చాలా సంతోషిస్తున్నానని రాష్ట్రపతి తెలియజేశారు. 'ఏడేళ్ల వాకా లక్ష్మి ప్రాగ్నిక వంటి ప్రతిభావంతులైన పిల్లల కారణంగానే భారతదేశం 'ప్రపంచ చెస్ పవర్ హౌస్'గా పరిగణించబడుతోందని అన్నారు. తమ ధైర్యం, తెలివితేటలతో ఇతరుల ప్రాణాలను కాపాడిన అజయ్‌రాజ్‌చ, మహ్మద్ సిదాన్. పి అన్ని ప్రశంసలకూ, పురస్కారాలను స్వీకరించేందుకు అర్హులు' అని ముర్ము పేర్కొన్నారు. తొమ్మిదేళ్ల కూతురు వ్యోమ ప్రియ, 11ఏళ్ల కుమారుడు కమలేష్ కుమార్ వారి ధైర్యంతో ఇతరుల ప్రాణాలను కాపాడుతూ ప్రాణాలు కోల్పోయారని, ఆపరేషన్ సిందూర్ సమయంలో యుద్ధ ప్రమాదాల మధ్య పదేళ్ల శ్రావణ్ సింగ్ తన ఇంటికి దగ్గరలోని సరిహద్దులో ఉన్న భారత సైనికులకు క్రమం తప్పకుండా నీరు, పాలు, లస్సీని సరఫరా చేసేవాడని దివ్యాంగురాలైన కూతురు శివానీ హోసురు ఉప్పర ఆర్థిక, శారీరక పరిమితులను అధిగమించి క్రీడా ప్రపంచంలో అసాధారణ విజయాలు సాధించిందని రాష్ట్రపతి ముర్ము చెప్పారు. అత్యంత పోటీతత్వం, ప్రతిభతో నిండి ఉన్న క్రికెట్ ప్రపంచంలో వైభవ్ సూర్యవంశీ తన కంటూ పేరు తెచుచకునేలా అనేక రికార్డులు నెలకొల్పాడని అవార్డులు గెలుచుకున్న కొంతమంది బాలల గురించి రాష్ట్రపతి ప్రస్తావించారు. ఈ ఏడాది 18 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుండి 20మంది ప్రతిభావంతులైన పిల్లలను సత్కరిస్తున్నట్లు ప్రకటించడం తనకు ఎంతో సంతోషంగా ఉందని, ఈ యువ హీరోలు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చారని రాష్ట్రపతి వివరించారు.

## వందేళ్ల సిపిఐ ఉత్సవాలు


విజయవాడలో...


కేరళలో....


పుదుచ్చేరిలో...


మహారాష్ట్ర నాసిక్‌లో...

## 'జెన్-జీ'పై గొప్ప నమ్మకం

మీరు దేశాభివృద్ధికి కృషి చేయాలి
ప్రధాని మోదీ




**న్యూఢిల్లీ :** జెన్–జీ సామర్థ్యాలను, ఆత్మవిశ్వాసాన్ని చూస్తున్నానని, వారు కష్టపడి పనిచేసి, క్రమశిక్షణతో దేశాభివృద్ధికి కృషి చేయాలని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. తద్వారా వికసిత్ భారత్ లక్ష్యాన్ని నెరవేర్చాలని సూచించారు. యువతకు వివిధ రంగాల్లో అపారమైన అవకాశాలు ఉన్నాయని అన్నారు. శుక్రవారం 'వీర్ బాల్ దివస్' సందర్భంగా జరిగిన జాతీయ కార్యక్రమంలో ప్రధాని మోదీ ఈ మేరకు యువతను ప్రోత్సహించారు. వయస్సుతో సంబంధం లేకుండా పెద్ద సవాళ్లను ఎదుర్కోవాలని మోదీ యువతకు సలహా ఇచ్చారు. 'మీరు అందరూ జెన్–జీ, జెన్‌ఆల్ఫా తరంవారు. మీ తరం భారత్‌ను అభివృద్ధి చెందిన దేశం అనే లక్ష్యం వైపు తీసుకువెళ్తుంది. నేను జెన్–జీ సామర్థ్యాలను, ఆత్మవిశ్వాసాన్ని చూస్తున్నాను. వారిని అర్థం చేసుకుంటున్నాను. మీకు నాకు గొప్ప నమ్మకం ఉంది. ఎవరు చిన్నవారు, ఎవరు పెద్దవారు అనేది వయస్సు నిర్ణయించదు. మీరు చేసే పనులు, సాధించే విజయాల ఆధారంగా గొప్పవారు అవుతారు. మీరు వయస్సులో చిన్నవారు అయినప్పటికీ, ఇతరులు మీ నుంచి స్ఫూర్తి పొందేలా మీరు పని చేయగలరు' అని అన్నారు. స్వల్పకాలిక ప్రజాదరణ (పాపులారిటీ) వల్ల యువత పరధ్యానానికి గురికావద్దని ప్రధాని మోదీ సలహా ఇచ్చారు. దేశ నిర్మాణానికి సహకరించిన మహానుభావుల నుంచి, గొప్ప వ్యక్తుల నుంచి ఆదర్శాలను, మంచి విషయాలను నేర్చుకోవాలని సూచించారు. తమ విజయాన్ని తమకే పరిమితం చేసుకోకుండా, దేశ విజయంగా మార్చడమే లక్ష్యంగా పని చేయాలని చెప్పారు. ఎన్‌డిఎ ప్రభుత్వ హయాంలో అనేక కార్యక్రమాలను చేపట్టి దేశంలోని నిరాశ, నిస్సహాయత వాతావరణాన్ని రూపుమాపిందని, ఇప్పుడు యువతకు ప్రతి రంగంలో పురోగతి సాధించడానికి అవకాశం ఏర్పడిందని మోదీ అన్నారు. 'గతంలో యువత కలలు కనడానికి కూడా భయపడేవారు. ఎందుకంటే పాత వ్యవస్థలు మంచి ఏదీ జరగదనే వాతావరణాన్ని సృష్టించాయి. అప్పట్లో ప్రతి చోట నిరాశ, నిస్సహాయత నెలకొని ఉండేది. కష్టపడి పనిచేయడం వల్ల కలిగే ప్రయోజనం ఏమిటని ప్రజలు ఆలోచించారు. కానీ నేడు పరిస్థితి మారింది. నేడు మన దేశం ప్రతిభను వెతికి పట్టుకుని, వారికి సరైన వేదికను అందిస్తోంది. 140 కోట్ల దేశ ప్రజల బలం వారి కలల వెనుక ఉంది' అని మోదీ అన్నారు. 'డిజిటల్ ఇండియా విజయంతో, ప్రజలకు ఇంటర్నెట్ అనే శక్తి అందుబాటులోకి వచ్చింది. నేడు మీరు నేర్చుకోవడానికి కావాల్సిన వనరలు ఉన్నాయి. సైన్స్, టెక్నాలజీ, స్టార్టప్ రంగాల్లో ప్రవేశించాలని అనుకునేవారికి స్టార్టప్ ఇండియా లాంటి మిషన్లు ఉన్నాయి. క్రీడల్లో రాణించాలని అనుకునేవారికి ఖేలో ఇండియా మిషన్ ఉంది' అని మోదీ అన్నారు. వీర్ సాహిబ్జాదాలను ప్రస్తావిస్తూ, వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని, యువత పెద్ద పెద్ద కలలు కనాలని, కష్టపడి పనిచేయాలని, తమ ఆత్మవిశ్వాసాన్ని ఎప్పుడూ సడలనివ్వకూడదని మోదీ సూచించారు. యువత భవిష్యత్ ఉజ్వలంగా ఉంటేనే భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుందని, వారి ధైర్యం, ప్రతిభ, అంకిత భావం దేశ ప్రగతికి మార్గనిర్దేశం చేస్తాయని మోదీ అన్నారు. 2022 జనవరి 9న ప్రధాన నరేంద్ర మోదీ కీలక ప్రకటన చేశారు. గురు గోవింద్ సింగ్ జీ కుమారుల అమరత్వాన్ని స్మరించుకుంటూ డిసెంబర్ 26ను 'వీర్ బాల్ దివస్'గా పాటిస్తామని ప్రకటించారు. అప్పటి నుంచి ఏటా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

## సుప్రీంకోర్టుకు వెళ్తాం

- 'ఉన్నావ్' అత్యాచార కేసులో దోషి కుల్దీప్ సింగ్ బెయిల్ రద్దు చేయాలి
- ఢిల్లీ హైకోర్టు వెలుపల బాధితురాలు తల్లి ఆందోళన




**న్యూఢిల్లీ:** 'ఉన్నావ్' అత్యాచార కేసులో దోషి కుల్దీప్ సింగ్‌కు విధించిన జీవిత ఖైదు శిక్షను నిలిపివేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం ఢిల్లీ హైకోర్టు వెలుపల బాధిత కుటుంబ సభ్యులు ఆందోళన చేశారు. ఆల్ ఇండియా డెమోక్రటిక్ ఉమెన్స్ అసోసియేషన్ కార్యకర్తలు, సామాజిక కార్యకర్త యోగితా భయానా బాధితురాలి తల్లితో కలిసి కోర్టు వెలుపల నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బహిష్కృత బిజెపి ఎమ్మెల్యే సెంగార్ బెయిల్‌ను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. గత వారం వెలువడిన తీర్పుకు వ్యతిరేకంగా ఢిల్లీ హైకోర్టు వెలుపల జరిగిన నిరసనలో పాల్గొన్న ఉన్నావ్ అత్యాచార బాధితురాలి తల్లి పిటిఐతో మాట్లాడుతూ దోషి కుల్దీప్ సింగ్‌కు విధించిన జీవిత ఖైదు శిక్షను నిలిపివేయడాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయిస్తానని చెప్పారు. తన కుమార్తె తీవ్రమైన బాధను అనుభవించినందున నిరసన తెలిపేందుకు తాను హైకోర్టుకు వచ్చానని బాధితురాలి తల్లి చెప్పారు. తాను మొత్తం హైకోర్టును నిందించడం లేదని, కేవలం ఇద్దరు న్యాయమూర్తులను మాత్రమే నిందిస్తున్నానని, వారి నిర్ణయం తమ నమ్మకాన్ని దెబ్బతీసిందన్నారు. గతంలో న్యాయమూర్తులు తమ కుటుంబానికి న్యాయం చేశారని, కానీ ఇప్పుడు నిందితుడికి బెయిల్ మంజూరు చేశారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఇది మా కుటుంబానికి జరిగిన అన్యాయం. నాకు సుప్రీంకోర్టుపై నమ్మకం ఉంది, మేము దానిని ఆశ్రయిస్తాము' 'అని ఆమె పిటిఐతో అన్నారు. 'కుల్దీప్ సెంగార్ జీవిత ఖైదు శిక్ష కొనసాగాలి, మహిళల గౌరవంతో ఆటలాడటం తగదు' అనే నినాదాలు రాసిన ప్లకార్డులను పట్టుకుని పెద్ద సంఖ్యలో నిరసనకారులు హైకోర్టు వెలుపల ఆందోళన నిర్వహించారు. ఉన్నావ్ అత్యాచార బాధితురాలికి మద్దతుగా వారు 'అత్యాచారాలకు పాల్పడిన వారికి రక్షణ కల్పించడం ఆపండి', 'నేరస్థులను రక్షించడం ఆపండి' వంటి నినాదాలు చేశారు. ఈ తీర్పుపై కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శిస్తూ, నిరసనకారులలో ఒకరు మాట్లాడుతూ, బిజెపి ప్రభుత్వం లేదా కోర్టు అతనికి ఎలా బెయిల్ ఇవ్వగలవు అని ప్రశ్నించారు. వారు అతని బెయిల్‌ను రద్దు చేయాలి లేదా ఈ ప్రభుత్వం దిగిపోవాలని డిమాండ్ చేశారు. 'కోర్టు సెలవులకు కేవలం రెండు రోజుల ముందు బెయిల్ మంజూరు చేయడం యాదృచ్ఛికం కాదు. ఇది ఒక ప్రణాళిక ప్రకారం చేసిన పని. ఈ దేశ పౌరులు మూర్ఖులు కాదు. ఇంకెంత కాలం మమ్మల్ని మోసం చేస్తూ ఉంటారు...'అని మరో మహిళ అన్నారు. సెంగార్ బెయిల్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ, మరో నిరసనకారుడు మాట్లాడుతూ, 'అతను ఒక అమ్మాయిపై అత్యాచారం చేసి, ఆమె తండ్రిని చంపాడు, దానివల్లే ఆమె ఇప్పటికీ ఈ పరిస్థితిలో ఉంది. అత్యాచారానికి పాల్పడిన వారికి రక్షణ కల్పించడం ఆపి, బాధితులను రక్షించండి' అని అన్నారు. ఆందోళనకారులు తమ నిరసనను కొనసాగిస్తుండగా, ఢిల్లీ పోలీసులు మైక్రోఫోన్ ద్వారా ఢిల్లీ హైకోర్టు ముందు ప్రదర్శనలు అనుమతించబడవని ప్రకటించి, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వారిని హెచ్చరించారు. కాగా, మంగళవారం నాడు ఢిల్లీ హైకోర్టు, 2019 డిసెంబర్‌లో ట్రయల్ కోర్టు విధించిన శిక్షపై సెంగర్ దాఖలు చేసిన అప్పీల్ విచారణ పూర్తయ్యే వరకు అతనికి బెయిల్ మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఎమ్మెల్యే బాధితురాలి నివాసానికి ఐదు కిలోమీటర్ల పరిధిలోకి రాకూడదని లేదా అత్యాచార బాధితురాలిని గానీ, ఆమె తల్లిని గానీ బెదిరించకూడదని కోర్టు ఆదేశించింది. ఈ షరతులను ఉల్లంఘిస్తే అతని బెయిల్ స్వయంచాలకంగా రద్దు అవుతుందని కూడా పేర్కొంది. అయితే, బాధితురాలి తండ్రి కస్టడీలో మరణించిన కేసులో కూడా సెంగర్ 10 సంవత్సరాల జైలు శిక్ష అనుభవిస్తున్నందున, ఆ కేసులో అతనికి బెయిల్ మంజూరు కానందున, అతను జైలులోనే ఉన్నాడు.

## హిందువులపై దాడులకు నిరసనగా భారీ ర్యాలీ

**కోల్‌కతా:** బంగ్లాదేశ్‌లో మైనారిటీ హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా శుక్రవారం కోల్‌కతాలోని బంగ్లాదేశ్ డిప్యూటీ హైకమిషన్ కార్యాలయం వరకు హిందూ అనుకూల సంస్థ అయిన హిందూ సంహతి కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. మిషన్ అధికారులకు ఆరు సూత్రాల డిమాండ్ల పత్రాన్ని సమర్పించారు. సంస్థకు చెందిన ముగ్గురు సభ్యుల ప్రతినిధి బృందం దౌత్య కార్యాలయానికి చెందిన ఒక సీనియర్ అధికారిని కలిసి తమ డిమాండ్లను సమర్పించింది. డిసెంబర్ 18న మెయమెన్‌సింగ్‌లో దీపు చంద్ర దాస్ హత్యకు పాల్పడిన వారికి కఠిన శిక్ష విధించాలని, బంగ్లాదేశ్‌లో మైనారిటీలకు, వారి మత సంస్థలకు భద్రత కల్పించాలని ఈ డిమాండ్లలో పేర్కొన్నారు. 'దీపు దాస్ హంతకులకు, అలాగే ఈ ఘటనను చూసీచూడనట్లు వ్యవహరించిన పోలీసు అధికారులకు కఠిన శిక్ష విధించాలని మేము డిమాండ్ చేశాము.హిందువులు, ఇతర మైనారిటీలపై పుకార్లు వ్యాప్తి చేస్తూ, ఇటువంటి దాడులకు కారణమవుతున్న వారిపై బంగ్లాదేశ్ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కూడా మేము పట్టుబట్టాము' అని హిందూ సంహతి సలహా కమిటీ సభ్యుడు, ప్రతినిధి బృందంలో సభ్యుడైన రజత్ రాయ్ అన్నారు. తాము చేసిన డిమాండ్లను బంగ్లాదేశ్ ప్రభుత్వానికి పంపుతానని ఆ దౌత్యవేత్త తమకు హామీ ఇచ్చారని ప్రతినిధి బృందం సభ్యులు విలేకరులకు తెలిపారు.

### తిరువనంతపురం మేయర్‌గా

## వి.వి.రాజేశ్ ప్రమాణం



**తిరువనంతపుర:** కేరళ రాజధాని తిరువనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌గా బిజెపికి చెందిన వి.వి.రాజేశ్ ఎన్నికయ్యారు. మేయర్ ఎన్నికలో ఆయనకు 51 ఓట్లు వచ్చాయి. 101మంది సభ్యులున్న తిరువనంతపురం కార్పొరేషన్‌లో బిజెపికి చెందిన 50మంది కౌన్సిలర్లతోపాటు ఓ స్వతంత్ర సభ్యుడూ రాజేశ్‌కు మద్దతు ఇచ్చారు. ఎల్‌డిఎఫ్ మేయర్ అభ్యర్థి ఆర్‌పి శివాజీకి 29 ఓట్లు, యుడిఎఫ్ మేయర్ అభ్యర్థి కెఎస్ శబరినాథన్‌కు 17ఓట్లు వచ్చాయి. యుడిఎఫ్‌కు అనుకూలంగా పడిన మరో రెండు ఓట్లు తర్వాత తిరస్కరణకు గురయ్యాయి. ఎన్నికల ఫలితాల ప్రకటన తర్వాత తిరువనంతపురం మేయర్‌గా బిజెపికి చెందిన రాజేశ్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు రాజీవ్ చంద్రశేఖర్, మాజీ కేంద్ర మంత్రులు వి. మురళీధరన్, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కే సురేంద్రన్ సహా సీనియర్ నేతలు పాల్గొన్నారు. 'కేరళ రాజకీయాలను మలుపు తిప్పే చారిత్రక ఘట్టం ఇది. తిరువనంతపురంలో మారిన రాజకీయ పరిస్థితులు యావత్ కేరళను ప్రభావితం చేస్తాయి. అందరిని కలుపుకొని ముందుకు సాగుతాం. కార్పొరేషన్‌లోని 101 స్థానాలను సమాన ంగా అభివృద్ధి చేస్తాం. తిరువనంతపురాన్ని దేశంలోని అభివృద్ధి చెందిన నగరంగా తీర్చిదిద్దుతాం' అని వివి అన్నారు.

**తిరువనంతపురం కార్పొరేషన్ ఎన్నికల్లో బిజెపి విజయం**

ఇటీవల జరిగిన తిరువనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బిజెపి తొలిసారి విజయం సాధించింది. నాలుగు దశాబ్దాలపాటు అప్రతిహతంగా మేయర్ పదవిలో కొనసాగిన ఎల్‌డిఎఫ్ తొలిసారి ఓటమిపాలైంది. తిరువనంతపురం కార్పొరేషన్‌లోని 101 వార్డుల్లో బిజెపి 50, ఎల్‌డిఎఫ్ 29, యుడిఎఫ్ 19, స్వతంత్ర అభ్యర్థులు రెండు స్థానాలు గెలుచుకున్నారు. తిరువనంతపురం కార్పొరేషన్‌తో పాటు త్రిపుంతుర, పాలక్కాడ మున్సిపాలిటీలను బిజెపి గెలుచుకుంది. అటు కొల్లాం కార్పొరేషన్ మేయర్‌గా యుడిఎప్ అభ్యర్థి ఎకె హాఫీజ్ ఎన్నికయ్యారు. కొచ్చి కార్పొరేషన్ మేయర్‌గా నాలుగుసార్లు కౌన్సిలర్‌గా గెలిచిన వికె మినిమోల్ ఎంపికయ్యారు. త్రిస్సూర్ మేయర్‌గా యూడీఎఫ్ అభ్యర్థి డాక్టర్ నితిన్ జస్టిన్ గెలిచారు. మొత్తం ఆరు కార్పొరేషన్లకు ఎన్నికలు జరగగా ఇందులో నాలుగు యుడిఎఫ్ గెలుపొందగా, బిజెపి, ఎల్‌డిఎఫ్ చెరొక కార్పొరేషన్‌ను దక్కించుకున్నాయి.

### శబరిమల బంగారం అదృశ్యం కేసులో

## తమిళనాడులో సిట్ దర్యాప్తు

**తిరువనంతపురం :** శబరిమల బంగారం అదృశ్యం కేసులో ఒక వ్యాపారవేత్త కోసం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) శుక్రవారం తన దర్యాప్తును తమిళనాడుకు విస్తరించిందని పోలీసులు తెలిపారు. పోలీసులు తమిళనాడులోని దిండిగల్‌కు చెందిన డి మణి అలియాస్ బాలమురుగన్ అనే నగల వ్యాపారి కోసం గాలిస్తున్నారు. పోలీసు వర్గాల ప్రకారం, శబరిమల బంగారం అదృశ్యం ఘటనలో ఒక అంతర్జాతీయ పురాతన వస్తువుల రాకెట్ ప్రమేయం ఉందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రమేష్ చెన్నితాల ఒక ప్రకటన చేసిన తర్వాత, మణి, అతని సహచరుడు సిట్ దృష్టికి వచ్చారు.

SHRIRAM Finance వాహనముల బహిరంగ వేలం ప్రకటన

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీన పరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించనైనది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | AP24TV 0063 | Murtaza Shaik | TATA LPT 3118 CUMMINS FBT | 2013 |
| 2 | TS08UB 4002 | Srikanth Puli | TATA ACE | 2015 |
| 3 | TG03T 2271 | Kalyan Emmadi | APE XTRA LDX CLASSIC BS6 DIESEL | 2025 |
| 4 | TS03EE 7189 | Murtaza Shaik | ZEST 1.3L XM QUADRAJET 90PS DIESEL 5 SEATER | 2015 |
| 5 | TS03UB 7151 | Anand Bopparati | TATA ACE | 2016 |

AUCTION DATE 27-12-2025
VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL
గమనిక : ప్రకటన తేది నుండి బండి అమ్ముడు అయే వరకు వర్తించును
SHRIRAM FINANCE LIMITED
D No :19-11-409/3. 1st floor, Beside GMR Gokul Appartments
Shambunipet, Warangal - 506002, Cell 9989809938, 9000298883

ప్రకటన

ఇందు మూలముగా సమస్త ప్రజానీకానికి, అధికార, అనధికారులకు తెలియపడుచునది ఏమనగా, నేను అనగా నల్ల పద్మ, W/o నల్ల రామకృష్ణయ్య, వయస్సు: 61 సంవత్సరాలు, నివాసం: పోచన్న పేట గ్రామం, బచ్చన్న పేట మండలం, జనగామ జిల్లా, సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం తల్లిదండ్రులకు సంక్రమించిన అధికారాల ప్రకారం నా పెద్ద కొడుకైన నల్ల అశోక్ కుమార్, S/o నల్ల రామకృష్ణయ్య, రెండవ కుమారుడైన నల్ల శ్రవణ్, S/o నల్ల రామకృష్ణయ్యను మరియు నా పెద్ద కుమార్తె నల్ల నిర్మల, S/o నల్ల రామకృష్ణయ్యను నా కుటుంబం నుండి శాశ్వతంగా బహిష్కరించుచున్నాను. దీని పర్యవసానంగా కీర్తి శేషులైన నా భర్త నల్ల రామకృష్ణయ్య నుండి నాకు సంక్రమించిన స్థిర, చరాస్తుల్లోను, ఇల్లు, వ్యవసాయ భూమి, బంగారం, వెండి, నగదు మరియు ప్రభుత్వం నుంచి వచ్చే పెన్షన్ మొదలైన ఎట్టి పరిహారం లోనూ ఈ ముగ్గురికి ఎలాంటి భాగస్వామ్యం లేదు. కారణమేమనగా ఈ ముగ్గురు నన్ను తిండికి, బట్టకు, మందులకు దూరం చేసి నానా యాతనలకు గురి చేసి నేను చనిపోయేలా చేస్తున్నారు. అందుకే ఈ బహిష్కరణ వేటు వేయనైనది.

ఇట్లు
**నల్లపద్మ**
ఇ.నెం.10-100-221, పోచన్నపేట,
బచ్చన్నపేట మండలం, జనగామ జిల్లా.

ప్రజాపక్షం
శనివారం, 27 డిసెంబరు

# క్రిస్మస్ రోజున మతవిద్వేషం

డిసెంబర్ 25 – క్రీస్తు జననాన్ని ప్రపంచవ్యాప్తంగా తరతమస్థాయిలో వేడుకగా ఆహ్వానించే రోజు. క్రైస్తవ మతావలంబకులకు అది మహాపర్వదినం. అధికారం కోసం, పదవులకోసం దశాబ్దంపైబడి రాజ్యాంగ విరుద్ధంగా మత విభజన రాజకీయాలు నడిపిస్తున్న లౌకిక భారతదేశంలో గురువారంనాడు పలు రాష్ట్రాల్లో హిందూత్వవాదులమని చెప్పుకునే మూకలు క్రైస్తవ ఉత్సవ కేంద్రాలపై దాడి చేయటం, వేడుకల సామాగ్రి దగ్ధం చేయటం, క్రైస్తవ మత వ్యతిరేక నినాదాలు చేయటం సిగ్గుపడాల్సిన విషయం. హిందూత్వ ఆధిపత్య వాదానికి ఫౌంటైన్ హెడ్ లాంటి ఆర్ఎస్ఎస్‌కు చెందిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ న్యూఢిల్లీలో కేథడ్రల్ చర్చి ఆఫ్ రిడంప్షన్‌లో గురువారం ఉదయం ప్రార్థనల్లో స్వయంగా పాల్గొన్నారు. ‘‘ఆ ఆరాధన కార్యక్రమం ప్రేమ, శాంతి, కరుణ అనే సర్వకాల సందేశాన్ని ప్రతిబింబించింది. క్రిస్మస్ స్ఫూర్తి మన సమాజంలో సామరస్యం, సద్భావనను ఉత్తేజితం చేయుగాక’’ అని ప్రధాని ఎక్స్‌లో తన సందేశం పోస్టు చేశారు. దేశ పౌరులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ‘‘శాంతి, కరుణ, ఆశాభావం నిండిన హృదయాలతో ప్రతి ఒక్కరూ సంతోషంగా క్రిస్మస్ జరుపుకోవాలని ఆకాంక్షించిన ప్రధాని మోదీ జీసస్ క్రైస్ట్ బోధనలు మన సమాజంలో సామరస్యాన్ని పటిష్టవంతం చేయుగాక’’ అని అభిలషించారు. అజ్మీర్‌లోని ప్రసిద్ధ సూఫీ ప్రవక్త ఖ్వాజా మహమ్మద్ చిస్తి దర్గాకు కొద్దిరోజుల క్రితం ప్రేమపూర్వకంగా చద్దర్ పంపారు. లౌకికవాదంలో ఆయన విశ్వాసం సందేహాస్పదం అయినా ప్రధానిగా ఇవి మంచి సంకేతాలు.

ఆర్ఎస్ఎస్ వారు తమ లెక్కకుమిక్కిలి అంగాల ద్వారా తమ మత ప్రచారం తాము చేసుకోవచ్చు. మత రహితమైన భారత రాజ్యాంగం పౌరులకు మత విశ్వాస, ఆరాధనా, ప్రచార స్వేచ్ఛ ఇచ్చింది. కాని ఇతర మతస్థులకు ఉన్న అదే స్వేచ్ఛను వ్యతిరేకించటం, హరించే విధంగా దాడులకు పాల్పడటం ఖండనార్హం, చట్టప్రకారం శిక్షార్హం. ప్రధాని మోదీ ఢిల్లీలో చర్చి సర్వీసులో పాల్గొన్న రోజే దేశంలోని వివిధ ప్రాంతాల్లో విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్, సర్వ హిందూ సమాజ్ తదితర సంస్థలకు చెందిన అల్లరిమూకలు క్రిస్మస్ వేడుకలు జరుపుకునే ప్రదేశాలపై దాడి చేయటం, అలంకరణలు ధ్వంసం చేయటం, సామాగ్రి తగలబెట్టటం వంటి దుశ్చర్యలకు పాల్పడ్డారు. క్రైస్తవ సంస్థలకు విదేశాలనుంచి నిధులు వస్తున్నాయని, ఆ ధనంతో పేదలను ప్రలోభపెట్టి మత మార్పిళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఎప్పటినుంచో ఉన్నవే. పేదలేకాదు, అగ్రవర్ణాల్లో సైతం స్వచ్ఛందంగా క్రైస్తవం స్వీకరిస్తున్నవారు ఎందరో ఉన్నారు. అది వారి విశ్వాసం. కాని 2014 నుంచి ఎన్నికల్లో గెలుపుకోసం ఆర్ఎస్ఎస్–బిజెపి మతవిభజనను ఆయుధంగా ఉపయోగించటం, ముఖ్యంగా ఇస్లాం, క్రైస్తవ మతాలవారిపై దాడి చేయటం పెరిగిన దరిమిలా సమాజంలో సామరస్యం బదులు ద్వేషభావం పెచ్చరిల్లింది. దాని పర్యవసానమే క్రిస్మస్ సందర్భంగా దాడులు.

బిజెపి పరిపాలనలో చత్తీస్‌ఘడ్‌లోని రాయ్‌పూర్‌లో క్రిస్మస్ ముందురోజు ఒక గుంపు క్రిస్మస్ అలంకరణ సామాగ్రి విక్రయించే ఒక దుకాణంపై దాడి చేశారు. ఉత్తరప్రదేశ్, అసోం, ఢిల్లీలో కూడా దాడులు జరిగాయి. యుపిలోని బరేలీలో హిందూత్వ కార్యకర్తలు చర్చిలముందు హనుమాన్ చాలీసా పఠిస్తూ కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. కొన్నిచోట్ల ఉత్సవ ఏర్పాట్లను ధ్వంసం చేశారు. అసోంలోని నల్బరీలో విహెచ్‌పి, బజరంగ్‌దళ్ కార్యకర్తలు ఒక స్కూలులో క్రిస్మస్ వేడుక అలంకరణలను ధ్వంసం చేశారు. ఢిల్లీలో వేడుక జరుపుకుంటున్న స్త్రీలు, పిల్లలతో, శాంతా టోపీలు ధరించిన వారితో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు గొడవపడ్డారు. మధ్యప్రదేశ్‌లో మరో ఘటనలో ఒక అంధురాలితో బిజెపి కార్యకర్త గొడవకుదిగాడు. చత్తీస్‌ఘడ్‌లోని వివిధ సామాజిక, గిరిజన, హిందూ సంఘాలతో కూడిన సర్వ హిందూ సమాజ్ 24వ తేదీన రాష్ట్రబంద్‌కు పిలుపు ఇచ్చింది. క్రైస్తవులపై మత మార్పిడుల ఆరోపణతో నిరసన అంటూ క్రిస్మస్ ముందురోజు బంద్‌కు పిలుపు ఇవ్వటంలో దురుద్దేశం స్పష్టం. కేరళలోని పాలక్కాడ్‌లో బాలల గానబృందంపై ఆర్ఎస్ఎస్ అనుయాయులు దాడి చేశారు. వెలుగులోకి రాని ఇలాంటి ఘటనలు ఇంకెన్నో జరిగి ఉండవచ్చు. తలకెక్కిన మత విద్వేష విషం ఈ ఘటనలకు మూలం. ప్రధాని కోరిన సామరస్యం, సద్భావంలో నిజంగా విశ్వాసం ఉంటే ఆర్ఎస్ఎస్ అనుబంధ సంస్థల నేతల మెదళ్లు శుభ్రపరిచే కృషి మొదలుపెట్టాలి.

ఇటువంటి విద్వేషపూరిత సంఘటనలు మత సామరస్యాన్ని భంగపరుస్తాయి. మైనారిటీల్లో భయం నింపుతాయి. క్రిస్మస్ క్రైస్తవుల్లో ‘‘భయం, ఆందోళన’’ కలుగజేసిందని ఈ గుండాగిరీ చర్యల నేపథ్యంలో కాంగ్రెస్ ఎంపి శశిథరూర్ వ్యాఖ్యానించారు. ఆందోళన కలిగించే అటువంటి ఘటనలు ఖండించదగినవని కాంగ్రెస్ నాయకుడు, రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ అన్నారు. శాంతిభద్రతల యంత్రాంగం, న్యాయవ్యవస్థ రాజ్యాంగాన్ని పరిరక్షిస్తూ కఠిన చర్యలు తీసుకోవటం అవసరం.

# అసెంబ్లీ సాక్షిగా ‘వాటర్ వార్’!



ఎస్.కె.జకీర్

అసెంబ్లీ సమావేశాల్లో ఇరిగేషన్ రంగంపై వాడి, వేడీ చర్చ జరగనున్నది. డిసెంబర్ 24న కోస్గి సభలో రేవంత్ ప్రసంగం అసెంబ్లీ సమావేశాలకు శాంపిల్ వంటిది. ఈ సమావేశాలకు కెసిఆర్ హాజరయ్యేది లేనిదీ ఇంకా స్పష్టత రాలేదు. ఆయన అసెంబ్లీకి హాజరవుతారని, సిఎం రేవంత్ రెడ్డిని చెండాడుతారని ఏపి మాజీ ముఖ్యమంత్రి జగన్ మీడియాలో కథనాలు వస్తున్నాయి.

ఏపి, తెలంగాణకు కృష్ణా, గోదావరి నీటి కేటాయింపులు, పాలమూరు–రంగారెడ్డి సహా పెండింగ్ ప్రాజెక్టులపై చర్చకు ప్రభుత్వం సిద్ధమైంది. అసెంబ్లీ శీతాకాల సమావేశాలలో కాంగ్రెస్, బిఆర్ఎస్ మధ్య మాటల యుద్ధంతో హఠాత్తుగా ఉష్ణోగ్రతలు పెరగవచ్చు. అయితే ఇదంతా ప్రధాన ప్రతిపక్ష నాయకుడు కెసిఆర్ పాల్గొనడం, పాల్గొనకపోవడాన్ని బట్టి ఉంటుంది. కానీ బిఆర్ఎస్ పార్టీ వర్గాల కథనం ప్రకారం కెసిఆర్ గైరుహాజరు అవకాశాలే ఎక్కువ. రేవంత్ రెడ్డిని, కెసిఆర్ తన సమఉజ్జీగా భావించడం లేదు కనుక రారన్నది ఆ వర్గాల అభిప్రాయం. కెసిఆర్ మాత్రమే తనతో సమానుడు అని ముఖ్యమంత్రి రెడ్డి భావన. ఆయన కెటిఆర్, హరీష్ రావు వంటి వారిని ఖాతరు చేయదలచుకోలేదని ఇదివరకటి అసెంబ్లీ సమావేశాల తీరు తెన్నులు, తరచూ సిఎం.రేవంత్ రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలను బట్టి మనం అర్థం చేసుకోవచ్చు.

2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన తరువాత బిఆర్ఎస్ చీఫ్, మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ఎక్కువగా తన ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారు. గత ఏడాదికాలంలో కెసిఆర్ ఒక్కసారి కూడా అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొనలేదు. ‘‘కెసిఆర్ వచ్చే నాలుగేళ్ల పాటు సభకు హాజరుకావడం లేదనే విషయం నిజమే. సీనియర్ ఎన్టీఆర్, జయలలిత, ఇతర మాజీ సిఎంలు కూడా చాలా కాలంపాటు అసెంబ్లీకి దూరంగా ఉన్నారు. మళ్లీ ప్రజాతీర్పుతో గెలిచి సిఎంలుగా అడుగుపెట్టారు. వచ్చే ఎన్నికల్లో కెసిఆర్ ముఖ్యమంత్రిగానే మళ్లీ అసెంబ్లీలో అడుగు పెడతారు. నేను, మా పార్టీ నేతలు కూడా అసెంబ్లీకి రావద్దని కెసిఆర్‌కి సలహా ఇస్తున్నాం. ఆయనను అసెంబ్లీకి రాకుండా అడ్డుకుంటున్నాం. ఆయన అసెంబ్లీకి ఎందుకు రావాలి? కాంగ్రెస్ సభ్యుల దిక్కుమాలిన శాడిజంతో అవమానిస్తుంటే మహానేత కెసిఆర్ భరించాలా?’’అని ఏడాది కిందటే కెటిఆర్ నిర్మొహమాటంగా అన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులు, నీటి కేటాయింపుల విషయంలో బిఆర్ఎస్ చేస్తున్న విష్రపచారాన్ని, అబద్ధాలను అసెంబ్లీ వేదికగా తిప్పికొడదామన్న నిర్ణయానికి రేవంత్ రెడ్డి వచ్చారు. నదీ జలాలకు సంబంధించి ఉమ్మడి రాష్ట్రంలో కంటే పదేళ్ల కెసిఆర్ పాలనలోనే తెలంగాణకు ఎక్కువ అన్యాయం జరిగిందని సిఎం రేవంత్ రెడ్డి అంటున్నారు. చంద్రబాబు ప్రభుత్వం పట్టిసీమ ప్రాజెక్టును చేపట్టడాన్ని తెలంగాణ అసెంబ్లీ వేదికగా కెసిఆర్ ప్రశంసించిన వీడియోను అసెంబ్లీలో ప్రదర్శించనున్నారు. కృష్ణా నీటి కేటాయింపుల్లో కెసిఆర్ తీరుతో తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని పలుమార్లు ముఖ్యమంత్రి రేవంత్ ప్రస్తావించారు. ఈ అంశాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సహచర మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులకు సిఎం చెప్పారు. ప్రాజెక్టులు, నీటి కేటాయింపుల్లో తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని అసెంబ్లీలో సిఎం పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇవ్వనున్నారు.ఈ మేరకు అవసరమైన ఏర్పాట్లు జరుగుతున్నవి. ప్రాజెక్టులకు సంబంధించి కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న అంశాలు, అనుమతులు లేకుండా ఏపి కడుతున్న అక్రమ ప్రాజెక్టులను అడ్డుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన చర్యలనూ ఈ సందర్భంగా సిఎం వివరిస్తారు.

కృష్ణా నదీ జలాల విషయంలో కర్ణాటక, మహారాష్ట్ర, ఏపి, తెలంగాణల మధ్య వివాదాలు తరచూ వస్తున్నాయి. పెద్ద నదుల్లో కృష్ణ నాలుగోది. మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో ప్రవహిస్తోన్న ఈ నది, పొడవులో గంగ, బ్రహ్మపుత్ర, గోదావరుల తరువాతి స్థానంలో ఉంటుంది.

దాదాపు 1300 కిలోమీటర్లు ప్రవహించే ఈ నది, మహారాష్ట్ర నుంచి కర్ణాటక, అక్కడి నుంచి తెలంగాణ, ఆ తరువాత ఆంధ్రాలోకి వస్తుంది. సుమారు 90 కిలోమీటర్ల దూరం తెలంగాణలో ప్రవహించి, ఆ తరువాత తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాల సరిహద్దుగా ఉంటుంది. అంటే నదికి ఒకవైపు తెలంగాణ, మరోవైపు ఆంధ్రప్రదేశ్ ఉంటాయి. అలంపురం నుంచి ముక్త్యాల వరకు ఈ నది రెండు రాష్ట్రాలకు సరిహద్దు. ఆ తరువాత పూర్తిగా ఆంధ్రప్రదేశ్‌లో ప్రవహించి సముద్రంలో కలుస్తుంది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా ఉన్నప్పుడు మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ మధ్య నీటి పంపకాల వివాదాలు ఉండేవి. ఒకే రాష్ట్రంలో ఉన్నప్పటికీ, తెలంగాణ, ఆంధ్ర మధ్య కూడా కృష్ణా నీటి విషయంలో వివాదం ఉంది. అంతేకాదు, ఏపిలో కూడా రాయలసీమ, కోస్తా ప్రాంతం మధ్య కూడా కృష్ణా నీటి విషయంలో వివాదం ఉంది. కృష్ణానదిపై శ్రీశైలం, నాగార్జున సాగర్, పులిచింతల ప్రాజెక్టులు తెలంగాణ, ఆంధ్రాలకు ఉమ్మడిగా ఉన్నాయి. ఈ ప్రాజెక్టులకు కుడివైపున ఏపి ఉండగా, ఎడమవైపున తెలంగాణ ఉంది.

వీటికి ఎగువన ఉన్న జూరాల ప్రాజెక్టు తెలంగాణ భూభాగంలో ఉండగా, దిగువన ఉన్న ప్రకాశం బ్యారేజీ ఏపి భూభాగంలో ఉంది. ఇవికాక అనేక లిఫ్టు పథకాలు ఉన్నాయి. రెండు రాష్ట్రాల అవసరాలను ఈ ప్రాజెక్టులు తీరుస్తున్నాయి.

కృష్ణానదిలో మొత్తం 2060 టిఎంసిల నీరు నికరంగా ఉంటుందని లెక్కేసి, అప్పటి మూడు రాష్ట్రాలకు ఆ నీటిని పంచారు. అందులో 560 టిఎంసిలు మహారాష్ట్రకు, 700 టిఎంసిలు కర్ణాటకకు, 800 టిఎంసిలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించారు. ఈ నీళ్లను నది లో ఎక్కడి నుంచైనా, ఏ ప్రాజెక్టు ద్వారానైనా వాడుకోవచ్చని చెప్పారు.

ఇక నదిలో మిగులు జలాలు 330 టిఎంసిలుగా అంచనా వేశారు. మిగులు జలాల్లో మహారాష్ట్రకు 25 శాతం, కర్ణాటకకు 50 శాతం, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు 25 శాతం ఇస్తారు. ఈ మిగులు జలాల పంపిణీ విషయంలో రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం లేకపోతే అప్పుడు పార్లమెంటు జోక్యం చేసుకుని నిర్ణయం తీసుకోవాలని రాశారు. అయితే 1976 నాటికి ఈ మిగులు జలాల గురించిన తీర్పు ను కేంద్రం ఆమోదించక పోవడంతో తాత్కాలికంగా మిగులు జలాలపై ఆంధ్రప్రదేశ్‌కు అవకాశం ఇచ్చారు. కానీ అది హక్కు కాదు. అంటే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, దిగువన ఉంది కాబట్టి మిగులు జలాల పై సహజ వెసులుబాటును గుర్తించారు. జస్టిస్ బ్రిజేశ్ కుమార్ అధ్యక్షులుగా, జస్టిస్ ఎస్‌పి శ్రీవాస్తవ, జస్టిస్ డికె సేత్ సభ్యులుగా 2004 ఏప్రిల్‌లో కొత్త ట్రిబ్యునల్ వేశారు. అందులో శ్రీవాస్తవ మధ్యలో మరణించగా, ఆయన స్థానంలో బిపి దాస్‌ను నియమించారు. బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ 2007 జూలైలో పని ప్రారంభించి 2010 డిసెంబరులో ఒక ముసాయిదా తీర్పు ఇచ్చింది. ఈ తాజా ముసాయిదా తీర్పు కింద ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కి 1001 టిఎంసిలు, కర్ణాటకకు 911 టిఎంసిలు, మహారాష్ట్రకు 666 టిఎంసిల నీరు ఇచ్చారు. మొత్తం నది నీటిలో 65శాతం లభ్యత లెక్కేసి ఈ కేటాయింపులు చేశారు. 2013 నవంబరులో బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ తుది తీర్పు ఇచ్చింది. అందులో కర్ణాటకకు నాలుగు టిఎంసిలు తగ్గించి ఆంధ్రకు పెంచారు.

అయితే ఈ తీర్పులను పాటించలేదని పలు రాష్ట్రాలు పక్క రాష్ట్రాలపై పలు సందర్భాల్లో కేసులు వేశాయి. ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత కృష్ణా జలాల వ్యవహారం రెండు రాష్ట్రాలు, మూడు ప్రాంతాల మధ్య వివాదంగా మారింది. బచావత్ ట్రిబ్యునల్ తీర్పు ప్రకారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కి కృష్ణా నీళ్లు కర్ణాటక కంటే ఎక్కువ వచ్చాయి. సహజ నదీ సూత్రాల ప్రకారం, కృష్ణా నది, దాని ఉప నదులు ఎక్కువగా ప్రవహించే కర్ణాటకకే సహజంగా ఎక్కువ నీటి కేటాయింపులు జరగాలి. ఆ నది బేసిన్ సింహభాగం కర్ణాటకలోనే ఉంది. కరెంటు కోసం కట్టిన శ్రీశైలం ప్రాజెక్టును ముందుగా తాగునీటి కోసం, తరువాత సాగునీటి కోసం వాడుకోవడం క్రమంగా మొదలైంది. ఆ క్రమంలో చెన్నైకి తాగునీరు ఇచ్చేందుకు తెలుగు గంగ పథకం చేపట్టారు. ఆ తెలుగుగంగ కాలువలోకి నీటిని తీసుకోవడం కోసం కర్నూలు జిల్లాలోని పోతిరెడ్డిపాడు అనే చోట హెడ్ రెగ్యులేటర్ వ్యవస్థ నిర్మించారు.

శ్రీశైలం డ్యామ్ నుంచి నీటిని కాలువల్లోకి ఎత్తిపోసే వ్యవస్థే పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్. మొదట్లో దీన్ని 11,500 క్యూసెక్కుల నీటిని కాలువల్లోకి పారించే సామర్థ్యంతో నిర్మించారు. దీని ద్వారా చెన్నైకి తాగునీరే కాకుండా, కృష్ణాలో వరద వచ్చినప్పుడు అదనంగా వచ్చే నీటిని రాయలసీమకు ఇవ్వవచ్చు. వాస్తవానికి రాయలసీమలో చాలా భాగం పెన్నా నది బేసిన్‌లో ఉంటుంది. కృష్ణా నది బేసిన్ పరిధిలోకే వచ్చే మహబూబ్‌నగర్ వంటి ప్రాంతాలు తీవ్ర కరవుతో ఉన్నప్పుడు, ముందు మహబూబ్‌నగర్‌కి ఇవ్వకుండా అసలు కృష్ణా బేసిన్‌లో లేని రాయలసీమకు నీరు ఇవ్వడం సరికాదని తెలంగాణ వాదన. అందుకే తరచూ పోతిరెడ్డిపాడు విషయంలో రాయలసీమ తెలంగాణ మధ్య గొడవ వస్తుంది.

పోతిరెడ్డిపాడు వల్ల రాయలసీమకు లాభమే కానీ తెలంగాణకు నష్టం లేదని ఆంధ్రప్రదేశ్ వాదన. కానీ దీనికి అప్పట్లో కోస్తా రైతుల నుంచి కూడా అభ్యంతరం వచ్చింది. పోతిరెడ్డిపాడు సామర్థ్యం పెంచి శ్రీశైలం నీటిని రాయలసీమకు ఇస్తే, తమకు నీరు లోటు రావచ్చని భయపడి ఆ నిర్ణయానికి వ్యతిరేకంగా కోస్తా రైతులు ఆందోళన చేసారు.

ఇది ఒక దశలో రాయలసీమ వర్సెస్ కోస్తా అండ్ తెలంగాణలా అయింది. మొత్తానికి పోతిరెడ్డిపాడు సామర్థ్యం పెంచారు. అటు పులిచింతల, ఇటు పట్టిసీమ వల్ల కృష్ణా డెల్టా రైతులకు సాగునీటికి భరోసా దక్కింది. దీంతో వారు రాయలసీమకు నీటిని తీసుకెళ్లే పథకాలపై పెద్దగా అభ్యంతరం పెట్టడం మానేశారు. కానీ రాయలసీమ, తెలంగాణ మధ్య వివాదం అలానే ఉండిపోయింది. శ్రీశైలం నుంచి నీటిని ముందే సీమకు తోడేస్తే కింద నాగార్జున సాగర్‌లోకి నీరు రాక, సాగర్ కుడి కాలువ చివర్లో ఉన్న తమకు నీరు అందడంలో ఇబ్బంది ఉంటుందని ప్రకాశం జిల్లాలోని కొన్ని ప్రాంతాల వారు కూడా అభ్యంతరం చెబుతున్నారు. ఇది మరో వివాదం. రాయలసీమలో చాలా భాగం పెన్నా బేసిన్‌లో ఉంటుంది కాబట్టి, ముందు తెలంగాణ వాడుకున్న తరువాతే రాయలసీమలోని కృష్ణా బేసిన్ కాని భాగాలకు నీరు ఇవ్వాలని తెలంగాణ వాదన. అయితే, తాము అలానే చేస్తున్నామని, కేవలం మిగులు, వరద జలాలు తప్ప నికర జలాల్లోంచి రాయలసీమలోని పెన్నా బేసిన్‌కి నీరు ఇవ్వడం లేదని ఆంధ్రప్రదేశ్ చెబుతోంది. ఏపి చెప్పేది నిజం కాదని, తెలంగాణకు నికరంగా రావాల్సిన నీటిని కూడా రాయలసీమకు తరలించుకుపోతోందని తెలంగాణ ఆరోపణ. ఈ పరిస్థితుల్లో 2014లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ విడిపోయాయి. బేసిన్ల లెక్కల ప్రకారం చూస్తే తెలంగాణ రాష్ట్రంలో కృష్ణా బేసిన్ 68శాతం ఉండగా, నీటి వాటా 37శాతం వచ్చింది. ఇక ఆంధ్రలో కృష్ణా బేసిన్ 32శాతం ఉండగా, నీటి వాటా 64శాతం వచ్చింది.

ఉమ్మడి రాష్ట్రానికి ముందు నుంచి ఉన్న 811 టిఎంసిల నీటిని రెండు రాష్ట్రాలు పంచుకున్నాయి. ఏపికి 512 టిఎంసిలు, తెలంగాణ కు 299 టిఎంసిలు అనుకున్నారు. ఇది తాత్కాలిక సర్దుబాటు మాత్రమే. ఆంధ్రాకు వచ్చిన దాంట్లో తిరిగి కోస్తాకు 367 టిఎంసిలు, సీమకు 145 టిఎంసిలు అనుకున్నారు. ఇది కేవలం ఒప్పందం మాత్రమే. తీర్పు కాదు. నిజానికి కృష్ణా బేసిన్ తక్కువ ఉన్నప్పటికీ, ఆంధ్రాకు ఎక్కువ నీటి కేటాయింపు రావడానికి ముందు చెప్పుకున్న ట్లు కృష్ణా డెల్టా తన హక్కు ఉపయోగించడం, దిగువన ఉండడం వంటివి కారణాలు. సహజ జల సూత్రాల్లో బేసిన్ నిబంధన ప్రామాణికంగా తీసుకుంటే తెలంగాణకు, మొదటి వినియోగదారు నిబంధ న ప్రామాణికంగా తీసుకుంటే ప్రత్యక్షంగా కోస్తా, పరోక్షంగా రాయలసీమకు మేలు. కాబట్టి బేసిన్ రూల్‌కోసం తెలంగాణ, ఫస్ట్ యూజర్ రూల్ కోసం ఆంధ్రప్రదేశ్ పట్టుబడుతుంటాయి. విభజన చట్టం కింద కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డును ఏర్పాటు చేశారు. విడిపోయిన తరువాత నీటి పంపకాలు కూడా కొత్తగా చేపట్టాలని తెలంగాణ కోరింది.

అంతకుముందు తీర్పుల సమయంలో తెలంగాణలేదు కాబట్టి, తెలంగాణ వాదన వినేలా కొత్త ట్రిబ్యునల్ కావాలని తెలంగాణ వాదించింది. అందుకోసం కొత్తగా ట్రిబ్యునల్ వేయాలని 2014లో కేంద్రానికి లేఖ రాసింది తెలంగాణ ప్రభుత్వం. లేదంటే ఉన్న ట్రిబ్యునలే కొత్తగా నీటి పంపకాలు చేయాలని డిమాండ్ చేసింది. కేంద్రం మాత్రం పాత ట్రిబ్యునల్‌ని మరో రెండేళ్లు పొడిగించింది. అసలు మొత్తం కేటాయింపులు కొత్తగా చేయాలని తెలంగాణ పట్టుపడుతోంది. దీనికి కర్ణాటక, మహారాష్ట్ర ఒప్పుకోలేదు. విడిపోయిన రెండు రాష్ట్రాలూ వాటి మధ్య పంపకాల సంగతి చూసుకోవాలి తప్ప, మొత్తం నది నీళ్లు తిరిగి పంపకాలు చేయడం కుదరదన్న మహారాష్ట్ర, కర్ణాటక, ఇదే విషయాన్ని బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ ముందు చెప్పాయి. ట్రిబ్యునళ్ల తీర్పులున్నా తెలంగాణ, ఏపి ల మధ్య జలవివాదాలు కొనసాగుతూనే ఉన్నాయి.

అంతేకాదు, ఇక్కడ పంచాయితీ నడుస్తుండగానే, ఆ పాత తీర్పునే వెంటనే ప్రమరించాలని కోరుతూ ఆ రెండు రాష్ట్రాలు కోర్టుకు వెళ్లాయి.

రాష్ట్రం విడిపోయిన తరువాత కొత్త ప్రభుత్వాలు రెండూ పోలవరం, కాళేశ్వరం సహా అనేక ప్రాజెక్టులపై శ్రద్ధ పెట్టాయి. ఆ క్రమంలోనే రాయలసీమకు నీరు అందించేందుకు, గోదావరి–కృష్ణా నదులను అనుసంధానం చేసేలా రెండు రాష్ట్రాలూ ప్రణాళిక వేసుకున్నాయి.

వాటిలో పట్టిసీమ ఒక్కటే పూర్తయి డెల్టా రైతులకు మేలు చేసింది. రాయలసీమ, ప్రకాశం, తెలంగాణలోని పలు జిల్లాల కోసం తలపెట్టిన పలు ఎత్తిపోతల పథకాలు వివిధ దశల్లో ఉన్నాయి. వీటి అనుమతుల విషయంలోనూ గొడవలున్నాయి. పరస్పరం కేసులు వేసుకున్నాయి.

ఆ క్రమంలో 2020వ సంవత్సరంలో పోతిరెడ్డిపాడు సామర్థ్యాన్ని రెట్టింపు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భావించింది. అది కాకుండా రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పేరుతో మరో ఎత్తిపోతలకు ప్రతిపాదించింది ఆంధ్ర. ఇటు తెలంగాణ కూడా పాలమూరు–రంగారెడ్డి వంటి కొన్ని లిఫ్టులకు ప్రతిపాదించింది. మరికొన్ని లిఫ్టుల సామర్థ్యం పెంచే పని ప్రారంభించింది. ఇద్దరి ఉద్దేశమూ శ్రీశైలం నీటిని తమ ప్రాంతాలకు తీసుకెళ్లడం. కానీ ఎవరు ఎంత ఎప్పుడు తీసుకెళ్తారు అన్న ప్రశ్న, తమకు మిగలకుండా తీసుకుపోతారన్న అనుమానం ఇద్దరిదీ. అయితే కృష్ణా జలాలకు సంబంధించి 2015, 2016లలో జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశాల్లో తెలంగాణకు 299 టిఎంసిల కేటాయింపులకు అంగీకరిస్తూ కెసిఆర్ ముఖ్యమంత్రి హోదాలో సంతకం పెట్టిన కారణంగా రాష్ట్రానికి ఆయన మరణ శాసనం రాసినట్టు కేంద్ర జలవనరుల మంత్రిత్వ శాఖ మాజీ సలహాదారు వెదిరె శ్రీరామ్ అంటున్నారు.

అసెంబ్లీలో చర్చకు రావాలని కెసిఆర్ కు ముఖ్యమంత్రి సవాల్ చేశారు. అసెంబ్లీ సమావేశాలకు కెసిఆర్ రావాలని, నీళ్లు, నిధులు, నియామకాలు, ప్రభుత్వ పథకాలపై ఎన్నిరోజులైనా చర్చిద్దామని అన్నారు. కాళేశ్వరం పాపాలే కాకుండా, కృష్ణా, గోదావరి జలాలపై అయినా, టెలిఫోన్ ట్యాపింగ్‌పై అయినా చర్చిద్దామన్నారు. సభకు ప్రతిపక్ష నేతగా రావాలని, అర్థవంతమైన చర్చ చేద్దామని పిలుపు నిచ్చారు.

# రైతును కాపాడుకుందాం

భారతదేశ వ్యవసాయదారులు ‘అప్పుల్లోనే పుట్టి అప్పుల్లోనే చనిపోతున్నారు’. స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు దాటినా... పైన ఉన్న నానుడిలో ఎలాంటి మార్పు లేకపోగా నిత్యం రైతుల ఆత్మహత్యల పరంపర కొనసాగుతూనే ఉంది. దేశంలో ప్రతి అర్ధగంటకు ఒక రైతు ఆత్మహత్య చేసుకుంటున్నారు. ప్రతిరోజు 2000–3000 మంది రైతులు వ్యవసాయాన్ని వదిలిపెట్టి ఇతర రంగాలకు వలస పోతున్నారంటే అతిశయోక్తి కాదు.

మిగతా 40 శాతం మంది రైతులు వ్యవసాయంలో లాభాలు వచ్చి వ్యవసాయం చేయడం లేదు. కేవలం వారు ఉన్న ఊరును, తల్లిదండ్రులను, భార్యా పిల్లలను వదిలిపెట్టి ఇంకో ప్రాంతానికి వెళ్లలేక ఇంకొక పని చేయలేక బిక్కుబిక్కు మంటూ చావు బతుకుల మధ్య వ్యవసాయాన్ని కొనసాగిస్తున్నారు. మనదేశంలో మానవ సంపద పుష్కలంగా ఉంది. భిన్నమైన వాతావరణ పరిస్థితులు అన్ని రకాల పంటలు, పండే నేలలు, పండించే రైతులు ఉన్నారు. ఆదాయ భద్రతలేని ఏకైక రంగం వ్యవసాయం. పంటలు సరిగా పండక, పండిన పంటలకు గిట్టుబాటు ధర లేక కనీసం పెట్టిన పెట్టుబడులు రాక కుటుంబాన్ని పోషించుకోలేక తెచ్చిన అప్పులను తీర్చే మార్గం లేక వారి పంట పొలాల్లోనే ఉరికొయ్యలను ముద్దాడుతున్న రైతుల శవాలను ప్రతిరోజు వివిధ దినపత్రికలలో చూస్తూనే ఉన్నాం.

ఇప్పటికీ భారతదేశ ప్రజలు సుమారు 63శాతం మంది వ్యవసాయ రంగంపై ఆధారపడి వ్యవసాయ ప్రాధాన్యత గల దేశంగా పేరుగాంచిన మనదేశంలో రైతులు ఆత్మహత్య చేసుకోవడం చాలా దురదృష్టకరం. ఇప్పటికీ వ్యవసాయ విధానం లేకపోవడం, వ్యవసా యం పట్ల ప్రభుత్వాలకు ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనం. 2004వ సంవత్సరంలో ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త డా.స్వామినాథన్ కమిషన్ వేసి వారు ఇచ్చిన రిపోర్టు ఇప్పటివరకు అమలుకు నోచుకోలేదు. మోదీ గారు మొదటిసారి ప్రధానమంత్రి కావడానికి ముందు జరిగిన చాలా సభలలో మేము అధికారంలోకి రాగానే స్వామినాథన్ కమిషన్ రిపోర్టను అమలు చేస్తామని అన్నారు. కానీ తర్వాత స్వామినాథన్ రిపోర్టు మాటనే తీయడం లేదు. పైగా శ్రీ నరేంద్ర మోదీ 2018లో వివిధ సభలలో మాట్లాడు తూ 2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు చేస్తానని అన్నాడు. రెట్టింపు మాట పక్కన పెడితే కనీసం రైతుకు గిట్టుబాటు ధరను ఇవ్వలేని స్థితిలో ప్రభుత్వా లు ఉన్నా యి.

ప్రధాన మంత్రులు, ముఖ్యమంత్రులు, ప్రభుత్వాలు మారినంత మాత్రాన రైతుల ఆత్మహత్యలు ఆగవు. వ్యవసాయ విధానం లేకపోవడంతో దేశ వ్యాప్తంగా 1995 నుండి 2023 వరకు 4,08,326 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నట్లు NCRB నివేదికలు తెలుపుతున్నాయి.

పంటలు కాపాడుకోవాలనే ఉద్దేశంతో అప్పులు చేసి బోర్లువేస్తూ బోర్లలో నీళ్లు రాక పంటలు ఎండిపోవడంతో పాటు, కనీసం పెట్టుబడులురాక అప్పులపాలై రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఇప్పుడు రైతాంగానికి బతుకు పైన భరోసా ఇచ్చి రైతాంగాన్ని కాపాడుకోవాల్సిన ప్రధాన బాధ్యత ప్రభుత్వం పైన ఉంది.

నీటి కరువు ఒక వైపు, అప్పులు, కుటుంబ పోషణభారం, ప్రకృతి వైపరీత్యాలు మరోవైపు, నకిలీ విత్తనాలు ప్రపంచీకరణలో భాగంగా జీవన విధానం, రైతుని ఎప్పుడు కుంగదీస్తూనే ఉండడంతో భవిష్యత్తు మీద భరోసా లేక అప్పుల బాధతో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.

వాస్తవానికి వ్యవసాయం సంక్షోభంలో లేదు. రైతు మాత్రమే సంక్షోభంలోకి నెట్టబడి ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఒకవేళ వ్యవసాయం సంక్షోభం లో ఉంటే విత్తన కంపెనీలు, పెస్టిసైడ్స్ కంపెనీలు ఎరువుల కంపెనీలు, రైస్, ఆయిల్ మిల్లులు కరెంట్ మోటర్లు తయారు చేస్తున్న కంపెనీలు లాంటివి నష్టాల బాటలో నడవాలి కానీ ఎండనక వాననక ఆరుగాలం కష్టపడిన నిజమైన రైతు మాత్రమే ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.

కార్పొరేట్ కంపెనీలు, ప్రభుత్వాలు కలిసి రైతుల దగ్గర నుంచి క్రమంగా విత్తనాలను దూరంచేసి, పెస్టిసైడ్స్ ఫర్టిలైజర్ అలవాటుచేసి పశుసంపదం దూరంచేసి వీటన్నిటితో ఒకప్పుడు వ్యవసాయం స్వయం సమృద్ధి సాధించి ఉండేది. కానీ నేడు వ్యవసాయరంగం మొత్తం కార్పొరేట్ కంపెనీల పైన ఆధారపడి వ్యవసాయం నడుస్తుందంటే అతిశయోక్తి కాదు.

ఈ మధ్యనే మనం ఇండిగో విమాన సర్వీసులను రద్దు చేస్తే ఎంత సమస్య తలెత్తిందో ప్రత్యక్షంగా చూసాం. అదేవిధంగా విత్తన కంపెనీలు విత్తనాలు సరఫరాను నిలిపివేస్తే వ్యవసాయరంగం ఎట్లా ఉంటుందో మనం ఊహించుకోవచ్చు! కాబట్టి ఇప్పటికైనా కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాల కోసం కాకుండా రైతుల, దేశ ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకొని వ్యవసాయ విధానం తయారుచేసి రైతులను కాపాడుకోవాలి.

**రైతులను కాపాడుకోవడం కోసం కొన్ని సూచనలు:** 1) పంటలన్నింటికీ లాభసాటి ధర నివ్వాలి. పంటలన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. 2)వాస్తవ సాగుదారులకు పెట్టుబడి సహాయం అందించాలి. 3)అన్ని పంటలకు బీమా సౌకర్యం కల్పించాలి 4) రైతులకు, రైతు కూలీలకు బీమా సౌకర్యం కల్పించాలి. 5) పురుగు మందులు, రసాయనిక ఎరువులు లేని వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి. 6) చిన్న యంత్ర పరికరాలను అందుబాటులోకి తేవాలి. 7) ప్రత్యేక వ్యవసాయ బడ్జెట్లో ప్రవేశపెట్టాలి. 8) విద్య, వైద్యం ప్రభుత్వ ఆధీనంలోనే ఉండాలి. 9) అసెంబ్లీ పార్లమెంట్లలో వ్యవసాయ రంగం పైన ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలి. 10) స్వామినాథన్ కమిషన్ రిపోర్టును అమలు చేయాలి.ఇప్పటికైనా ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు GO .Ms.NO.194 ప్రకారం ప్రతి కుటుంబానికి ఆరు లక్షల రూపాయలు ఇచ్చి రైతు కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వానికి రైతాం గం విజ్ఞప్తి చేస్తుంది. రైతులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వం, ప్రతి రాజకీయ పార్టీ, పౌర సమాజం పైన ఉంది. రైతన్నలారా ఎవరు కూడా అధైర్యపడి ఆత్మహత్యలు చేసుకోవద్దు. మీకు అండగా తెలంగాణ సమాజం ఉంది.

**పులి రాజు,** 9908383567.

# కోట్లాదిమందికి ప్రాణదాత లూయీ పాశ్చర్

నిజజీవిత సమస్యల సుడిగుండాలలో చిక్కుకున్నప్పుడు మానవ మేధస్సులో ఆ సమస్యల కు తగిన పరిష్కారం కనుగొనేందుకు వీలైన ఆలోచనలు, ఆవిష్కరణలు ఉద్భవిస్తుంటాయి. ఆ ఆవిష్కరణలు కొంతమంది మహామహుల విశేష కృషి వల్ల వెలుగులోకి వచ్చి అదే సమస్యలతో బాధపడుతున్న ఎంతోమంది జీవితాలలో ఆ గ్రహణం వీడి వెలుగులు నింపడానికి దోహదపడుతుంది. అటువంటి సమస్యల పరిష్కారానికి సరికొత్త మార్గాలను అన్వేషించిన ఆదర్శ మూర్తులలో లూయీ పాశ్చర్ ఒకరు. ఆంత్రాక్స్, రేబిస్ తదితర వ్యాధులకు మందులను కనిపెట్టడంలో మూలపురుషుడై అవిరళ కృషి సల్పిన సూక్ష్మ జీవ శాస్త్రవేత్త లూయీ పాశ్చర్.

లూయీ పాశ్చర్ 1822 సంవత్సరం డిసెంబరు 27న ఫ్రాన్స్ లోని డోల్ గ్రామంలో జన్మించాడు. నెపోలియన్ సైన్యంలో పనిచేసి న తండ్రి జీన్ పాశ్చర్ తోలు వ్యాపారం చేసి జీవించేవారు. పాశ్చర్ పాఠశాలకు వెళ్ళకుం డా కొంతవరకు విద్యావంతుడయ్యాడు. చిత్రలేఖనంలో మంచి ప్రతిభ కనపరిచేవాడు. తల్లిదండ్రులతో పాటు ఇరుగుపొరుగు వారివి, హితులవి బొమ్మలు పెయింట్ చేశాడు. చాలా చిత్రాలు ఇప్పటికీ పాశ్చర్ మ్యూజియంలో భద్రపరచబడ్డాయి. గణితం, భౌతిక, రసాయనిక శాస్త్రాలంటే ఇష్టమున్న పాశ్చర్ ఉపాధ్యాయ జీవితాన్ని గడపాలనుకొనేవాడు. పదహారేళ్ల వయసులో కాలేజీ చదువు కోసం పారిస్‌లో అడుగుపెట్టాడు. డాక్టరేట్ పూర్తి చేసి 1848లో స్ట్రాస్ బర్గ్ విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియమితులయ్యారు. యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్‌కు వారి అమ్మాయి మేరీ లారెంట్‌ను పెళ్ళిచేసుకుంటానని అనుమతి కోసం లేఖ రాశాడు. వివాహానంతరం వీరిద్దరూ ఆదర్శదంపతుల్లాగా జీవించారు. వీరికి అయిదుగురు పిల్లలు పుట్టినా ముగ్గురు మరణించారు; టైఫాయిడ్ వల్ల ఇద్దరు, మశూచి వల్ల ఒకర్ని పోగొట్టుకొన్నాడు.



పాశ్చర్ అంగారక పదార్థాలు ధ్రువిత కాంతిని ఏ విధంగా విచలనం చెందిస్తాయో అధ్యయనం చేసి ‘స్టీరియో కెమిస్ట్రీ’ అనే కొత్త రసాయన శాస్త్రాన్ని రూపొందించారు. తరువాత తన పరిశోధనలను పులియబెట్టడం (ఫెర్మెంటేషన్)వంటి అంశాలపై కొనసాగించి సూక్ష్మ క్రిములపై అనాదిగా ఉన్న భావాలను ఖండించి కొత్త సిద్ధాంతాలను రూపొందించాడు. ద్రాక్షసారా (వైన్) వల్ల వచ్చే వ్యాధులు, నిల్వచేసే పద్ధతులు, వెనిగర్ తయారీ మొదలైన అనేక అంశాలపై కొత్త విషయాలు కనుగొన్నాడు.

కోళ్ళకు వచ్చే కలరా వంటి పారుడు వ్యాధి పై పరిశోధన జరిపి వ్యాధికారకాలైన సూక్ష్మ జీవులను బలహీనపరచి ఇతర కోళ్ళ కు ఎక్కించి వాటిలో రోగనిరోధక శక్తి పెరిగి న తర్వాత కాలంలో రోగం రాకుండా రక్షిస్తుందని నిర్ణయానికి వచ్చారు. పిచ్చికుక్క కాటు వల్ల వచ్చే రేబీస్ వ్యాధికి మందు కనిపెట్టడం లూయిస్ పాశ్చర్ సాధించిన శాస్త్ర విజయాలలో ప్రధానాంశం. ఈ మందుతో చాలా మందిని ప్రాణాపాయం నుండి కాపాడాడు. 1870 దశాబ్దంలో టీకా పద్ధతులను పశువులలో వచ్చే ఆంత్రాక్స్ వ్యాధిమీద ప్రయోగించాడు. ఈ విధంగా కొన్ని ప్రాణాంతక వ్యాధులకు సూక్ష్మ క్రిములు కారణాలన్న విషయాన్ని నిరూపించాడు. అందువలన మనుషులు గాని, జంతువులు గాని అంటు వ్యాధితో మరణిస్తే ఆ శవాన్ని దహనం చేయాలని చెప్పారు. భూమి లో పాతిపెడితే శరీరంలోని క్రిములు బయటకు వచ్చి వాటివలన ఇతరులకు ఆ వ్యాధులు వ్యాపిస్తాయని వివరించారు. పాలను శుద్ధిచేసే విధానాన్ని కనుగొన్నాడు. ఈ విధానాన్ని పాశ్చరైజేషన్ అని పిలుస్తారు. పాశ్చర్ సూక్ష్మ జీవశాస్త్రంలో అత్యుత్తమ గౌరవమని పిలిచే లీవెన్ హాక్ బహుమతిని 1895లో పొందారు.

నేడు లక్షలాది అంటు రోగాలను తగ్గించేందుకు మన ఆధునిక వైద్యశాస్త్ర రంగంలో మందులున్నాయి. దానికి ఎంతో కృషి సల్పి న, నేటికీ నిత్యం శ్రమిస్తున్న ఎంతో మంది సూక్ష్మ జీవశాస్త్రవేత్తలకు లూయీ పాశ్చర్ వంటి వారు ఏర్పరిచిన శాస్త్రీయ విధానమే పెద్ద రహదారి. ఐదేళ్ల క్రితం మొత్తం ప్రపంచాన్ని గడగడలాడించిన మనందరినీ ఇంటికే పరిమితం చేసిన కొవిడ్ మహమ్మారి అంటువ్యాధికి వాక్సిన్ కనుగొని ఎంతోమంది ప్రాణాలను కాపాడటం వెనుక ఎందరో శాస్త్రవేత్తల కృషి ఉంది అనడంలో అతిశయోక్తి లేదు. ఎందుకంటే మనిషి మేధస్సును మించి న మరో గొప్ప ఆయుధం లేదు. ఆ మేధస్సుతోనే లూయీ పాశ్చర్ వంటి వారు మహానుభావులయ్యారు. పాశ్చర్ తన పూర్తి జీవితాన్ని శాస్త్ర పరిశోధనలకు అంకితం చేశారు. సంకల్ప బలం, నిరంతర శ్రమతో విజయాన్ని సాధించవచ్చని పాశ్చర్ విశ్వాసం. రెండుసార్లు గుండెపోటు, తరువాత పక్షవాతం వచ్చినా జీవితాంతం పరిశోధన చేసి మానవాళికి వెలకట్టలేని సేవ చేసిన పాశ్చర్ 1895 సెప్టెంబరు 28న పరమపదించారు. లూయిస్ పాశ్చర్ జ్ఞాపకార్థంగా ఆయన మరణించిన రోజు సెప్టెంబరు 28న ప్రపంచ రేబీస్ దినోత్సవం జరుపుకుంటారు.

**(డిసెంబర్ 27 లూయీ పాశ్చర్ జయంతి)**

సుధాకర్. ఎవి
(STUTS); 9000674747

## బోసి గ్రామానికి నిధులు మంజూరు

**ప్రజాపక్షం/తానూర్ :** మండలంలోని బోసి గ్రామానికి మొత్తం 22 లక్షల నిధులు మంజూరైనట్లు మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి శుక్రవారం తెలిపారు. స్కూల్ పహారి గోడ నిర్మాణానికి 10 లక్షలు,అంగన్వాడీ భవన నిర్మాణానికి 12లక్షలు,మంజూరైన నిధులు ప్రోసిడింగ్ పత్రాలను అయన నివాసంలో బోసి గ్రామస్తులకు అయన అందజేశారు.నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు, మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి కు బోసి గ్రామస్తులు మాజీ జడ్పీటీసీ ఉత్తం బాలేరావ్, ప్రసాద్, నాగప్ప, నాగేష్, శంకర్, శ్రీనివాస్, బుచ్చన్న, రాజన్న,హనుమన్లు,వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## ఘనంగా సిపిఐ శతాబ్ది ఉత్సవాలు



**ప్రజాపక్షం/నేరడిగొండ (బోథ్) :** భారత కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (సిపిఐ) 100వ శతాబ్ది ఉత్సవాలను బోథ్ ఎఐటియుసి భవనంలో సిపిఐ సీనియర్ నాయకులు బి.గోవర్ధన్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు,కర్షకులు,పేదలు,శ్రామికవర్గాల హక్కుల కోసం సిపిఐ వందేళ్లుగా పోరాటం చేస్తూ వస్తోందని, ప్రజాస్వామ్య విలువలను కాపాడడంలో సిపిఐ కీలకపాత్ర పోషించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకుడు సిరిపురం దాస్, కార్తీక్, మున్సిఫ్, కవిత, మల్లవ్వ పాల్గొని సిపిఐ శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేశారు.

# ప్రజాపక్ష పోరాటాలే సిపిఐ బలం

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్



**ప్రజాపక్షం/రామకృష్ణపూర్ :** శతాబ్ది కాలంగా చేస్తున్న ప్రజాపక్ష పోరాటాలే భారత కమ్యూనిస్టు పార్టీకి (సిపిఐ) బలమని రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్ అన్నారు. సిపిఐ వందేళ్ళ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రామకృష్ణపూర్ పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు మిట్టపల్లి శ్రీనివాస్ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలవేన శంకర్ మాట్లాడుతూ 1925 డిసెంబర్ 26న కాన్పూర్‌లో ఆవిర్భవించిన సిపిఐ నేటివరకు కార్మికులు, కర్షకులు, విద్యార్థులు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం నిరంతర పోరాటాలు సాగిస్తోందన్నారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడి అనేక మంది కమ్యూనిస్టులు వీర మరణం పొందారని గుర్తుచేశారు. తెలంగాణ సాయుధ పోరాటంలో నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడి పదివేల గ్రామాలను విముక్తి చేశారని, పది లక్షల ఎకరాల భూమిని నిరుపేదలకు పంపిణీ చేయడం చారిత్రక ఘట్టమని తెలిపారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలోనూ పార్టీ కీలక పాత్ర పోషించి రాష్ట్ర సాధనకు కృషి చేసిందన్నారు. వందేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా జనవరి 18న ఖమ్మంలో నిర్వహించే శతజయంతి ముగింపు ఉత్సవాల భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు లింగయ్య, గోపి, వనం సత్యనారాయణ, నక్క వెంకటస్వామి, మిట్టపల్లి పౌలు, రాజేశం, దేవానంద్, రాములు, సాంబయ్య, కొమురయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### కమ్యూనిస్టులు లేని పోరాటాలు లేవు

**మంచిర్యాల :** కమ్యూనిస్టులు లేని పోరాటాలు లేవని, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాడేది ఎర్రజెండానేనని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్ అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) 101వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లా కార్యాలయం వద్ద జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ముఖ్య అతిథిగా హాజరైన కలవేన శంకర్ పార్టీ శ్రేణులతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1925 డిసెంబర్ 26న కాన్పూర్‌లో ఆవిర్భవించిన కమ్యూనిస్టు పార్టీ నేటివరకు అనేక ఉద్యమాలు, పోరాటాలు నిర్వహించిందన్నారు. చట్టసభల్లో కార్మికులు, కర్షకులు, విద్యార్థులకు రక్షణ కల్పించే అనేక చట్టాలు చేసిన ఘనత సిపిఐకి ఉందన్నారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడి అనేకమంది కమ్యూనిస్టులు వీరమరణం పొందారని గుర్తుచేశారు. తెలంగాణ సాయుధ పోరాటంలో నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడి మూడు వేల గ్రామాలను విముక్తి చేసి, పది లక్షల ఎకరాల భూమిని నిరుపేదలకు పంచిన చరిత్ర సిపిఐ సొంతమన్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలోనూ పార్టీ కీలకపాత్ర పోషించిందన్నారు. పార్టీ వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా జనవరి 18న ఖమ్మంలో నిర్వహించే శతజయంతి ముగింపు ఉత్సవాల భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సభకు కమ్యూనిస్టు నాయకులు, కార్యకర్తలు, కార్మికులు, కర్షకులు, మేధావులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు రేగుంట చంద్రశేఖర్, జోగుల మల్లయ్య, ఇప్పకాయల లింగయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు ఖలీందర్ అలీఖాన్, లింగం రవి, జిల్లా సమితి సభ్యులు మిట్టపల్లి పౌలు, మిర్యాల రాజేశ్వరరావు, పూజారి రామన్న, వనం సత్యనారాయణ, చాడా మహేందర్ రెడ్డి, నాయకులు బియ్యాల రాజేశం, మారపల్లి రవి, మెరుగు రాజేశం, గుమాస మల్లేష్, మామిడాల సత్యనారాయణ, సిరికొండ రాయమల్లు తదితరులు పాల్గొన్నారు.



## రహదారి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

**ప్రజాపక్షం/రెబ్బన :** గంగాపూర్ గ్రామపంచాయతీ 10వ వార్డులో నెలకొన్న రహదారి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వార్డు సభ్యులు ఇగురపు వినోద సంజీవ్ కోరారు. వార్డులోని ప్రధాన సమస్యను ప్రజలు తమ దృష్టికి తీసుకురాగా సర్పంచ్ వొలువోజు వెంకటేశం చారి, ఉప సర్పంచ్ లేండుగురే ఇస్తారిని సమస్య ఉన్న ప్రాంతానికి తీసుకెళ్లి పరిస్థితిని వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రధాన దారిగుండా సగానికి పైగా రైతులు, ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారని తెలిపారు. ఎండాకాలం, చలికాలంలో కూడా ఈ రహదారి వర్షాకాలాన్ని తలపించే విధంగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీవాసులు, రైతుల కష్టాలను స్వయంగా పరిశీలించి సమస్యకు శాశ్వత పరిష్కారం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో 9వ వార్డు సభ్యులు ఇగురపు వెంకటి, గ్రామ నాయకులు గుర్లే చంద్రయ్య, రాచర్ల రాజమౌళి, గుర్లే కిషన్, గుర్లె భాస్కర్, మోర్లే గణేష్, సంఘం ఎల్లయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## స్కంద షష్ఠి పవిత్ర పర్వదినాలతో ఆధ్యాత్మిక చైతన్యం

### ఎమ్మెల్యే ధన్‌పాల్

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** స్కంద షష్ఠి పవిత్ర పర్వదినాలు సమాజంలో అధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందిస్తుందనిఅర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్య నారాయణ అన్నా రు. శుక్రవారం స్కంద షష్ఠి మహాపర్వదినాన్ని పురస్కరించుకుని నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహించిన కళ్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధలతో అత్యంత వైభవోపేతంగా జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్కంద షష్ఠి వంటి పవిత్ర పర్వదినాలు సమాజంలో అధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించటమే కాకుండా శాంతి ఐక్యతను ప్రోత్సహిస్తాయన్నారు. ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆరోగ్య ఐశ్వర్యాలతో ఉండాలన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో లక్ష్మీ నారాయణ, ప్రభాకర్, కృష్ణ, పవన్ పాల్గొన్నారు.



## హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో డా.తుమ్మల దేవరావ్‌కు సన్మానం

**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** ప్రతి ఏటా రాష్ట్ర రాజధాని హైదరాబాదులో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే పుస్తక ప్రదర్శనలో భాగంగా నిర్మల్ జిల్లాకు చెందిన ప్రముఖ కవి చరిత్ర పరిశోధకుడు డా.తుమ్మల దేవరావ్ కవి సమ్మేళనంలో పాల్గొనవలసిందిగా ఆహ్వానం మేరకు కవి సమ్మేళనంలో పాల్గొని ''చీకటి వెలుతురు అనే కవితను చదివి ప్రేక్షకులను అలరింపజేరు. ఈ సందర్భంగా హైదరాబాద్ బుక్ ఫెస్టివల్ చైర్మన్ ప్రముఖకవి యాకూబ్,ప్రముఖ రచయిత నను మాస స్వామి, తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి బాల చారి తదితరులు శాలువా, మెమంటోతో ఘనంగా సత్కరించారు. హైదరాబాద్ 38వ బుక్ ఫెస్టివల్‌లో నిర్మల్ కవులు డాక్టర్ చక్రధారి,డాక్టర్ దామెర రాములు,పత్తి శివప్రసాద్,నేరెళ్ల హనుమంతు,డాక్టర్ బి.వెంకట్,అబ్బడి రాజేశ్వర్రెడ్డి,శ్రీనివాస్ రెడ్డి,కుమ్మరి నాగారామ్ తదితరులు అభినందించారు.

## ఘనంగా కామ్రేడ్ కేవల్ కిషన్ ముదిరాజ్ వర్ధంతి

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ జిల్లా కేంద్రంలో ముదిరాజ్ జిల్లా కోరు కమిటీ ఆధ్వర్యంలో కామ్రేడ్ కేవలం కిషన్ ముదిరాజు వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. నాయకులుమాట్లాడుతూ.. మెదక్ జిల్లా చేగుంట మండలం పోలంపల్లి గ్రామంలో కేవల్ కిషన్ ముదిరాజ్ జాతర కార్యక్రమం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంచే అధికారికంగా గుర్తించబడిన జాతర అని అన్నారు. కేవల్ కిషన్ ముదిరాజ్ పేదల కోసం పరితపించిన తెలంగాణ పోరాటాల యోధుడని దోపిడిదారుల గుండెల్లో దడ పుట్టించి, రైతు కూలీల కోసం ప్రాణత్యాగం చేసిన ప్రజల మనిషి అని,విద్యార్థి దశ నుంచే ప్రజా ఉద్యమాలలో పాల్గొని పేదల అభ్యున్నతి కోసం భూస్వామ్యానికి వ్యతిరేకంగా పోరాడాడని గుర్తు చేశారు. అనంతరం నాయకులు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా కోర్ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

## పక్కా ప్రణాళికతో ప్రభుత్వ వైద్య సేవలు

**ప్రజాపక్షం/టేక్మాల్ :** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ శుక్రవారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు తప్పనిసరిగా అందుబాటులో ఉండి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఆయన ఆదేశించారు. ఆరోగ్య కేంద్రం లోని ఒపి, ఐపి, ఫార్మసీ, ల్యాబ్, టాయిలెట్లు తదితర విభాగాలను కలెక్టర్ పరిశీలించారు. సీజనల్ వ్యాధుల కేసులు, వాటి నివారణకు అవసరమైన మందులు సరిపడా అందుబాటులో ఉన్నాయా లేదా అన్న విషయంపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయనే అంశంపై కూడా వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ప్రజలందరికీ అందుబాటులో ప్రభుత్వ వైద్య సేవలు అందించేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని తెలిపారు.

## ప్రభుత్వ ఉద్యోగులు రాజకీయాలు మానుకోవాలి

**ప్రజాపక్షం/బాల్కొండ :** ప్రభుత్వ ఉద్యోగులు రాజకీయాలు మానుకోవాలని మండల బిఆర్ఎస్ అధ్యక్షుడు బద్దం ప్రవీన్‌రెడ్డి సూచించారు. ఆయన శుక్రవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని కొన్ని గ్రామాల్లో ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తూ గ్రామాల్లో రాజకీయాలు నడుపుతున్నారని ఆరోపించారు. వారితో గ్రామాల్లో కక్షలు పెరిగి అభివృద్ధి పనులు జరగడంలేదన్నారు. రాజకీయాల్లో పాల్గొంటున్న ప్రభుత్వ ఉద్యోగులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని ప్రవీన్‌రెడ్డి తెలిపారు.

## సిరాల ప్రాజెక్ట్ ద్వారా 600 ఎకరాలకు సాగునీరు అందిస్తాం

### సాగు నీటి విడుదల కార్యక్రమంలో ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్



**ప్రజాపక్షం/భైంసా :** సిరాల ప్రాజెక్టు ద్వారా 600 ఎకరాలకు సాగునీరు అందిచడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్ అన్నారు. శుక్రవారం సిరాల ప్రాజెక్ట్ కాలువ ద్వారా రబీ పంటకు సాగునీటిని విడుదల చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. భారీ వర్షాలకు గత రెండు సంవత్సరాల క్రితం ప్రాజెక్టు కట్ట తెగిపోతే, ప్రభుత్వాన్ని ఒప్పించి ప్రాజెక్టు పునర్నిర్మాణానికి 12కోట్ల రూపాయల నిధులు వెచ్చించి పూర్తిచేయడం జరిగిందన్నారు. నిధులు మంజూరు చేసిన సాగు నీటి శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు చెప్పారు. నిధులు మంజూరైనా ఏడాది కాలంలోనే కాంట్రాక్టర్ పనులు పూర్తి చేయడాన్ని ఆయన అభినందించారు. నియోజకవర్గంలో రైతాంగానికి సాగునీరు అందించడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని,ఈ క్రమంలోనే చెరువుల నిర్మాణానికి,లిఫ్ట్ ల పునఃప్రారంభానికి కోట్లాది రూపాయల నిధులు వెచ్చించడం జరిగిందని చెప్పారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఇ.ఇ. అనిల్ కుమార్ సిరాల, ఇలేగాం, దేగాం గ్రామ సర్పంచ్‌లు కదం సునంద, సిరం రాజమణి శ్రీనివాస్,సిరం సుష్మరెడ్డి, చింతల్‌బోరి సర్పంచ్ పండిత్ రావ్ పటేల్, మాజీ ఎంపిపి రజాక్, సీనియర్ నాయకులు సోలంకి భీంరావ్,నాయకులు కాంబ్లె సుభాష్, చంద్రకాంత్ పటేల్,బాలాజీ పటేల్,వెంకట్ రావ్ పటేల్ ఉపసర్పంచ్‌లు శివాజీ,శ్రీనివాస్,గ్రామ పెద్దలు బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## క్రీడలతో శారీరక దృఢత్వం, ఆత్మస్థైర్యం

### అడిషనల్ ఎస్‌పి చిత్తరంజన్



**ప్రజాపక్షం/కాగజ్‌నగర్ :** యువత బాక్సింగ్ వంటి క్రీడలను అభ్యసించడం ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఆత్మస్థైర్యం పెరుగుతుందని కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా అడిషనల్ ఎస్‌పి చిత్తరంజన్ అన్నారు. బాక్సింగ్ డే సందర్భంగా శుక్రవారం కాగజ్ నగర్ పట్టణంలోని పొట్టి శ్రీరాములు చౌరస్తా సమీపంలో ఉన్న నేషనల్ ఫిట్నెస్ జిమ్, శివ బాక్సింగ్ క్లబ్‌ను ఆయన సందర్శించారు. క్లబ్ మెంటార్ కానిస్టేబుల్ నివాస్ ఆహ్వానం మేరకు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా హనుమాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం క్లబ్ లోని బాక్సర్లతో పరిచయం చేసుకుని వారి సాధనను పరిశీలించారు. బాక్సింగ్ పోటీలను ప్రారంభించి క్రీడాకారులను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు క్రమశిక్షణ, సహనం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. యువత తమ ప్రతిభను ప్రదర్శించి రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తూ బాక్సింగ్ క్రీడను ఉచితంగా నేర్పిస్తున్న నివాస్ ఎందరికో ఆదర్శమని ప్రశంసించారు. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు యువతను సన్నద్ధం చేయడం గొప్ప విషయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో క్లబ్ నిర్వాహకులు, కోచ్‌లు, బాక్సర్లు, మాజీ సర్వీస్ మాన్ రామకాంత్ యాదవ్, జాకిర్, జిమ్ ట్రైనర్ శ్రవణ్ గౌడ్, కోచ్ వినయ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన సర్పంచ్‌లకు ఘన సన్మానం

**ప్రజాపక్షం/భైంసా :** భైంసా హరియాలి ఫంక్షన్ హాల్‌లో నూతనంగా ఎన్నికయినా సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్‌లకు సన్మాన కార్యక్రమం జరుగుతుంది. ఈ కార్యక్రమానికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు బోధన్ శాసనసభ్యుడు సుదర్శన్‌రెడ్డి తెలంగాణ రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తహెర్ బిన్ అందన్ నిర్మల్ జిల్లా డిసిసి ప్రెసిడెంట్ ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ,మాజీ ఎంపిలు,మాజీ ఎమ్మెల్యేలు ముఖ్య అతిథులుగా వస్తున్నారు. ఈ కార్యక్రమనికి సర్పంచ్‌లు,ఉప సర్పంచ్‌లు,వార్డు సభ్యులు ప్రభుత్వ పద అధికారులు కాంగ్రెస్ పార్టీ పద అధికారులు, కార్యకర్తలు సీనియర్ కాంగ్రెస్ కార్యకర్తలు, గ్రామ కమిటీ కాంగ్రెస్ అధ్యక్షులు తప్పకుండ రావాలని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనీ మనస్ఫూర్తిగా విజ్ఞప్తి చేస్తున్నారు.

## కాంగ్రెస్ పార్టీలో మోర్తాడ్ మాజీ సర్పంచ్ చేరిక

**ప్రజాపక్షం/మోర్తాడ్ :** నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకుడు, మోర్తాడ్ మాజీ సర్పంచి మహమ్మద్ అజీజ్, బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్ పార్టీలోకి ఆహ్వానించారు. గత కొంతకాలంగా బిఆర్ఎస్ పార్టీలో కీలకంగా ఉన్న అజీస్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న జనరంజక అభివృద్ధి పనులను చూసి ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిసింది. అజీజ్ కాంగ్రెస్ పార్టీలో చేరడంతో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని స్థానిక ప్రజలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మోర్తాడ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముత్యాల రాములు, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి గిర్ మాజీ గోపి, కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ బూత్ పురం మహిపాల్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గ్రామప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేయాలి

### ఎమ్మెల్యే భూపతిరెడ్డి

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** గ్రామప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేయాలని రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. శుక్రవారం నగరంలోని కంఠేశ్వర్ బైపాస్ వద్ద ఉన్న రూరల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సుద్దులం గ్రామంలో గ్రామపంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన నూతన వార్డు మెంబర్లను ఎమ్మెల్యే శాలువ కప్పి సన్మానించి మాట్లాడారు. గెలుపొందిన వార్డు మెంబర్లు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని, ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలోనే అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజల ఆదరణ పొందిందన్నారు. ప్రజలు కాంగ్రెస్ వైపే చూస్తున్నారన్నారు. కార్యక్రమంలో నర్సాగౌడ్, బాలకృష్ణ, అనిల్, నరేష్, లక్ష్మీ, మనోజ్‌రెడ్డి, హారిక, సంతోష్‌రెడ్డి, భూషణ్‌రెడ్డి, లక్ష్మి ఉన్నారు.

## గాండ్ల లింగంకు ఘన సన్మానం

**ప్రజాపక్షం/పిట్లం :** కామారెడ్డి జిల్లా గాండ్ల తేలికుల సంఘ కోశాధికారి గాండ్ల లింగం సర్పంచు ఎన్నికల్లో పిట్లం గ్రామపంచాయతీ వార్డు సభ్యునిగా ఘన విజయం సాధించిన సందర్భంగా గాండ్ల తేలికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఇందల్‌వాయి కిషన్ ఘనంగా సన్మానించారు. శుక్రవారం పిట్లంలోని లింగం స్వగృహంలో కలిసి శాలువా, పుష్పగుచ్ఛంతో సన్మానించి తమ శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా పిట్లం మండలంలో గాండ్ల తేలికుల సంఘ అభ్యున్నతికి మరింత కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గాండ్ల తేలికుల సంఘం రాష్ట్ర కార్యదర్శి గాండ్ల సత్యం, గంజివార్ భూమేష్, యువజన అధ్యక్షుడు రఘు, పిట్లం అధ్యక్షుడు రాము, సభ్యులు గాండ్ల గంగాధర్, ప్రభాకర్, శేఖర్, ఉపాధ్యక్షుడు సాయిలు తదితరులు పాల్గొన్నారు.

## బోధన్ పట్టణంలో సిపిఐ జెండా ఆవిష్కరణ

**ప్రజాపక్షం/బోధన్ :** సిపిఐ పార్టీ శత జయంతి ఉత్సవాల కార్యక్రమంలో భాగంగా పార్టీ స్థాపించి వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బోధన్ పట్టణంలో పార్టీ నాయకులు నాగళ్ల హనుమంత్ రావు ఆధ్వర్యంలో సిపిఐ పార్టీ జెండా ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజలకు అండగా ఉన్న పార్టీ ఎర్రజెండా సిపిఐ అని అన్నారు. వందేళ్ల కమ్యూనిస్టు ఉద్యమ పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తూ బోధన్ పట్టణంలో జెండా ఆవిష్కరించడం జరిగిందని పేర్కొన్నారు. దేశంలో భూ సమస్యలపైన, కుల సమస్యలపైన కార్మికుల హక్కుల కోసం ప్రజల హక్కుల కోసం పోరాడే పార్టీ కమ్యూనిస్టు పార్టీ అని, పేద ప్రజల సమస్యలు తీర్చడానికి సిపిఐ ఎప్పుడూ అండగా ఉంటుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఎస్.రాధాక్రిష్టన్, రఘుపతి, క్రిష్ణ, ఎం.శ్రీనివాస్, మండి ఖురేషి, సలీం, షేక్ ఆసిఫ్, జాదవ్, మోహన్, గైని రాములు, శంకర్, సాయిలు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.




## ప్రభువు ఆశీస్సులు అందరిపై ఉండాలి

### రాష్ట్ర కార్మికగనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి

**ప్రజాపక్షం/కాసిపేట :** ప్రపంచ శాంతిని చాటిన ఏసుప్రభువు ఆశీస్సులు అందరిపై ఉండాలని రాష్ట్ర కార్మిక గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి ఆకాంక్షించారు. బెల్లంపల్లి మండలం సోమగూడెంలోని కల్వరి మినిస్ట్రీస్‌లో గురువారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి వివేక్ వెంకటస్వామి, మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ హాజరై కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అందరి మధ్య క్రిస్మస్ వేడుకల్లో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. తన చిన్ననాటి నుండే క్రిస్టియన్ స్నేహితులతో కలిసి వేడుకలు జరుపుకునేవాళ్ళమని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పేద ప్రజల పట్ల దయ, కరుణ, సాయం చేసే గుణం కలిగి ఉండాలన్నారు. కాకా కుటుంబానికి అండగా ఉంటూ తమను గెలిపిస్తున్న ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కల్వరి మినిస్ట్రీస్ పాస్టర్ ప్రవీణ్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు బోధనలు, ఆయన చూపిన మార్గం ప్రతి ఒక్కరికి అనుసరణీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ రెడ్డి, టిపిసిసి ఒబిసి కోఆర్డినేటర్ ముత్తినేని రవికుమార్, మాజీ జెడ్పిటిసి కారుకూరి రాంచందర్ పాల్గొన్నారు.



## రాష్ట్ర స్థాయి చెస్ విజేతకు ఘన సన్మానం

### జాన్కంపేట్ విద్యార్థి శివకుమార్ ప్రతిభ

**ప్రజాపక్షం/ఎడపల్లి :** జనగామ జిల్లా కేంద్రంలో ఇటీవల నిర్వహించిన సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల 11వ రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో బోధన్ గురుకుల పాఠశాల విద్యార్థి ఎం.శివకుమార్ అద్భుత ప్రతిభ కనబరిచి అండర్ 14 విభాగంలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఎడపల్లి మండలం జాన్కంపేట్ గ్రామానికి చెందిన శివకుమార్ ఈ ఘనత సాధించడంపై స్థానికంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. సొంత గ్రామానికి చెందిన విద్యార్థి రాష్ట్ర స్థాయిలో విజేతగా నిలిచిన విషయం తెలుసుకున్న ప్రముఖ సామాజిక కార్యకర్త వీరపత్ని రాజు, శుక్రవారం శివ కుమార్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన శివ కుమార్‌కు శాలువా కప్పి రూ.2వేలు నగదు పురస్కారంతో పాటు క్రీడపై మరింత ఆసక్తిని పెంచుకునేలా చెక్కతో చేసిన చెస్ బోర్డును బహుమతిగా అందచేశారు. ఈ సందర్భంగా వీరపత్ని రాజు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత విద్యార్థులు క్రీడల్లో రాణించడం సంతోషదాయకమని కొనియాడారు. శివకుమార్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి, అభ్యసిస్తున్న పాఠశాలకు, పుట్టిన గ్రామానికి మంచి పేరు తీసుకరావాలని ఆకాంక్షించారు. ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రొత్సహించే ఉద్దేశ్యంతోనే తన వంతుగా ఈ చిన్న సాయం అందించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ అభినందన కార్యక్రమంలో బిల్లా గంగాధర్, 12వ వార్డు సభ్యులు రఘుపతి ఆనంద్, కుర్తే లింగం, సాద సంజీవ్, గ్రామస్తులు శివకుమార్‌ను అభినందించారు.

## నాగం వర్షిత్‌రెడ్డిని సస్పెండ్ చేయాలి

### యాదవ జెఏసి రాష్ట్ర అధ్యక్షుడు సిద్ధి రమేష్ యాదవ్

**ప్రజాపక్షం/చెన్నూర్/మంచిర్యాల :** నల్గొండ జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డిని పార్టీ నుండి తక్షణమే సస్పెండ్ చేయాలని యాదవ జెఏసి రాష్ట్ర అధ్యక్షులు సిద్ధి రమేష్ యాదవ్ డిమాండ్ చేశారు. నల్గొండ జిల్లా బిజెపి కార్యాలయంలో పిల్లి రామరాజు యాదవ్ పై నాగం వర్షిత్ రెడ్డి చేసిన దాడిని యాదవ ఐక్య కార్యాచరణ కమిటీ (యాదవ జెఏసి) తరఫున తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. హిందువుల పార్టీగా చెప్పుకునే బిజెపి కార్యాలయంలోనే యాదవులపై దాడి జరగడం వారి సంస్కారానికి నిదర్శనమని ప్రశ్నించారు. బిసి వర్గాలకు చెందిన నాయకులపై దాడులు చేయడం నల్గొండ జిల్లాలో కొనసాగుతున్న రెడ్డి ఆధిపత్య అహంకారానికి స్పష్టమైన ప్రతిరూపమని విమర్శించారు. ఈ ఘటనకు బాధ్యత వహిస్తూ వర్షిత్ రెడ్డిపై, దాడిలో పాల్గొన్న ఇతరులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. యాదవులపై జరుగుతున్న దౌర్జన్యాలను ఇకపై సహించేది లేదని హెచ్చరించారు. బాధితుడు పిల్లి రామరాజు యాదవ్ కు యాదవ జేఏసి పూర్తి మద్దతుగా నిలుస్తుందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## పేద ప్రజల కోసం వందేళ్లుగా పోరాడుతున్న సిపిఐ

### సిపిఐ మండల కార్యదర్శి గోవిందుల రవి

**ప్రజాపక్షం/హుజురాబాద్:** బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటం చేసి దేశ స్వాతంత్ర్య కోసం అనేక మంది పోరాట వీరులను త్యాగం చేసిన సిపిఐ 100 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న ఏకైక పార్టీ సిపిఐ అని, పేద ప్రజల పక్షాన నిరంతరం ఉద్యమాలు చేస్తున్న పార్టీ సిపిఐ అని హుజురాబాద్ మండల కార్యదర్శి గోవిందుల రవి అన్నారు. హుజురాబాద్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పార్టీ జెండాను మండల కార్యదర్శి గోవిందుల రవి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ కార్మికుల, రైతుల, విద్యార్థి, యువజనుల పక్షాన మహోత్తరమైన పోరాటాలు చేసి అనేక విజయాలు సాధించిన చరిత్ర సిపిఐకి ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాంగోపాల్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు రామారపు వెంకటేష్, జిల్లా సహాయ కార్యదర్శి కేశబోయిన రాము యాదవ్, రమేష్, మల్లేష్, మల్లయ్య, రాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

## రామగుండంలో పారా గ్లైడింగ్ ప్రారంభం



**ప్రజాపక్షం/గోదావరిఖని:** రామగుండం పట్టణంలోని బిపిఎల్ పవర్ ప్రాజెక్టు మైదానంలో పారా గ్లైడింగ్ రైడింగ్‌ను రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్, ఆయన సతిమణి మనాలి ఠాకూర్‌లు శుక్రవారం ప్రారంభించారు. ఆసక్తి ఉన్న వారికి శిక్షణ ఇవ్వడంలో భాగంగా ఈ రైడింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించడం పట్ల శిక్షకుడు, స్థానిక రైల్వే ఉద్యోగైన అర్జున్‌ను ఎమ్మెల్యే అభినందించారు.రక్షణ, భద్రత చర్యలు పాటిస్తూ శిక్షణ పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

## సిపిఐ శతజయంతి వేడుకలు




**ప్రజాపక్షం/చిగురుమామిడి:** సిపిఐ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని సుందరగిరి, చిగురుమామిడి, ముల్కనూరు, రేకొండ, కొండాపూర్, రామంచ, ముదిమాణిక్యం, పీచుపల్లి, బొమ్మనపల్లి, నవాబుపేట్ వివిధ గ్రామాల్లో సిపిఐ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. మాజీ జడ్పిటిసి సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అందె స్వామి మాట్లాడుతూ పేద ప్రజల పక్షాన కొట్లాడేది ఎర్రజెండా ఒక్కటేనని, త్వరలో జరగబోయే ఎంపిటిసి, జడ్పిటిసి ఎన్నికల్లో సిపిఐ పార్టీకి మండలంలో పూర్వవైభవం తీసుకువచ్చేందుకు కృషి చేయాలన్నారు. పేదలకు సంక్షేమ పథకాలు అందేంతవరకు సిపిఐ పేద ప్రజల పక్షాన ఉంటుందన్నారు. అనంతరం ఇందుర్తి గ్రామంలో సిపిఐ జెండాను సర్పంచ్ అభ్యర్థి కూన లెనిన్ ఎగురవేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు అందె చిన్నస్వామి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కాంతాల శ్రీనివాస్‌రెడ్డి, గ్రామశాఖ కార్యదర్శి ఉస్మాన్‌పాషా, గ్రామశాఖ సహాయ కార్యదర్శులు బందెల శ్రీనివాస్‌రెడ్డి, గ్రామ కార్యదర్శి ఉస్మాన్‌పాషా, గ్రామ సహాయ కార్యదర్శులు బందెల శ్రీనివాస్, అందె సంపత్‌కుమార్, నాయకులు అందె దుర్గయ్య, ఎనగందుల రాజు, మావురపు రాజు, తాళ్లపెల్లి చిన్నచంద్రయ్య, గద్దె కొమురయ్య, నరేష్, మాజీ వార్డు సభ్యులు సీనియర్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఇందుర్తిలో ఇటీవల గెలుపొందిన వార్డు సభ్యులను ఉపసర్పంచ్‌ను శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించి స్వీట్లు పంపిణీ చేశారు.

## పంటలకు లాభసాటి ధర చెల్లించాలి



**ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్:** రైతు పంటలకు లాభసాటి ధర రాని కారణంగా చాలామంది రైతులు వ్యవసాయాన్ని వదిలి ఇతర వృత్తులు, జీవనోపాధి కొరకు వెళ్తున్నారని కిసాన్ జాగరణ్ అధ్యక్షుడు పి.సుగుణాకర్ రావు అన్నారు. మూడు రోజుల పాటు కొనసాగిన కిసాన్ రైతు మేళా ముగింపులో ఆయన మాట్లాడారు. దేశంలో ఇప్పటికీ వ్యవసాయం ఆధారంగా దాదాపు 70 శాతం మంది తమ జీవనాన్ని కొనసాగిస్తున్నారన్నారు. 50 శాతానికి పైగా జనాభాకు ప్రత్యేక ఉపాధి కల్పిస్తున్న ఈ రంగాన్ని విస్మరించడం దురదృష్టకరమన్నారు. దేశంలో 70 శాతం మంది ప్రజల ఆర్థిక జీవన ప్రమాణాలు పెరిగితేనే వికసిత్ భారత్ సాధ్యమని తెలిపారు. దేశానికి స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు పూర్తయినప్పటికీ రైతు ఆత్మహత్య చేసుకోవడం చాలా విచారకరమని, ఇలాంటి అనేక సమస్యలకు పరిష్కారం రైతు తాను పండించిన పంటకు లాభదాయకమైన ధర వచ్చేలా చట్టబద్ధత ఏర్పరచాల్సిన అవసరముందన్నారు. రైతాంగ సమస్యల పరిష్కారానికి ఆచరణాత్మక ప్రణాళికలు రచించాలని, అందుకు రైతు పంటకు లాభసాటి ధర పొందటమే మార్గమన్నారు. ప్రముఖ రైతు నాయకుడు నల్లమల్ల వెంకటేశ్వర్‌రావు, రైతు నాయకుడు నరసింహ నాయుడు, కెవికె శాస్త్రవేత్త వేణుగోపాల్, రైతు నాయకులు మల్లారెడ్డి పలు సూచనలు చేశారు. రైతు పంటలకు లాభసాటి ధర పొందుటకై చట్టబద్ధత, రైతు పంట నష్టపోతే ఆ పరిణామంలో పరిహారం, ప్రతి గ్రామంలో ఒక ఎఫ్ఈవో ఏర్పాటు చేసి రైతులను సంఘటితపరచడం, వృద్ధాప్య రైతులకు ఎలాంటి షరతలు లేకుండా పెన్షన్ చెల్లించడం వంటి తీర్మాణాలను రైతులు ఆమోదించారు.

## మంత్రి పొన్నంకు ముక్కోటి ఏకాదశి కార్యక్రమానికి ఆహ్వానం



**ప్రజాపక్షం/ఇల్లందకుంట:** ఇల్లందకుంట శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానం చైర్మన్ ఇంగిలె రామారావు ఆధ్వర్యంలో హుస్నాబాద్‌లో క్యాంపు ఆఫీసులో రాష్ట్ర రవాణా బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానం మెమొంటోను బహుకరించారు. ఈ సందర్భంగా ఈ నెల 30న వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఇల్లందకుంట మండలంలోని శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానంలో జరిగే ముక్కోటి ఏకాదశి కార్యక్రమానికి రావాల్సిందిగా ఆహ్వాన పత్రికను అందించారు. తిరుపతి దేవస్థానం లడ్డును అందించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు గొడిసెల పరమేష్, గోలి కిరణ్, ఎడ్ల కిషన్‌రెడ్డితో పాటు తదితరులున్నారు.

## ఉరివేసుకొని ఐదు నెలల గర్భిణి మృతి



**ప్రజాపక్షం/ముత్తారం :** ఉరివేసుకొని ఐదు నెలల ఆత్మహత్య చేసుకున్న ఘటన పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం అడవి శ్రీరాంపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం తెలిపిన వివరాల ప్రకారం ముత్తారం మండలం అడవి శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన అంజలి (21) వివాహం మల్హర్ మండలం మల్లంపల్లి గ్రామానికి చెందిన బండి వెంకటేష్ తో 8 నెలల క్రితం వివాహం జరిగింది. పెళ్లి సమయంలో కట్నం కానుకలతో పాటు తమ కూతుర్ని అత్తింట్లో దింపి వచ్చారు. కొద్ది నెలల పాటు వారి దాంపత్య జీవితం అన్యోన్యంగా సాగింది. ఆ తర్వాత భర్త, అత్తింటి వారి వేధింపులు మొదలయ్యాయి. ఆశించిన వరకట్నం తేలేదంటూ సూటిపోటి మాటలతో ఆమెను శారీరకంగా, మానసికంగా వేదించసాగారు. ఐదు నెలల గర్బిని అయినందున అంజలి నెల రోజుల కిందట తన అడవిశ్రీరాంపూర్ గ్రామానికివచ్చి తన తల్లిదండ్రులతో పుట్టింట్లో ఉంటుంది. భర్త అత్తమామల వేధింపులను భరించలేక అంజలి గురువారం రాత్రి అందరూ నిద్రిస్తున్న సమయంలో ఇంటి పై కప్పుకు ఉరి వేసుకుని ప్రాణాలు విడిచింది. తమ కూతురు ఆత్మహత్యకు అత్తింటి వారి వేదింపులే కారణమని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఘటనా స్థలానికి గోదావరిఖని ఏసీపీ మడత రమేష్ తో పాటు మంథని సీఐ రాజు, ముత్తారం ఎస్ఐ రవికుమార్ చేరుకొని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నామన్నారు.

# విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలి

### జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి చెకుముఖి సంబరాలు ప్రారంభం

### కలెక్టర్ పమేలా సత్పతి





**ప్రజాపక్షం/కరీంనగర్:** విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలని, అందుకు చెకుముకి సంబరాలు, సైన్స్ ఫెయిర్ దోహదం చేస్తాయని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పద్మ నగర్ లోని పారమిత హెరిటేజ్ స్కూల్లో ఈనెల 26 నుండి 28 వరకు రాష్ట్రస్థాయి చెకుముకి సంబరాలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఈ సంబరాల ప్రారంభోత్సవానికి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థులు మూఢనమ్మకాలకు దూరంగా ఉంటూ ప్రతి అంశాన్ని శాస్త్రీయ కోణంలో ఆలోచించాలని అన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను సృజనాత్మకతను వెలికి తీసేందుకు సైన్స్ ఫెయిర్, చెకుముకి సంబరాలు వంటివి ఉపకరిస్తాయని తెలిపారు. విద్యార్థుల్లో ప్రజల్లో మూఢనమ్మకాలను చెరిపివేస్తూ సైన్స్ కోణంలో అవగాహన కల్పిస్తున్న జనవిజ్ఞాన వేదిక సేవలు అభినందనీయమని తెలిపారు. నిత్యజీవితంలో రోజువారి కార్యక్రమాన్నీ సైన్స్ తో ముడి పడి ఉన్నాయని అన్నారు. విద్యార్థులు ముఖ్యంగా గణితం, సైన్స్ సబ్జెక్టులపై దృష్టి పెట్టాలని అన్నారు. నేర్చుకున్న అంశాలను నిత్యజీవితంలో సైన్స్ కోణంలో పరిశీలించాలని సూచించారు. ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తూ తోటి విద్యార్థులతో చర్చించాలని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు థియరీ పాఠాలతోపాటు ప్రాక్టికల్స్ పై దృష్టి సాధించాలని అన్నారు. అన్ని పాఠశాలల్లో సైన్స్ ప్రయోగశాలలను తప్పనిసరిగా ఉపయోగించాలని అన్నారు. మోడల్ స్కూల్ పిల్లలు సైన్స్ పట్ల చూపుతున్న ఉత్సాహం అభినందనీయమని, వారి ప్రయోగాలు, ప్రదర్శనలు కట్టుకుంటున్నాయని తెలిపారు. పాఠశాలల్లో వివిధ అంశాల్లో విద్యార్థుల అభివృద్ధి కోసం ఏర్పాటుచేసిన క్లబ్స్ సభ్యులు మరింత మంది విద్యార్థులు రాణించేలా తీర్చిదిద్దాలని సూచించారు. తాను గతంలో సైంటిస్ట్‌గా పని చేసిన అనుకోని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జెవివి రాష్ట్ర అధ్యక్షులు చెలిమెల రాజేశ్వర్, జెవివి రాష్ట్ర కార్యదర్శి పి.మనీంద్రం, సీసీఎంబి మాజీ డైరెక్టర్ మోహన్ రావు, నిమ్స్ మాజీ డైరెక్టర్ ప్రసాదరావు, పారమిత విద్యాసంస్థల చైర్మన్ ప్రసాదరావు, చక్రపాణి, నెహ్రూ యువ కేంద్ర కోఆర్డినేటర్ రాంబాబు, జిల్లా సైన్స్ అధికారి జయపాల్ రెడ్డి, విద్యాశాఖ కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి, జెవివి వైస్ ప్రెసిడెంట్ లక్ష్మారెడ్డి, జెవివి నాయకులు ఆనంద్ కుమార్, వెంకటేశ్వరరావు, రామచంద్రయ్య, శ్రీకాంత్, వరప్రసాద్, అందే సత్యం, సిహెచ్ రామరాజు, ఆర్ వెంకటేశ్వరరావు, ఎన్ దేవేందర్, గంగారాం, శంకర్, రమేష్, అశోక్ పాల్గొన్నారు.

## అణగరిన వర్గాల భూమి, విముక్తి కోసం సిపిఐ సాయిధ పోరాటం



**ప్రజాపక్షం/జగిత్యాల రూరల్ :** భారత కమ్యూనిస్టు పార్టీ (1925) డిసెంబర్ 26 కర్నూల్లో ఆవిర్భవించబడింది. నేటికి 100 సంవత్సరాలు అయిన దిగ్విజయంగా పూర్తి అయిన సందర్భంగా సిపిఐ జగిత్యాల పట్టణ కార్యదర్శి మాడిశెట్టి కిరణ్ నాయకత్వంలో జగిత్యాల పట్టణంలో శుక్రవారం రోజున టవర్ సర్కిల్ గడియారం వద్ద మారిశెట్టి కిరణ్ జెండా ఆవిష్కరణ చేయడం జరిగింది. శతాబ్ది ఉత్సవాలలో సిపిఐ నాయకులు వెన్న మహేష్ హాజరయ్యారు. జగిత్యాల పట్టణ కార్యదర్శి మాడిశెట్టి కిరణ్ మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ రోజు ఉత్సవాలు జరుపుకోవడం జరిగిందని తెలిపారు. సిపిఐ పార్టీ 1969 లో భూమి కోసం విముక్తి కోసం సాయిధ పోరాటం చేసిందని ప్రజలకు, కార్మికులకు, కార్షకులకు, వ్యవసాయ కార్మికులకు తమ సమస్యల మీద ఎన్నో పోరాటాలు చేసిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ధర్మన్న, శ్రీ గాధ దేవదాసు, ఎద్దండి భూమయ్య, పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజారాజ్యం కోసం పోరాడేదే సిపిఐ

**ప్రజాపక్షం/హుస్నాబాద్:** ఘనమైన చరిత్ర గల పార్టీ సిపిఐ పార్టీకి 100ఏళ్లు ప్రజల కోసం పోరాడే పార్టీ సిపిఐ మాత్రమే నని ప్రజారాజ్యం కోసం పోరాడుదామని సిపిఐ జిల్లా సహాయకార్యదర్శి గడిపె మల్లేశ పిలుపు నిచ్చారు. శుక్ర వారం అయన హుస్నాబాద్ పట్టణంలోని సిపిఐ భవన్‌లో సిపిఐ 100 ఏళ్ల వార్షికోత్సవం సందర్బంగా ఎర్ర జెండ ఏగుర వేశారు. ఈ సందర్బంగా మల్లేశం మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ 1925 డిసెంబర్ 26 తేదిన ఉత్తర ప్రదేశ్‌లోని కాన్పూర్‌లో అవిర్భంవించిందని దేశ స్వాతంత్రం కోసం తీర్మాణం చేసిన మొదటి పార్టీ సిపిఐ పార్టని అన్నారు. ఎంతో మంది సిపిఐ నాయకులపై కేసులు పెట్టి జైల్లలో నిర్బందించి మరి కొంత మంది ని ఉరిశిక్షలు విదించారని అన్నారు. మీర తెలంగాణ సాయుధ పోరాటంలో 4500 మంది యువ కమ్యూనిష్టులు తమ ప్రాణాలను అర్పించి తెలంగానను నిజాం పాలన నుండి విముక్తి చేశారని అన్నారు. ఈ కార్యాక్రమంలో సిపిఐ నియోజకవర్గ కన్వినర్ జాగీరు సత్యానారయణ, రాజ్‌కుమార్, జంగ విజయ, మల్లారెడ్డి, పట్టల ప్రసాదు, మౌటం బాలయ్య, పాపిరెడ్డి, రఘుపతి, భాస్కరచారి, కిష్టయ్య, మల్లయ్య, అక్బర్, రాజవ్వ, సాయి నవీన్, రజిత తదితరులు పాల్గోన్నారు.

## ప్రజా వ్యతిరేక పార్టీపై పోరాటానికి సిద్ధం కావాలి: సిపిఐ



**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** కేంద్ర ప్రభుత్వం కార్పొరేటు సంస్థల మెప్పు పొందేందుకు ప్రజా సంక్షేమ పథకాలను రద్దు చేసేందుకు కుట్రలు చేస్తుందని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బట్టు దయానందరెడ్డి, జిల్లా కార్యదర్శి మందపవన్ విమర్శించారు. జాతీపిత మహాత్మగాంధీ పేరు కొనసాగుతున్న జాతీయ ఉపాధి హామీ పథకం పేరు మార్పుతో పథకం రద్దుకు బిజెపి కుట్రలో భాగమేనని వారు ఆరోపించారు. సిపిఐ శతాబ్ది ఉత్సవాలలో భాగంగా శుక్రవారం జగదేవ్‌పూర్ మండల పరిధిలోని తిగుల్ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో సదస్సు ఏర్పాటు చేశారు. ముందుగా భగత్ సింగ్ విగ్రహానికి పూలమాల వేసి నివాలర్పించి పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పార్టీ అమరుల సంతాప తీర్మాణం ప్రవేశ పెట్టి వారి త్యాగాలను స్మరిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. గ్రామ కమిటీ అధ్యక్షులు బిక్షపతి ఆధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ సదస్సులో వారు మాట్లాడుతూ నాటి స్వాతంత్ర్య పోరాటం నుండి నేటి సాయుద రైతాంగ,కార్మిక, కర్షక, తెలంగాణ పోరాటం వరకు సిపిఐ కిలక పాత్ర పోషించిందని గుర్తు జేశారు. ప్రజాస్వామ్య విలువలతో పాటు ఆభ్యుదయ భావాలతో సామాజిక న్యాయం కోసం సిపిఐ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. సమస్యలు పరిష్కారమయ్యేవరకు సిపిఐ ప్రజా ఉద్యమాలు చేస్తుందని పేర్కొన్నారు. కేంద్రంలో మతం ముసుగులో అధికారం చేలాయిస్తున్న బిజెపి ప్రజా సమస్యలపై ప్రశిస్తున్న ప్రజాస్వామిక వాదులపై అర్బన్ నక్సలైట్ల ముద్ర వేస్తూ బ్రయబ్రాంతులకు గురిచేస్తుందని ఆరోపించారు. సమస్యలపై పోరాటం చేసేందుకు కేంద్రం పన్నే కుట్రలకు వ్యతిరేకంగా సిపిఐ పార్టీ పోరాడుతుందని హేచ్చరించారు. కార్పొరేట్ సంస్థలకు దేశాన్ని తాకట్టు పెట్టేందుకు కేంద్రం ప్రయత్నిస్తుందని దినిని ప్రజాస్వాయ్య వాదులు ఖండించాలని పేర్కొన్నారు. అనంతరం సినీయర్ పార్టీ నాకులను సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బాలకృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ భానుప్రకాశ్‌రావు,నాయకులు మహేందర్‌రెడ్డి, భిక్షపతి, మాల్లరెడ్డి, నర్సింహారెడ్డి, రాంరెడ్డి,బాల్‌రెడ్డి, అంజిరెడ్డి, పార్టీ కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## పేదలకు ఇండ్లను నిర్మించుకోవడానికి అవకాశం

### వాగు నుండి ఇసుక పర్మిషన్లు ఇవ్వాలి

### ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు డామాడ్



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల:** ప్రజాపాలనలో పేదలకు ఇందిరమ్మ ఇండ్లను నిర్మించుకోవడానికి అవకాశం ఇచ్చారు కానీ ఊరి పక్కనే ఉన్న వాగులో నుండి ఇసుక పర్మిషన్లు ఇవ్వడం లేదని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం సిరిసిల్ల ఏఐటియుసి కార్మిక భవనంలో సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. గతంలో ఒక ట్రిప్పుకు 300 వున్న ఇసుక ఈ రోజు 3 వేలు అయిందని మండిపడ్డారు. ఇసుక పెనుబారంగా మారడం చేత నిర్మాణాలు చేపట్టాలంటేనే బెంబేలెత్తుతున్నారన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు నిర్మాణాలు పెనుబారంగా మారద్దు అంటే ప్రతి రోజు ఇసుక, మొరంకు అనుమతి ఇవ్వాలని గతంలో వేములవాడ, సిరిసిల్ల, తంగళ్లపెల్లి తహసిల్దార్లకు, ఆర్డీవోలకు, జిల్లా కలెక్టర్ కు విజ్ఞాపనలు చేసిన స్పందన లేదన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పోటాపోటీగా ఇసుకపై నియంత్రణ లేకుండా ధరలు పెంచాయని, చిన్న చిన్న సందుల్లో ఎడ్ల బండ్ల పై ఇసుక జారవేస్తూ గత 20 సంవత్సరాలుగా నిరుపేద వారు ఉపాది పొందేవారని కానీ కొందరు అధికారులు ఎడ్ల బండ్లకు సైతం అనుమతులు లేవని అతిక్రమిస్తే కేసులు వేస్తామని బెదిరంపులకు గురిచేయడం సరైనది కాదన్నారు. పేదవారికి ఎడ్ల బండ్లతో ఇసుక రవాణాకు అనుమతి ఇవ్వాలన్నారు. మెటీరియల్ లేక పనులు జరగక భవన నిర్మాణ కార్మికులకు సైతం ఉపాధి లేకుండా పోయిందన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, ఇతర నిర్మానాలు పూర్తయేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమం లో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు అజ్జ వేణు, వడ్డెపెల్లి లక్ష్మణ్, మామిడాల బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## రైతులు అభివృద్ధికి తోడ్పడాలి


### ఎమ్మెల్యే చింతకుంట విజయరమణా రావు



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** బీటీ రోడ్డు నిర్మాణంలో కాంట్రాక్టర్లు నాణ్యత పాటించాలని, రైతులు కాంగ్రెస్ ప్రభుత్వానికి సహకరించి అభివృద్ధికి తోడ్పడాలని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. శుక్రవారం రోజునపెద్దపల్లి మండలం తుర్కలమద్దికుంట గ్రామంలోని హనుమాన్ విగ్రహం నుండి సమ్మక్క సారలమ్మ గద్దెల వరకు నూతనంగా నిర్మాణం చేపట్టనున్న బిటి రోడ్డుకు 99 లక్షల రూపాయల నిధులతో స్థానిక నాయకులతో కలిసి శంకుస్థాపన చేసిన అనంతరం తుర్కలమద్దికుంట గ్రామ నాయకులు ఎమ్మెల్యే విజయ రమణ రావును శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలతో తుర్కల మద్దికుంట హనుమాన్ విగ్రహం నుండి సమ్మక్క సారలమ్మ దేవాలయాలకు వెళ్ళే రోడ్లను నిర్మించడం జరుగుతుంది అన్నారు. 99 లక్షల రూపాయల నిధులతో రెండు గ్రామంలో నూతన బిటి రోడ్లకు శంకుస్థాపన చేసుకోవడం జరిగిందని పేర్కొన్నారు. రైతులకు ప్రజలకు ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు కల్పిస్తున్నామని నియోజకవర్గంలో అన్ని ప్రాంతాలకు అలాగే టెలెండు ప్రాంతమైన కాల్వ శ్రీరాంపూర్ వరకు కాలువ నీరు రైతులకు ఇబ్బంది లేకుండా అందిస్తున్నామని రైతులు పండించిన పంట అనంతరం కొయ్య కాలును కాల్చ వద్దని తద్వారా భూమిలో ఉన్న సారవంతం కోల్పోతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచు ఉపసర్పంచ్ వార్డు సభ్యులు, యూత్ కాంగ్రెస్ నాయకులు మరియు మాజీ ప్రజా ప్రతినిధులు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు పలు గ్రామాల ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల పక్షాన నిలబడి: పోరాడుతున్న ఏకైక పార్టీ సిపిఐ

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** సిపిఐ పార్టీ నూట ఒకటో వార్షికోత్సవం సందర్భంగా సీపీఐ రామగుండం నగర సమితి ఆధ్వర్యంలో శుక్రవారం గోదావరిఖని భాస్కరరావు భవన్లో ఖని చౌరస్తాలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గౌతమ్ గోవర్ధన్, గోసిక మోహన్ లు సిపిఐ పతకాలను ఆవిష్కరించడం జరిగింది. దానికి ముందు రామగుండం నగరంలోని వివిధ డివిజన్ లోని ఎల్బీనగర్ లో మార్కపురి సూర్య, జవహర్ నగర్ లో సిర్ర మైసయ్య ,జనగామ లో తొడుపునూరి రమేష్ కుమార్, లెనిన్ నగర్ లో తాళ్ళపెల్లి మల్లయ్య ,పవర్ హౌస్ కాలనీ లో మాటిటి శంకర్, రామ్ నగర్ లో చిందం భూమయ్య లు సిపిఐ పతకాలను ఆవిష్కరించడం జరిగింది. అనంతరం స్థానిక భాస్కరరావు భవన్లో , చౌరస్తాలో జరిగిన ఆవిర్భావ వేడుకల్లో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గౌతం గోవర్ధన్, గోసిక మోహన్, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం లు మాట్లాడుతూ దేశంలో 1925 డిసెంబర్ 26 న సిపిఐ పార్టీ కాన్పూర్ లో ఆవిర్భవించినప్పటి నుండి నేటి వరకు అనేక ఉద్యమాలు, పోరాటాలు నిర్వహించి చట్టసభల్లో కార్మికుల, కర్షకుల,మహిళల కు విద్యార్థులకు అనేక చట్టాలు చేసినటువంటి ఘనత సిపిఐ పార్టీకి ఉందని వారన్నారు. అదేవిధంగా దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాటం నిర్వహించి అనేకమంది కమ్యూనిష్టులు వీరమరణం పొందడం జరిగిందని, తెలంగాణ సాయుధ పోరాటంలో నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించి మూడు వేల గ్రామాలను విముక్తి చేసి, పది లక్షల ఎకరాల భూమిని నిరుపేదలకు పంచడం జరిగిందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తాళ్లపల్లి మల్లయ్య, మడికొండ ఓదెమ్మ, మార్కపురి సూర్య, కన్నం లక్ష్మి నారాయణ, జిల్లా కౌన్సిల్ సభ్యులు మాటేటి శంకర్, తోడుపునూరి రమేష్ కుమార్, రంగు శ్రీను,రేణిగుంట్ల ప్రీతం, ఆసాల రమ, శనిగరపు చంద్రశేఖర్ , పార్టీ ప్రజాసంఘాల నాయకులు సంకే అశోక్, శనిగరపు తిరుమల ఆసాల నవీన్, సాదుల శివ, చిందం భూమయ్య, గౌడిశల నరేష్, సిరిసిల్ల మల్లేష్, రాణవేణి సుధీర్ కుమార్, ఎర్రల రాజయ్య, గంగారపు చంద్రయ్య, పడాల కనకరాజు, జగన్ , పుట్ట సాంబయ్య, రేణుక, భాగ్య మున్నీ, జెరిపోతుల దేవయ్య , పోతరాజు నాగరాజు తదితరులు పాల్గొన్నారు. ప్రజానాట్యమండలి కళాకారులు కన్నం లక్ష్మీ నారాయణ ఎజ్జ రాజయ్య డప్పు రాజు లు పాడిన విప్లవ గేయాలు ఆలపించి, పార్టీ శ్రేణులను చైతన్యపరిచారు.



## చిన్నకోడూరు రైల్వేస్టేషన్ పనులు ప్రారంభించాలి

### మాజీ మంత్రి హరీష్‌రావు



**ప్రజాపక్షం/సిద్దిపేట:** రైల్వే లైన్‌లో భాగంగా జరుగుతున్న పనులు నేపథ్యంలో సాగునీటి కాల్వలో మట్టి కూడకపోయిందని.. వెంటనే తొలగించాలని రైల్వే అధికారులను మాజీ మంత్రి హరీష్‌రావు ఆదేశించారు. చిన్నకోడూరు రైల్వే స్టేషన్ మంజూరైందని.. స్టేషన్ నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించాలని సూచించారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండల కేంద్రంలో రైల్వేలైన్,సాగునీటి కాల్వ పనులను మాజీ మంత్రి హరీష్‌రావు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అదేవిధంగా అధికారులతో కలసి చిన్నకోడూరు,మాచాపూర్, గంగాపూర్, వితలాపూర్ వరకు జరుగుతున్న రైల్వే పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైల్వేలైన్ పక్కనే ఉన్న సాగునీటి కాల్వలో మట్టి కూడుకపోయిందని. వచ్చే యాసంగిలోపు మట్టిని తొలగించాలని అధికారులను మాజీ మంత్రి హరీష్‌రావు ఆదేశించారు. రైల్వే లైన్ క్రాస్ అయ్యే క్రమంలో కాల్వల మీద రైల్వే బ్రిడ్జి పురోగతిలో ఉన్నాయన్నారు. ఈ పనులు యాసంగి లోపు రైతులకు ఇబ్బందులు కలుగుకుండ రైల్వే అధికారులు, ఇరేగేషన్ సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. చిన్నకోడూరు రైల్వేస్టేషన్ పనులు త్వరగా ప్రారంభించాలని అధికారులను కోరారు. ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు మాణిక్యరెడ్డి, రాధకిషన్ శర్మ. సర్పంచ్ శ్రీనివాస్,పాపయ్య, మెడికాయల వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

**యాసంగిలో రైతులకు ఇబ్బందులు లేకుండా పంట పొలాలకు నీరు అందించాలి**

వచ్చే యాసంగికి రైతులకు ఏలాంటి ఇబ్బందులు లేకుండ పంట పోలాలకునీరందందాలని మాజీ మంత్రి హరీష్‌రావు ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. సిద్దిపేట క్యాంపు కార్యాలయంలో ఇరిగేషన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నా స్వంత డబ్బులు వెచ్చించి తాత్కలిక కాలువలు తీసి నీరు అందించే పరిస్థితి వచ్చిందన్నారు. అది దృష్టిలో పెట్టుకొని వచ్చే యాసంగి వరకు శాశ్వత కాల్వలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమగు భూసేకరణకు చేపట్టాలని , భూసేకరణ కాల్వల నిర్మాణానికి కావాల్సిన నిధులు ఇవ్వాలని ఫోన్‌లో కలెక్టర్‌ను కోరారు. యాసంగి రైతులకు ఏలాంటి ఇబ్బందులు కలుగకుండ చూడాలన్నారు. ఇ ర్కోడ్, చందులాపూర్‌లో నిర్మించే లిఫ్ట్ పనులు వేగవంతం కావాలని కోరారు. అదేవిధంగా నియోజకవర్గంలోని పెండింగ్‌లో ఉన్నచెక్‌డ్యాం ప నులు, త్వరితగతిన చేపట్టాలని చెప్పారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్సీ దేశపతిశర్మ, ఈఈ గోపాలకృష్ణ, ఈఈ శంకర్, డిఈ చంద్రశేఖర్, శిరీష, వినయ్, ఆంజనేయులు, విద్యాసాగర్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

# క్రీడ




## అమ్మో.. భారత గ్రాండ్‌మాస్టర్‌తో అంత ఈజీ కాదు!

ఇటీవల కాలంలో భారత కుర్రాళ్లు చదరంగంలో అబ్బురపరిచే విజయాలతో ఔరా అనిపిస్తున్నారు. వేదిక ఏదైనా తమదైన ప్రతిభతో మేటి ఆటగాళ్లను సైతం ఓడిస్తున్నారు. వరల్డ్ నంబర్ 1 మాగ్నస్ కార్ల్‌సన్ సైతం అమ్మో భారత కుర్రాళ్లతో తలపడడం కష్టమేనని అంటున్నాడు. ఫిడే వరల్డ్ ర్యాపిడ్ బ్లిట్జ్ ఛాంపియన్‌షిప్‌ను పురస్కరించుకొని మాట్లాడిన ఈ నార్వే లెజెండ్ మాజీ ఛాంపియన్ డి.గుకేశ్‌తో ఆడడం ఎల్లప్పుడూ సవాల్‌గానే ఉంటుందని అన్నాడు. దోహాలోని ఖతార్‌లో జరుగుతున్న ఫిడే వరల్డ్ ర్యాపిడ్ బ్లిట్జ్ ఛాంపియన్‌షిప్‌లో కార్ల్‌సన్ ఫేవరెట్‌గా ఆడుతున్నాడు. ఈ టోర్నీలో జూనియర్ల నుంచి తనకు గట్టి పోటీ ఎదురుకానుందని చెబుతున్న అతడు భారత కుర్రాడు గుకేశ్‌తో ముప్పేనని అంటున్నాడు. గత కొన్ని రోజులుగా నేను యంగ్‌స్టర్స్‌తో మ్యాచ్‌లు ఆడలేదు. వారు ఈ మధ్య చాలా గొప్పగా ఆడుతున్నారు. ముఖ్యంగా డి.గుకేశ్ అదరగొడుతున్నాడు. 16 నుంచి 22 ఏళ్లున్న యువకెరటాలతో ప్రమాదం పొంచి ఉంటుంది అని కార్ల్‌సన్ తెలిపాడు. ఈ ఏడాది నార్వే చెస్‌లో గుకేశ్ వ్యూహాలకు బదులివ్వలేక కార్ల్‌సన్ చేతులెత్తేశాడు. వరల్డ్ నంబర్1ను ఓడించి వార్తల్లో నిలిచాడు భారత గ్రాండ్‌మాస్టర్. అయినా సరే గుకేశ్‌ను తాను గ్రేట్ ప్లేయర్‌గా కాకుండా యంగ్‌స్టర్‌గానే చూస్తానని అంటున్నాడీ చెస్ కింగ్. ఈ మధ్య స్వదేశంలో ముగిసిన చెస్ వరల్డ్‌కప్‌లో నిరాశపరిచిన గుకేశ్ .. ఫిడే వరల్డ్ ర్యాపిడ్ బ్లిట్జ్ ఛాంపియన్‌షిప్‌లో కార్ల్‌సన్‌కు చెక్ పెట్టాలనే పట్టుదలతో ఉన్నాడు. అతడితో పాటు అర్జున్ ఎరిగేసి, ప్రజ్ఞానంద.. కోనేరు హంపి, ద్రోణవల్లి హారికలు సత్తా చాటాలనుకుంటున్నారు. ఈ టోర్నీ డిసెంబర్ 26 నుంచి డిసెంబర్ 30 వరకు జరగనుంది.

## కోహ్లీ ఖాతాలో మరో మైలురాయి..



వన్డే ఫార్మాట్లో రారాజుగా వెలుగొందుతున్న విరాట్ కోహ్లీ వరుసగా రికార్డులను బ్రేక్ చేస్తున్నాడు. సిడ్నీ వన్డేలో అర్ధ శతకంతో మొదలైన విరాట్ పరుగుల ప్రవాహం అవిఘ్నంగా కొనసాగుతోంది. బిసిసిఐ కోరిక మేరకు విజయ్ హజారే ట్రోఫీలోనూ ఆడుతున్న కింగ్ కోహ్లీ.. అక్కడా రికార్డుల దుమ్ముదులుపుతున్నాడు. తొలి మ్యాచ్‌లోనే శతకంతో రెచ్చిపోయిన భారత స్టార్.. గుజరాత్‌పై అర్ధ శతకంతో మరో రికార్డు పట్టేశాడు. లిస్ట్ – ఏ క్రికెట్‌లో అత్యధిక సగటు నమోదు చేశాడు. ఇటీవల కాలంలో సూపర్ ఫామ్ కొనసాగిస్తున్న కోహ్లీ విజయ్ హజారే ట్రోఫీతో తడాఖా చూపిస్తున్నాడు. వచ్చే ప్రపంచకప్ లక్ష్యంగా పదిహేనేళ్ల తర్వాత ఈ లీగ్‌లో ఆడుతున్న అతడు.. విధ్వంసక ఆటతో అందర్నీ ఫిదా చేస్తున్నాడు. శుక్రవారం గుజరాత్‌పై హాఫ్ సెంచరీతో కదం తొక్కిన విరాట్ మళ్లీ వంద కొట్టేలా కనిపించాడు. కానీ, 77 పరుగుల వద్ద వెనుదిరిగాడు. అయినా సరే.. అత్యధిక సగటుతో ఆస్ట్రేలియా మాజీ ఫినిషర్ మైఖేల్ బెవాన్ పేరిట ఉన్న ఆల్‌టైమ్ రికార్డును దాటేశాడు.

'నాటౌట్ కింగ్'గా పేరొందిన బెవాన్ సగటు లిస్ట్ ఏ క్రికెట్‌లో 57.86 కాగా.. కోహ్లీ 57.87తో అతడిని అధిగమించాడు. లిస్ట్ ఏలో సచిన్ టెండూల్కర్ రికార్డును బద్దలు కొడుతూ అత్యల్ప మ్యాచుల్లోనే 16 వేల క్లబ్‌లో చేరాడు విరాట్. ప్రస్తుతం 343 మ్యాచుల్లో 57.60 సగటుతో 16,130 రన్స్ బాదాడు. ఇందులో 58 సెంచరీలు, 84 అర్ధ శతకాలు ఉన్నాయి.

## ఇంగ్లాండ్‌పై ఆధిక్యంలో ఆసీస్

### ఒకే రోజు కూలిన 20 వికెట్లు..



ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ జట్ల మధ్య జరుగుతున్న నాలుగవ టెస్టు తొలి రోజే 20 వికెట్లు కూలాయి. ఫస్ట్ బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 152 రన్స్‌కు ఆలౌట్ అవ్వగా, ఆ తర్వాత తొలి ఇన్నింగ్స్ ఆడిన ఇంగ్లాండ్ కేవలం 110 రన్స్‌కే కుప్పకూలింది. అయితే ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో నాలుగు రన్స్ చేసిన ఆస్ట్రేలియా ఇప్పటి వరకు 46 పరుగుల ఆధిక్యంలో ఉన్నది. తొలి మూడు టెస్టులను గెలుచుకుని టెస్టు సిరీస్‌ను కైవసం చేసుకున్న ఆస్ట్రేలియా .. నాలుగవ టెస్టులోనూ తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నది. కానీ శుక్రవారం ఫస్ట్ బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియాను ఇంగ్లాండ్ బౌలర్ జోష్ టాంగ్ దెబ్బతీశాడు. అతను 45 రన్స్ ఇచ్చి అయిదు వికెట్లు తీసుకున్నాడు. ఆస్ట్రేలియా క్రమంగా తన వికెట్లను కోల్పోయింది. బ్యాటర్లు ఎవరూ హాఫ్ సెంచరీ చేయలేదు. మైఖేల్ నీసర్ అత్యధికంగా 35 రన్స్ చేశాడు. ఇక ఇంగ్లాండ్ కూడా తన ఫస్ట్ ఇన్నింగ్స్‌లో దారుణంగా విఫలమైంది. ఇప్పటికే సిరీస్ కోల్పోయిన ఆ జట్టు మెల్‌బోర్న్ పిచ్‌పై ఏమాత్రం నిలవలేకపోయింది.

ఆసీస్ పేస్ బౌలర్ల దాడికి మళ్లీ చేతులెత్తేసింది. ఇంగ్లాండ్ టాప్ ఆర్డర్ బ్యాటర్లలో హ్యారీ బ్రూక్ ఒక్కడే రాణించాడు. అతను అత్యధికంగా 41 రన్స్ స్కోరు చేశాడు. చివరలో అట్కిన్సన్ కొన్ని మెరుపులు మెరిపించాడు. ఆసీస్ బౌలర్లలో మైఖేల్ నీసర్ 4, బోలాండ్ 3, స్టార్క్ రెండు వికెట్లు తీసుకున్నారు.

## గాయపడిన ఐపిఎల్ స్టార్



ఐపిఎల్‌లో మెరుపు ఇన్నింగ్స్‌లతో అలరించే అంగ్‌క్రిష్ రఘువంశీ అనుకోకుండా ఆస్పత్రి పాలయ్యాడు. దేశవాళీ టోర్నీలో ఆడుతూ గాయపడడంతో అతడిని దవాఖానకు తీసుకెళ్లారు. విజయ్ హజారే ట్రోఫీలో ముంబై తరఫున బరిలోకి దిగిన అంగ్‌క్రిష్ శుక్రవారం ఉత్తరాఖండ్‌తో మ్యాచ్‌లో ఫీల్డింగ్ చేస్తుండగా గాయపడ్డాడు. నడలేని స్థితిలో ఉన్న అతడిని స్ట్రెచర్ మీద బయటకు తీసుకొచ్చి.. సమీపంలోని ఎస్‌డీఎంహెచ్ ఆస్పత్రిలో చేర్పించారు. వన్డే ఫార్మాట్‌లో జరుగుతున్న విజయ్ హజారే ట్రోఫీలో ముంబైకి అంగ్‌క్రిష్ రఘువంశీ ఆడుతున్నాడు. జైపూర్‌లో శుక్రవారం ఉత్తరాఖండ్‌పై 11 పరుగులతో నిరాశపరిచిన అతడు.. ఫీల్డింగ్‌లో కష్టమైన క్యాచ్ అందుకునే క్రమంలో గాయపడ్డాడు. ఎలాగైనా బంతిని ఒడిసిపట్టేందుకు ప్రయత్నించిన ఈ యువకెరటం తల, భుజాలకు గాయాలయ్యాయి. దాంతో.. నొప్పితో మైదానంలోనే కూలబడిన అతడిని ఫిజియో వచ్చి పరీక్షించాడు. అయినా పరిస్థితి మెరుగవ్వకపోవడంతో సిబ్బంది స్ట్రెచర్ మీద అంగ్‌క్రిష్‌ను బయటకు తీసుకెళ్లారు. అనంతరం.. ఆస్పత్రిలో చేర్పించారు. ప్రస్తుతం అతడి ఆరోగ్యం నిలకడగా ఉందని సమాచారం. ఐపీఎల్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ బ్యాటింగ్ అస్త్రంగా పేరొందిన అంగ్‌క్రిష్ టాపార్డర్ బ్యాటర్. ఇప్పటివరకూ రెండు సీజన్లలో 22 మ్యాచులు ఆడిన ఈ చిచ్చరపిడుగు 463 పరుగులు సాధించాడు.

# ఫోకస్


# సైన్స్



## కర్వ్‌డ్ స్పేస్ టైమ్‌లో కణాల ఉనికి!

సాధారణంగా మనం కణం ఉంది లేదా లేదు అన్నది ఒక తిరుగులేని వాస్తవమని అనుకుంటాం. కానీ క్వాంటం సిద్ధాంతం, ఐన్‌స్టీన్ సాధారణ సాపేక్ష సిద్ధాంతంతో కలిపినప్పుడు, అందుకు భిన్నమైన ఒక ఆశ్చర్యకరమైన నిజం బయటపడుతుంది. కణాల ఉనికి పరిశీలకుడి దృక్పథంపై ఆధారపడి ఉంటుందిగానీ, ఇది భ్రమ కాదు, కొలతలో తప్పు కూడా కాదు.. విచిత్రంగా అది ప్రకృతి పనిచేసే విధానం. కణాలను 'అబ్సల్యూట్' లేదా 'సంపూర్ణమైన' కణాలు కావు. క్లాసికల్ ఫిజిక్స్‌లో కణాలను చిన్న, స్పష్టమైన బిందువులుగా పేర్కొన్నారు. కానీ క్వాంటం భౌతికశాస్త్రంలో కణాలు అసలు వస్తువులుగా కాకుండా క్వాంటం ఫీల్డ్‌లో ఏర్పడే ఉత్తేజిత స్థితులు. అంటే, కణాలు వస్తువులు కావు. ఈ ఫీల్డ్‌ను ఎలా విభజించి కణం అని పిలవాలో అన్నది పరిశీలకుడి కదలిక, గురుత్వాకర్షణ, సమయాన్ని ఎలా కొలుస్తున్నాడన్నదానిపై ఆధారపడి ఉంటుంది. దీనితో వేర్వేరు పరిశీలకులకు వేర్వేరు వాస్తవాలు తెలిసే అవకాశం ఉంది. కర్వ్‌డ్ (వంపు తిరిగిన) స్పేస్‌టైమ్‌లో లేదా యాక్సిలరేషన్ ఉన్న పరిస్థితుల్లో, ఇద్దరు పరిశీలకులు ఒకే ప్రాంతాన్ని చూసినా, వాటిని భిన్నంగా అనుభవించవచ్చు. ఒక పరిశీలకుడికి అది పూర్తిగా ఖాళీ వాక్యూమ్‌గా అనిపించవచ్చు. మరొక పరిశీలకుడికి అదే చోట కణాలతో, శక్తితో నిండినట్టు అనిపించవచ్చు. ఇద్దరూ తమతమ ఫ్రేమ్‌లలో చూసింది నిజమే. ఒకరు తప్పు, మరొకరు నిజం అనే ప్రశ్నే ఉండదు. దీనిని నిరూపించడానికి 'అన్‌రూహ్ ఎఫెక్ట్' యాక్సిలరేషన్ ఉదాహరణను పేర్కొంటారు. స్థిరంగా ఉన్న పరిశీలకుడికి స్పేస్ ఖాళీగా ఉంటుంది. అదే స్పేస్‌లో వేగంగా కదులుతున్న లేదా యాక్సిలరేట్ అయ్యే పరిశీలకుడికి వేడి, కణాలు కనిపిస్తాయి. ఇక్కడ కొత్త కణాలు ఎక్కడి నుంచో వచ్చాయని కాదు. వాక్యూమ్‌ను విభజించే విధానం మారింది అంతే. కదలికే వాస్తవాన్ని మార్చింది. బ్లాక్ హోల్‌కు దూరంగా ఉన్న పరిశీలకుడికి ఒక రకమైన కణాల చిత్రణ లేదా గురుత్వాకర్షణ, స్పేస్‌టైమ్‌ను వక్రీకరణం చెందేలా చేస్తే, ఇదే ప్రభావం బ్లాక్ హోల్‌కు దగ్గరగా ఉన్న పరిశీలకుడికి పూర్తిగా భిన్నమైన చిత్రంగా కనిపిస్తుంది. ఒకరికి ఉన్న కణం మరొకరికి లేనట్టు అనిపించవచ్చు. ఇది కణాలు స్వతంత్రంగా ఉన్నాయన్న భావనను పూర్తిగా సవాలు చేస్తుంది. మొత్తం మీద ఈ అధ్యయనం లేదా సిద్ధాంతం మన వాస్తవ భావననే మార్చేస్తుంది. దీని ప్రకారం, కణాలు శూన్యంలో తేలుతున్న చిన్న డాట్స్ కావు.. అవి స్పేస్‌టైమ్ ఆకృతిచేసిన క్వాంటం ఫీల్డ్ నుంచి ఉద్భవించే సంబంధిత సంఘటనలు. పరిశీలన, కదలిక, గురుత్వాకర్షణ కలిసి వీటి ఉనికిని నిర్వచిస్తాయి. అందువల్ల వస్తువు పదార్థం అనేది పూర్తి వాస్తవం కాదు. అలాగని అవాస్తవం కూడా కాదు. చూసేవారి దృష్టిని బట్టి, వారు ఉన్న పరిస్థితులను బట్టి, అది మారుతూ ఉంటుంది.

## విశ్వమానవులం!



మనిషికీ, ప్రకృతికీ అవినాభావ సంబంధం ఉందని మనకు తెలుసు. అయితే, మన శరీరంలోని ప్రతి అణువు బిలియన్ల సంవత్సరాలుగా విశ్వాన్ని దాటి వచ్చిందంటే ఆశ్చర్యం కలుగుతుంది. కానీ, భౌతిక సిద్ధాంతాలను అనుసరించి ఇది వాస్తవం. భూమి ఏర్పడక ముందే, పేర్లునగరాలు సముద్రాలు లేని కాలంలోనే, నక్షత్రాలు ఈ అణువులను ఆవిష్కరించి చెదరగొట్టాయి. గురుత్వాకర్షణ వాటిని మళ్లీ సమకూర్చింది. నెమ్మదిగా, అపార ఓపికతో కణాలను, రసాయనాలను, చివరకు శ్వాసను, ఆలోచనను రూపొందించింది. మీరు స్పేస్‌కు వేరు కాదు. మీరు అదే స్పేస్ పురాతన విశ్వ సంభావ్యత ద్వారా తాత్కాలికంగా సంఘటనా రూపం. ఈ అణువులు నక్షత్రాల మూలాల నుంచి జన్మించాయి. అక్కడి అపార ఒత్తిడి, సమయం కలిసి మూలకాలను సృష్టించాయి. నక్షత్రాలు వృద్ధాప్యానికి చేరి పేలినప్పుడు లేదా సూపర్‌నోవా సమయంలో, వాటి పదార్థం అంతరిక్షంలోకి వ్యాపించింది. ఆ ధూళి మేఘాలు కుంచించుకుని కొత్త సూర్యులను, గ్రహాలను నిర్మించాయి. అప్పుడే రసాయనశాస్త్రం మేల్కొంది... జీవశాస్త్రం దానికి కొనసాగింపుగా వచ్చింది. విశాలమైన కాలప్రవాహంలో తిరుగుతున్న కణాలు సరైన పరిస్థితులు ఏర్పడే వరకు ఎదురుచూశాయి. తొందర లేకుండా, జ్ఞాపకం లేకుండా, లోతైన కాలంలో సంభావ్యతను మార్గనడిపిస్తూ జీవం సమకూరింది. శాస్త్రం ఈ వంశావళిని స్పష్టంగా చూపిస్తుంది. ఐసోటోప్‌లు, నక్షత్ర ధూళి కణాలు, విశ్వ మోడల్స్. కార్బన్, ఆక్సిజన్, ఇనుము, కాల్షియం వంటివన్నీ అక్కడి నుంచి వచ్చినవే. అంటే, మనలో కొత్తగా సృష్టించబడింది ఏమీ లేదు.. ఉన్నదంతా పునర్వ్యవస్థీకరణ మాత్రమే. ఈ అవగాహన మనసును స్థిరపరుస్తుంది. వినయాన్ని నేర్పుతుంది. మన ఉనికి యాదృచ్ఛికం కాదు. అది కొనసాగింపు. అపార కాలం, స్పేస్, పదార్థం కలిసి పనిచేసిన భౌతిక నియమాల ఫలితం.. నిశ్శబ్దంగా, అంతులేకుండా ముందుకు సాగుతున్న ప్రక్రియ. భావోద్వేగపరంగా ఈ జ్ఞానం భయాన్ని మెత్తబరుస్తుంది. మన ఆలోచనలు పుట్టకముందే ప్రారంభమైన కథలో మనం భాగస్వాములం. నష్టం, మార్పు ముగింపులు కాకుండా కదలికలుగా కనిపిస్తాయి. అదే అణువులు ముందుకు ప్రయాణిస్తూనే ఉంటాయి. ఒంటరితనం స్థానంలో సంబంధం వస్తుంది. ఒకే జీవితకాలాన్ని మించి విస్తరించిన కాలంలో.. నక్షత్రాలు, గెలాక్సీలు, జీవం.. అన్నింటితో మన గుర్తింపు ముడిపడినప్పుడు అర్థం లోతుగా మారుతుంది. అందుకే శ్వాస తీసుకునేటప్పుడు మన లోతును గుర్తుంచుకోండి. మనం ఒకేసారి తాత్కాలికులం... కాలరహితులం కూడా. విశ్వం మన ద్వారా తనను తాను గమనించడం నేర్చుకుంటోంది. ఆ వారసత్వాన్ని సున్నితంగా చూసుకోవాలి. ఆసక్తి దానిని గౌరవిస్తుంది. శ్రద్ధ దానిని కాపాడుతుంది. దానిని జీవించేలా చేస్తుంది. ప్రతి ఎంపిక దూరంగా ప్రతిధ్వనిస్తుంది... ముందుకు. ఓపికతో, దయతో, శాస్త్రంతో, వినయంతో, ఆశ్చర్యంతో మనం ఇంకా విస్తరిస్తున్న విశ్వంతో ముడిపడి ఉంటాం.. వాటితోనే కలిసి.. వాటిలోనే కలిసి.

# రీల్



## రాశీ ఖన్నా పోస్టర్ విడుదల

పవన్ కళ్యాణ్ హీరోగా హరీష్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమా నుంచి హీరోయిన్ రాశీ ఖన్నా పోస్టర్ విడుదల చేశారు. సినిమా షూటింగ్ సెట్ ఫోటోస్‌ను విడుదల చేశారు. ఈ ఫోటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. పవన్ కళ్యాణ్ సరసన శ్రీలీలతో పాటు రాశీ ఖన్నా హీరో హీరోయిన్‌గా నటిస్తోంది. దేవిశ్రీ ప్రసాద్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ఆనంద్ సాయి ఆర్ట్ డైరెక్టర్‌గా పని చేశారు. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇటీవల విడుదలైన దేఖ్లేంగే సారా అనే పాట చార్ట్ బస్టర్ హిట్టయ్యింది.

## అమరావతికి ఆహ్వానం





హారర్ నేపథ్యంలో రూపొందిన చిత్రం 'అమరావతికి ఆహ్వానం'. శివ కంఠంనేని, ధన్య బాలకృష్ణ, ఎస్తర్, సుప్రిత, హరీష్ ప్రధాన పాత్రలతో తెరకెక్కుతోన్న ఈ మూవీలో సీనియర్ నటులు అశోక్ కుమార్, భద్రమ్, జెమిని సురేష్, నాగేంద్ర ప్రసాద్ కీలకపాత్రలు పోషించారు. డైరెక్టర్ జివికె ఈ మూవీని తెరకెక్కిస్తున్నారు. ప్రముఖ నిర్మాత ముప్పా వెంకయ్య చౌదరి నిర్మాణ సారథ్యంలో జి.రాంబాబు యాదవ్ సమర్పణలో లైట్ హౌస్ సినీ మ్యాజిక్ బ్యానర్‌పై కేఎస్ శంకర్రావు, ఆర్ వెంకటేశ్వర రావు ఈ చిత్రాన్ని నిర్మించారు. ఆంధ్ర, తెలంగాణ, మధ్య ప్రదేశ్‌లోని పలు లొకేషన్స్‌లో షూటింగ్స్ జరుపుకున్న ఈ చిత్రం ప్రస్తుతం నిర్మాణాంతర కార్యక్రమాలు శర వేగంగా జరుపుకుంటోంది. త్వరలో థియేటర్స్‌లో రిలీజ్ చేయనున్నారు తాజాగా సరిక్రొత్త పోస్టర్ గ్లింప్స్ రిలీజ్ చేశారు.

## 'జెట్లీ' నుంచి వెన్నెల కిషోర్ ఫస్ట్ లుక్




టాలీవుడ్ ఫేవరేట్ ద్వయం సత్య, దర్శకుడు రితేష్ రానా 'జెట్లీ'తో అలరించబోతున్నారు. మేకర్స్ ముందుగా రిలీజ్ చేసిన పోస్టర్స్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. క్లాప్ ఎంటర్టైన్మెంట్ చిరంజీవి (చెర్రీ), హేమలత పెద్దమల్లు నిర్మిస్తున్న జెట్లీని మైత్రి మూవీ మేకర్స్ సమర్పిస్తున్నారు. ఈ సినిమా నుంచి వెన్నెల కిషోర్ ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు. విమానం విండో సీట్ దగ్గర వెన్నెల కిషోర్ కూర్చుని స్టైలిష్ హెయిర్‌స్టైల్‌తె కాన్ఫిడెంట్‌గా చూస్తున్న లుక్ ఆకట్టుకుంది. వెన్నెల కిషోర్ చేతిలో వున్న సినిమా సుదోకు బుక్ రితేష్ రానా మార్క్ ఫన్‌తో అలరించింది. జెట్లీతో మిస్ యూనివర్స్ ఇండియా రియా సింఘా హీరోయిన్గా టాలీవుడ్‌లోకి అడుగుపెడుతోంది. అజయ్ ఈ ప్రాజెక్ట్‌లో కీలక పాత్ర పోషిస్తున్నారు. రితేష్ రానా గత హిట్లకు పని చేసిన కోర్ టెక్నికల్ టీం ఈ సినిమాకి వర్క్ చేస్తుంది.



## 'గత వైభవం' జనవరి 1న రిలీజ్

'గత వైభవం' గత నెలలో కర్ణాటక వ్యాప్తంగా థియేటర్లలో విడుదలై భారీ బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఎస్ఎస్ దుష్యంత్, ఆషిక రంగనాథ్ నటించిన ఈ చిత్రానికి సునీ దర్శకత్వం వహించడమే కాకుండా, దీపక్ తిమ్మప్పతో కలిసి ఈ ప్రాజెక్ట్‌కు సహ నిర్మాతగా కూడా వ్యవహరించారు. సర్వేగర సిల్వర్ స్క్రీన్స్‌తో కలిసి సునీ సినిమాస్ బ్యానర్‌పై నిర్మించిన ఈ చిత్రం ఇప్పుడు గ్రాండ్‌గా తెలుగులో విడుదల కావడానికి సిద్ధమవుతోంది.. నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి నేతృత్వంలోని ప్రైమ్‌షో ఎంటర్టైన్మెంట్ ఈ చిత్రాన్ని జనవరి 1న తెలుగులో రిలీజ్ చేయనుంది. కన్నడ వెర్షన్‌కు అద్భుతమైన స్పందన లభించడంతో, తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. విలియం జె.డేవిడ్ సినిమాటోగ్రఫీని అందించగా, జుడా శాండీ అందించిన సంగీతం కథలోని భావోద్వేగ, పౌరాణిక అంశాలను ఉన్నత స్థాయికి తీసుకువెళ్లింది. విజువల్ వండర్ గత వైభవం'లో అత్యాధునిక విఎఫ్ఎక్స్, సౌండ్‌తో పాటు సాగే గొప్ప కథనం అలరించనున్నాయి. ప్రేమ, పురాణం, పునర్జన్మ, చారిత్రక నాటకం కలగలిసిన ఈ చిత్రం ప్రేక్షకులని మెస్మరైజ్ చేయడానికి సిద్ధంగా ఉంది.

## 'మారెమ్మ' షూటింగ్ పూర్తి



రవితేజ బ్రదర్ యాక్టర్ రఘు కుమారుడు మాధవ్ హీరోగా నటించిన రూరల్ రస్టిక్ మూవీ 'మారెమ్మ'. మంచాల నాగరాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. మోక్ష ఆర్ట్స్ బ్యానర్‌పై మయూర్ రెడ్డి బండారు తమ ప్రొడక్షన్ నంబర్ 1గా నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్, గ్లింప్స్‌కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. తాజాగా ఈ చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా మేకర్స్ రిలీజ్ చేసిన పోస్టర్‌లో మాధవ్ ఎద్దును నడిపిస్తూ ధైర్యంగా ముందుకు వస్తూ ఇంటెన్స్ లుక్‌లో కనిపించారు. బ్యాక్ డ్రాప్‌లో శక్తివంతంగా కనిపించే కాళీదేవి విగ్రహం, చుట్టూ గ్రామీణ పండుగ వాతావరణం, జనసందడి, ఉత్సవ ఉత్సాహంతో పాటు ఒక పవర్ ఫుల్ సంఘటనకు సంకేతంగా కనిపిస్తోంది.



## 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' స్పెషల్ పోస్టర్

మాస్ మహారాజా రవితేజ, కిషోర్ తిరుమల దర్శకత్వంలో, సుధాకర్ చెరుకూరి ఎస్ఎల్వి సినిమాస్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఫ్యామిలీ ఎంటర్టైనర్ 'భర్త మహాశయులకు విజ్ఞప్తి. ఈ సంక్రాంతికి విడుదల చేయనున్నారు. ఆషికా రంగనాథ్, డింపుల్ హయతి హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్, పాటలు సినిమాపై బజ్‌ను సృష్టించాయి. తాజాగా మేకర్స్ క్రిస్మస్ విషెస్ అందిస్తూ సినిమా నుంచి స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు. రవితేజ సాంటా క్యాప్ పెట్టుకుని, చేతిలో గిఫ్ట్ పట్టుకుని ఫెస్టివ్ వైబ్‌లో కనిపించడం అందర్నీ ఆకట్టుకుందిభర్త మహాశయులకు విజ్ఞప్తి అవుట్ అండ్ అవుట్ ఎంటర్టైన్మెంట్‌గా తెరకెక్కిస్తున్నారు. జనవరి 13న ఈ చిత్రం గ్రాండ్‌గా రిలీజ్ కానుంది.

## 'నేను రెడీ' కొత్త పోస్టర్



'నువ్విలా', 'జీనియస్', 'రామ్ లీల', 'సెవెన్' వంటి చిత్రాలతో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరో హవిష్, దర్శకుడు త్రినాధ రావు నక్కినతో జతకట్టారు. 'సినిమా చూపిస్తా మామ', 'నేను లోకల్', 'ధమాకా', 'మజాకా' వంటి విజయవంతమైన చిత్రాలను అందించిన త్రినాధ రావు నక్కిన 'నేను రెడీ' చిత్రాన్ని పూర్తిస్థాయి కమర్షియల్ ఎంటర్టైనర్‌గా తెరకెక్కిస్తున్నారు. హర్నిక్స్ ఇండియా ఎల్ఎల్‌పి బ్యానర్‌పై నిఖిల కొనేరు ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, కావ్య థాపర్ కథానాయికగా నటిస్తోంది. చిత్ర బృందం ఒక కొత్త పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ పోస్టర్‌లో హవిష్ చాలా హుందాగా, అదే సమయంలో ఇంటెన్స్ లుక్‌తో కనిపిస్తున్నారు. చక్కగా దువ్విన జుట్టు, ట్రిమ్ చేసిన గడ్డం, నల్లటి అద్దాల కళ్ళజోడు అతనికి ఒక సీరియస్ లుక్ ఇచ్చాయి. ముదురు రంగు ప్యాంటులో ఇన్ చేసిన చెక్ షర్ట్, ఐడీ కార్డు, భుజంపై వేలాడుతున్న బ్రౌన్ కలర్ ఆఫీస్ బ్యాగ్‌తో అతని లుక్ మిడిల్ క్లాస్ మ్యాన్ లా వుంది. అతని నిలబడిన తీరు యాక్షన్‌కి సిద్ధంగా ఉన్నట్లు వుంది. ఈ సినిమా చిత్రీకరణ శర వేగంగా జరుగుతోంది. హైదరాబాద్‌లో సుదీర్ఘ షెడ్యూల్ పూర్తి చేసుకున్న తర్వాత, చిత్ర బృందం నిన్న పాండిచ్చేరిలో హీరో హీరోయిన్ల పై చిత్రీకరించిన సాంగ్ షూట్ పూర్తి చేసింది. ఈ పాటకు విజయ్ పోలాకి మాస్టర్ కొరియోగ్రఫీ చేశారు. సాంగ్ అద్భుతంగా వచ్చింది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా ఏకకాలంలో జరుగుతున్నాయి.

## 'అనగనగా ఒక రాజు'లో రెండో పాట

వరుసగా మూడు ఘన విజయాలతో ప్రేక్షకుల హృదయాలలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న స్టార్ ఎంటర్టైనర్ నవీన్ పొలిశెట్టి, 2026 సంక్రాంతికి తన తదుపరి చిత్రం 'అనగనగా ఒక రాజు'తో అలరించనున్నారు. ప్రచార చిత్రాలలో వైవిధ్యం చూపిస్తూ, ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తున్న ఈ చిత్రం నుంచి ఇప్పటికే విడుదలైన మొదటి గీతం 'భీమవరం బాల్మా' ఆకట్టుకుంది. తాజాగా ఈ చిత్రం నుంచి రెండవ గీతంగా 'రాజు గారి పెళ్లిరో' విడుదలైంది. అనగనగా ఒక రాజు' నుంచి డ్యాన్స్ నంబర్‌గా విడుదలైన 'రాజు గారి పెళ్లిరో' పాట కట్టిపడేస్తోంది. మాస్‌తో పాటు, అన్ని వర్గాల ప్రేక్షకులు మెచ్చేలా ఉత్సాహభరితంగా సాగిన ఈ గీతం.. పండగ వాతావరణాన్ని ముందే తీసుకొని వచ్చింది. తెలుగు ప్రేక్షకుల హృదయాలలో ఎప్పటికీ నిలిచిపోయే పెళ్లి పాటలలో ఒకటిగా ఇది నిలుస్తుంది అనడంలో సందేహం లేదు. ఈ పాటలో నవీన్ పోలిశెట్టి, మీనాక్షి చౌదరి ప్రధాన ఆకర్షణగా నిలిచారు. ప్రముఖ కొరియోగ్రాఫర్ శేఖర్ మాస్టర్ సమకూర్చిన అద్భుతమైన నృత్య రీతులతో ఈ పాటను భారీ స్థాయిలో తెరకెక్కించారు. రావు రమేష్ సహా ప్రధాన నటీనటులంతా పాల్గొనడంతో దృశ్య పరంగా ఈ పాట మరింత సంపన్నంగా, సంబరంగా మారింది. 'అనగనగా ఒక రాజు' చిత్రం సంక్రాంతి కానుకగా 2026, జనవరి 14న భారీ స్థాయిలో విడుదల కానుంది.




## 'హైలెస్సో' ఫస్ట్ లుక్ రిలీజ్

సుడిగాలి సుధీర్‌గా అందరికీ సుపరిచితుడైన సుధీర్ ఆనంద్ హీరోగా ప్రసన్న కుమార్ కోట దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'హైలెస్సో'. వజ్ర వారాహి సినిమాస్ బ్యానర్‌పై శివ చెర్రీ, రవికిరణ్ నిర్మిస్తున్నారు. ఇది వారి బ్యానర్‌కు ప్రొడక్షన్ నంబర్ 1, సుధీర్ ఆనంద్‌కు హీరోగా ఐదవ చిత్రం. గ్రామీణ నేపథ్యంతో రూపొందుతున్న ఈ చిత్రంలో కోర్ట్ సినిమాలో తన ఇంటెన్స్ నటనతో ఆకట్టుకున్న శివాజీ విలన్గా కనిపించబోతున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్‌కి అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది.



# స్థానికం

REGIONAL NEWS

ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం



## ఉత్సాహభరితంగా సిపిఐ వందేళ్ళ వేడుకలు

**ప్రజాపక్షం/ములకలపల్లి:** ఉత్సాహభరితంగా సిపిఐ వందేళ్ళ వేడుకలు జరుగుతున్నాయని సిపిఐ మండల సహాయ కార్యదర్శి నరాటి రమేష్ అన్నారు. శుక్రవారం ములకలపల్లి సిపిఐ పార్టీ కార్యాలయంలో సిపిఐ మండల నాయకులు, గ్రామ పంచాయితీ ఉపసరపచ్ పువ్వాల లలితరావు ఎర్ర జెండాను ఎగురవేశారు. ఈకార్యక్రమానికి ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఈరోజు 100 వసంతాలు పూర్తి చేసుకొని 101వ వసంతంలోకి అడుగు పెట్టిందని, 1925 డిసెంబర్ 26న కాన్పూర్‌లో ఆవిర్భవించిన సిపిఐ పురిటిలోనే ఎన్నో నిర్బంధాలు, నిషేధాలు, కుట్రలు కేసులు ఎదుర్కొందన్నారు. దేశ సమైక్యత సమగ్రత పరిరక్షణకు ఎందరో కామ్రేడ్లు తమ ప్రాణాలు త్యాగం చేశారని, వారందరి త్యాగ ఫలితమే కమ్యూనిస్టు పార్టీ ఎటువంటి అధికారం లేకపోయినా దేశంలో పీడితుల పక్షాన నిలబడి అలుపెరగని పోరాట పటిమతో ముందుకు దూసుకుపోతుందన్నారు. ఈకార్యక్రమంలో 9వ వార్డు సభ్యులు వంకుడోత్ వీరు, మాజీ కోఆప్షన్ సభ్యులు షైక్ జబ్బార్, ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి అనుముల సాయి, కందిమల్ల నాగరాజు, తాండ్ర సమ్మయ్య, హమలాళీ, మండల నాయకులు మిరియాల వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

## పేదోడి అండ సిపిఐ జెండా



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సిపిఐ పార్టీ కార్యవర్గ సభ్యులు, ఆళ్లపల్లి మండల మాజీ వైస్ ఎంపిపి రేసు ఎల్లయ్య ఆధ్వర్యంలో ఆళ్లపల్లి మండల కేంద్రం భగత్‌సింగ్ సెంటర్, బస్టాండ్ సెంటర్ నందు జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. భగత్‌సింగ్ సెంటర్ నందు ఆళ్లపల్లి మండల సిపిఐ పార్టీ సీనియర్ నాయకులు శ్రీరామ్ సమ్మయ్య జెండా ఆవిష్కరించారు. బస్టాండ్ సెంటర్ నందు ఆళ్లపల్లి మండల సిపిఐ పార్టీ కార్యదర్శి కొమరం హనుమంతు జెండా ఆవిష్కరించారు. ఈసందర్భంగా రేసు ఎల్లయ్య మాట్లాడుతూ భారతావనిలో సిపిఐ పార్టీ వంద సంవత్సరాలు పురస్కరించుకొని 101వ సంవత్సరంలో అడుగిడినందున కార్యకర్తలం దరికీ శుభాకాంక్షలు తెలుపుతూ, భారత కమ్యూనిస్టు పార్టీ త్యాగాలను గుర్తు చేయడం జరిగిందన్నారు. సిపిఐ పార్టీలో ఉండే కార్యకర్తలు అందరూ కూడా నిస్వార్థంగా పని చేసే వారని, వారి కష్ట ఫలితమే ఈ రోజు రెపరెపలాడుతున్న ఎర్రజెండా అని తెలిపారు. ఈకార్యక్రమంలో వార్డు మెంబర్ గౌరబోయిన సీత, మండల సహాయ కార్యదర్శి వజ్జ పగడయ్య, నరెడ్ల రాంబాబు, మద్దెల వెంకటేశ్వర్లు, దీకొండ మల్లేష్, పరమ ఇమానేయులు, ఎల్లబోయిన నవీన్, దీకొండ గణేష్, కుంట స్వాగత్, యాసారపు సాయి ప్రకాష్, బుద్ధి బన్ని, కుంట విజయ్, బుడిగ వీరేందర్,పాల్గొన్నారు.

## ప్రభుత్వ హాస్పిటల్ ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/మణుగూరు:** ఆళ్లపల్లి పర్యటనలో భాగంగా పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ప్రభుత్వ హాస్పిటల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి, ప్రజలకు అందుతున్న వైద్య సేవల స్థితిగతులపై సమగ్రంగా పరిశీలించారు. హాస్పిటల్ వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగుల వద్దకు స్వయంగా వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితులు, డాక్టర్లు, సిబ్బంది అందిస్తున్న సేవలు, వసతుల నాణ్యతపై వివరంగా అడిగి తెలుసుకున్నారు. రోగులు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకుని వెంటనే పరిష్కార చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా హాస్పిటల్ ప్రాంగణ భద్రత దృష్ట్యా ప్రహరీ గోడ నిర్మాణం అత్యవసరమని గుర్తించి, ఇందుకు సంబంధించిన అంశంపై ఐటిడిఏ అధికారుల తో మాట్లాడి నిధుల మంజూరుకు చర్యలు చేపట్టారు.ప్రజల ఆరోగ్యం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత, గ్రామీణ ప్రాంత ప్రజలకు కూడా పట్టణ స్థాయి వైద్య సేవలు అందించడమే మా లక్ష్యం అన్నారు. ఆసుపత్రుల అభివృద్ధిలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేదని స్పష్టం చేశారు. ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందేలా నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

## ప్రజల తీర్పుతో కాంగ్రెస్ దూసుకుపోయింది



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సాధించిన ఘన విజయం ప్రజల నమ్మకానికి ప్రజాస్వామ్య విలువలకు అద్దం పడుతోందని, ప్రజలు ఇచ్చిన ఈ తీర్పు అధికారానికి కాదు నిజాయితీకి, ప్రజల పక్షాన నిలిచే రాజకీయానికి ఇచ్చి మద్దతుగా నిలించిందని, ఈ విజయం సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో పినపాక ఎమ్మెల్యేపాయం వెంకటేశ్వర్లు అన్నారు. ఈ గెలుపు ఒక్క నాయకుడి విజయమేగాక ప్రతి కార్యకర్త చేసిన పోరాటానికి, ప్రతి ఓటరు వ్యక్తం చేసిన ఆశకు ప్రతిబింబమని స్పష్టం చేశారు.కార్యకర్తలతో నూతన ఆత్మవిశ్వాసాన్ని నింపాయి. మండల అధ్యక్షులు పాయం రామనర్సయ్య, సభ అధ్యక్షులు, మాజీ ఎంపిపి పడిగ సమ్మయ్య, మహిళ అధ్యక్షురాలు గలిగ సమ్మక్క, కాంగ్రెస్ పార్టీ మండల కోప్రచార కమిటీ అధ్యక్షులు శ్రీకాంత్, మండల ముఖ్య నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పాల్గొన్నారు.

## ఘనంగా సిపిఐ శతవసంత వేడుక

రావులపల్లి రవికుమార్



**ప్రజాపక్షం/భద్రాచలం :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శత వసంత వేడుక దుమ్ముగూడెం మండలంలో ఘనంగా నిర్వహించారు. నర్సాపురం గ్రామంలో రావులపల్లి నాగభూషణం స్మారక స్థూపం వద్ద సిపిఐ జెండాను సీనియర్ నాయకులు, సొసైటీ మాజీ డైరెక్టర్ కలిమి ఎల్లారెడ్డి ఎగురవేశారు. 1925 సం.లో కాన్పూరులో ఆవిర్భవించిన సిపిఐ పురిటిలోనే ఎన్నో నిర్బందాలను ఎదుర్కొందన్నారు. పీడిత ప్రజల పక్షాన నాటి నుండి నేటి వరకు అనేక పోరాటాలు సాగిస్తోందని, దున్నేవాడిదే భూమి అనే నినాదంతో ముందుకు దూసుకుపోతోందన్నారు. అనేక పార్టీలు అధికార దర్పాన్ని ప్రదర్శించి కనుమరుగై పోయాయని, కానీ ఎలాంటి అధికారం లేకున్నా వందేళ్లపాటు ప్రజాక్షేత్రంలో మనగలిగామని చెప్పారు. నిత్యం ప్రజలతో, ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేసే పార్టీలను ప్రజలు చిరకాలం గుర్తుంచుకుంటారని తెలిపారు.మండల కార్యదర్శి బొల్లోజు వేణు, సహాయ కార్యదర్శి తాటిపూడి రమేష్, నోముల రామిరెడ్డితో పాటు పాల్గొన్నారు.

## గ్రంథాలయ భవనాన్ని ఏర్పాటు చేయండి

**ప్రజాపక్షం/చంద్రుగొండ:** చంద్రుగొండలో గ్రంథాలయ భవనాన్ని ఏర్పాటు చేయాలని సర్పంచ్ ఇస్లావత్ రుక్మిణి ఆధ్వర్యంలో శుక్రవారం ఎంఎల్‌ఏ జారే ఆదినారాయణ, జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ పసుపులేటి వీరబాబుకు వినతి పత్రాన్ని అందజేశారు. దీంతో స్పందించిన ఎంఎల్‌ఏ, గ్రంథాలయ ఛైర్మన్ త్వరలో నూతన భవనం ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారని సర్పంచ్ తెలిపారు. వినతి పత్రం అందించిన వారిలో ఆ పార్టీ నాయకులు అంకిరెడ్డి కృష్ణారెడ్డి, భోజ్యా నాయక్, తుమ్మలపల్లి సురేష్, అంతటి రామకృష్ణ, ఇమ్రాన్, బడుగు కృష్ణవేణి, అన్వర్, పాల్గొన్నారు.



# ప్రతి ఇంటా చలిజ్వర పీడితులే...

### చలి తీవ్రతతో ముసురుతున్న రోగాలు
### దారుణంగా పడిపోతున్న ఉష్ణోగ్రతలు

**ప్రజాపక్షం/జూలూరుపాడు:** దారుణంగా పడిపోతున్న ఉష్ణోగ్రతల వలన వాతావరణ మార్పులతో వైరస్ లు స్వైర విహారం చేస్తున్నాయి. జలుబు, దగ్గు, ఒళ్లు నొప్పులతో బాధపడుతున్న ప్రజలు మరికొన్ని రోజులు ఇదే పరిస్థితి ఉంటుందన్న వాతావరణశాఖ జాగ్రత్తగా ఉండాలంటున్న వైద్య నిపుణులు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలవ్యాప్తంగా చలిపులి వణికిస్తోంది. భానుడి భగభగలు మాయమై. ఎముకలు కొరికే చలి పంజా విసురుతోంది. మండల వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు కనిష్ఠ స్థాయికి పడిపోవడంతో చలి జ్వరం ఇంటింటినీ పలకరిస్తోంది. వాతావరణంలో ఒక్కసారిగా వచ్చిన ఈ మార్పులతో వైరస్‌లు స్వైరవిహారం చేస్తున్నాయి. ఫలితంగా ప్రతి ఇంటా జలుబు, దగ్గు, ఒళ్లు నొప్పుల బాధితులు కనిపిస్తున్నారు. రానున్న మరికొన్ని రోజులు ఇదే పరిస్థితి కొనసాగుతుందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. రోజురోజుకు ఉష్ణోగ్రతలు పడిపోతుండటంతో జనం చలికి వణికిపోతున్నారు. మండల వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో చలి ప్రభావం జనజీవనంపై పడుతోంది. ఉదయం 9 గంటలు దాటినా ఇళ్ల లోంచి బయటకు రావడానికే జంకే పరిస్థితి ఏర్పడింది. మరో రెండు మూడు రోజుల పాటు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. ఉదయం 9 గంటల వరకు కూడా చలి తగ్గకపోవడం, సాయంత్రం 5 గంటల నుంచే చల్ల గాలులు వీస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం వేళ రహదారులను దట్టమైన పొగ మంచు కమ్మేస్తుండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయంలో ఉష్ణోగ్రతలు మరింత తగ్గనున్నాయని వాతావరణ శాఖ పేర్కొంది. తెలంగాణ రాష్ట్రంలోని దాదాపు అన్ని జిల్లాలకూ ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. చలి నుంచి రక్షణకు ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ సూచించింది. సాధారణంగా మన శరీర ఉష్ణోగ్రతను మెదడులోని హైపోథాలమస్ గ్రంథి నియంత్రిస్తుంది. అయితే, బయట ఉష్ణోగ్రతలు 15 డిగ్రీల కంటే తక్కువకు పడిపోతే శరీరంలోని ఉష్ణ నియంత్రణ వ్యవస్థపై తీవ్ర ఒత్తిడి పడుతుంది. ప్రస్తుతం రాష్ట్రంలో పలుచోట్ల ఉష్ణోగ్రతలు 5 నుంచి 13 డిగ్రీల మధ్యే రికార్డవుతుండటంతో బాడీ మెకానిజం దెబ్బతినే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. దీనివల్ల రక్తనాళాలు కుంచించుకుపోయి బీపీ పెరగడం,



తద్వారా గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

### బయటకు వెళ్ళేటప్పుడు జాగ్రత్త

బయటకు వెళ్లేటప్పుడు స్వెట్టర్లు, మఫ్లర్లు, గ్లౌజులు తప్పనిసరిగా ఉపయోగించాలని, ముఖ్యంగా ముక్కు, చెవుల ద్వారా చలి గాలి లోపలికి వెళ్లకుండా జాగ్రత్త పడాలని పేర్కొన్నారు. శ్వాసకోశ సమస్యలున్న వారు రోజుకు రెండుసార్లు ఆవిరి పడితే ఊపిరితిత్తులకు ఉపశమనం లభిస్తుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. రోగ నిరోధక శక్తిని పెంచుకోవడానికి తాజా ఆకుకూరలు, పండ్లు, ప్రోటీన్లతో కూడిన ఆహారం తీసుకోవాలని సూచిస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు, ఆస్తమా రో గులు ఈ సమయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని, తెల్లవారుజామున, అర్థరాత్రి వేళల్లో ప్రయాణాలు మానుకోవడం ఉత్తమమని, చలి తీవ్రత పెరిగే కొద్దీ బ్యాక్టీరియా విజృంభణ కూడా పెరుగుతుంది.నిర్లక్ష్యం చేయవద్దని వైద్యఅధికారి వెంకటేశ్వర్లు సూచిస్తున్నారు.

# గ్రామాల్లో సిపిఐ జెండాల రెపరెపలు

### టపాసులు పేల్చి 101కి
### స్వాగతం పలికిన సిపిఐ శ్రేణులు

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మండలంలోని ఊరు,వాడలలో సిపిఐ శతాబ్ది ఉ త్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. 100వసంతాలను పూర్తి చేసుకొని 101లోకి అడుగెడుతున్న తరుణానికి ఘన స్వాగతం పలికారు.కామంచికల్, దారేడు, పడమటితండా, గూడూరుపాడు, పల్లెగూడెం, కస్నాతండా,ఆరెకోడు, ఆరెకోడుతండా, చింతపల్లి, పొన్నెకల్లు, మద్దులపల్లి, వరంగల్‌క్రాస్‌రోడ్, ఏ దులాపురం, ముత్తగూడెం, గొల్లగూడెం, పెద్దతండాతో పాటు సిపిఐ శాఖలలో అరుణ పతాకాలను ఆవిష్కరించారు. ఏర్పాటు చేసిన అరుణపతాకాలను ముత్తగూడెంలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిష న్ చైర్మన్ మొహ్మద్ మౌలానా, వరంగల్‌క్రాస్‌రోడ్‌లో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, ఏదులాపురంలో సిపిఐ సీనియర్ నాయకుడు వెంపటి కృష్ణమూర్తి, గూడూరుపాడులో సర్పంచ్ పుచ్చకాయల శ్రీదేవి కమాలకర్, ఆయా శాఖలలో సెక్రటరీలు జెండాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాలలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సిద్దినేని కర్ణకుమార్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పుచ్చకాయల కమలాకర్, అజ్మీరా రామ్మూర్తి, మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి, సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఉ న్నం రంగారావు,పగీళ్ల వీరభద్రం, వెంపటి సురేంద ర్, మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, మండల స మితి సభ్యులు, శాఖ సెక్రటరీలు, యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.



## ప్రజలు మెచ్చేలా పల్లెపాలన : బాగం

### సిపిఐ సర్పంచ్‌లకు ఘన సన్మానం



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ప్రజలు మెచ్చేలా పల్లె పాలన ఉండాలని, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సిపిఐ ప్రజా ప్రతినిధులు పని చేయాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు కోరారు. సిపిఐ పక్షాన గెలిచిన గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లను శుక్రవారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో ఘనంగా సన్మానించారు.తమ, పర బేధం లేకుండా అన్ని వర్గాల ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కరించాలన్నారు. గ్రామాల అభివృద్ధితో పాటు పల్లెల్లో ప్రశాంతతను కాపాడాలని, గ్రామానికి కమ్యూనిస్టు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు, మండల కార్యదర్శులు, ఆయా గ్రామాల పార్టీ నాయకులు హాజరయ్యారు.

## అమ్మవారిని దర్శించుకున్న మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/ములకలపల్లి:** ములకలపల్లి మండలంలోని నరసాపురం గ్రా మంలో వేంచేసి ఉన్న కోటమ్మ అమ్మవారిని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మం త్రి సీతక్క శుక్రవారం దర్శించుకున్నారు.ఆలయం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. ఆలయం నుండి గ్రామం వరకు రోడ్డును ఏర్పాటు చేపిస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ కుంజా వినోద్, నాయకులు అడపా నాగేశ్వరరావు, పామర్తి వెంకటేశ్వరరావు, కారం సుధీర్, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## చరిత్రాత్మకమైన పార్టీ సిపిఐ

### సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** భారతదేశంలో 100సంవత్సరాల చరిత్ర కలిగిన ఏకైక రాజకీయ పార్టీ సిపిఐ అని జిల్లా కార్యదర్శి దండి సురేష్ అన్నారు. శుక్రవారం ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని వంరగల్‌క్రాస్‌రోడ్‌లోని డిబిఆర్ చౌరస్తాలో గల ఫైలాన్ వద్ద ఏర్పాటు చేసిన అరుణ పతాకాన్ని ఆయన ఆవిష్కరించి శతాబ్ది ఉత్సవాలను ప్రారంభించారు. తొలుత అక్కడ ఏర్పాటు చేసిన కేక్‌ను మహిళా సంఘం జిల్లా నాయకులరాలు ఓరుగంటి ప్రమీల కట్ చేశారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సభలో దండి మాట్లాడారు.రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో డిసెంబర్ 26న నిర్వహించాల్సిన శతాబ్ది ఉత్సవాలు వాయిదాపడ్డాయన్నారు. ఆ వేడుకలను జనవరి 18న ఖమ్మం నగరంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కావున ఊరు, వాడల నుంచి కుటుంబాలుగా తరలివెళ్లి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కమ్యూనిస్టు నేతలు తరలిరానున్నారని, 5లక్షల మందితో కన్నుల పండుగగా జరగనుందన్నారు. వందేళ్ల ఈ సుదీర్ఘకాలంలో సిపిఐ చేసిన పోరాటాలు, సాధించిన హ క్కులు ప్రజలకు తెలియజేయాలన్నారు. అలాగే నేటి యువతారానికి సైతం సిపిఐ చరిత్రను వివరించాలన్నారు. ఇందుకోసం ప్రతి కామ్రేడ్ కంకణబద్ధులై ము మ్మర




ప్రచారం చేయాలని సూచించారు. అనంతరం ఓరుగంటి శేషగిరిప్రమీల దంపతులు వేడుకలకు విరాళంగా అందించనున్న నగదను అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు వెంపటి సురేందర్, చెరుకుపల్లి భాస్కర్, సిపిఐ శాఖ, డివిజన్ సెక్రటరీలు గూడా బాబురెడ్డి, కొనకటి కృష్ణారెడ్డి, ధరావత్ కృష్ణ, దొంతగాని వెంకన్న, మేళ్లచెర్వు రవి, వెంపటి రాము, లగిశెట్టి రమేష్, యువజన సంఘం నాయకులు ఘనపారపు ఉపేందర్, మిరయాల నరుణ్‌తేజ్, మామిడాల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## యూరియా కోసం రైతుల ఇబ్బందులు

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** వ్యవసాయ సాగు అవసరాలకు అనుగుణంగా యూరియా అందుబాటులో లేకపోవడంతో రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో రైతులు మొక్కజొన్న, కూరగాయలు ఇతరత్రా పంటలను అధికంగా సాగు చేస్తుండడంతో రైతులు యూరియా కోసం పడిగాపులు కాస్తున్నారు. సహకార సంఘాలకు వచ్చిన కొద్దిపాటి యూరియాను రైతులకు అందిస్తున్నప్పటికీ సరిపోవడం లేదని రైతులు వాపోతున్నారు. శుక్రవారం మండలంలోని వెంకటాయపాలెం, రఘునాథపాలెం, మంచుకొండ సొసైటీల ద్వారా యూరియా పంపిణీ చేపట్టారు. వ్యవసాయ శాఖాధికారులు కూపన్లు జారీ చేసిన రైతులకు సొసైటీల వద్ద రెండు బస్తాల చొప్పున యూరియాను పంపిణీ చేశారు. మంచుకొండ సొసైటీ పరిధిలో ఎక్కువ గ్రామాలు, రైతులు ఉండడంతో సొసైటీకి వచ్చిన 445 యూరియా బస్తాలు సరిపోక రైతులు ఇబ్బందులు పడ్డారు. రైతులకు ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి ఉమమహేశ్వరరెడ్డి తెలిపారు. యూ రియా అందని రైతులకు రఘునాథపాలెం సొసైటీ, ఈర్లపుడి సెంటర్‌లో పంపిణీకి చర్యలు తీసుకుంటామన్నారు.



## పార్టీ కార్యాలయానికి విద్యుత్ దీపాలతో ముస్తాబు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** భారత కమ్యూనిస్టు పార్టీ శత వసంతాలను పురస్కరించుకుని పార్టీ కార్యాలయాన్ని విద్యుత్ దీప కాంతులతో అందంగా ముస్తాబు చేశారు. శుక్రవారం ఖమ్మం నగరంలోని సిపిఐ ఖానాపురం హవేలీ శాఖ పార్టీ కార్యాలయాన్ని శత వసంతాలను పురస్కరించుకుని హవేలీ శాఖ కార్యదర్శి గాంధీ ఆధ్వర్యంలో కార్యాలయానికి రంగులు వేయించి విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. శత వసంతాల సందర్భంగా జనవరి 18న జరిగే సభను జయప్రదం చేయాలని గాంధీ కోరారు.

## ఫుట్‌బాల్ క్రీడాకారిణి కిరణ్మయికి ఆర్థిక చేయూత

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** అండర్ 19 ఫుట్‌బాల్ జాతీయ జట్టుకు ఎంపికైన మరికంటి కిరణ్మయికి కాంగ్రెస్ నాయకులు ఆర్థిక చేయూతనందించారు. మండల పరిధిలోని వి.వెంకటాయపాలెం గ్రామానికి చెందిన మరికంటి కిరణ్మయి జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. మణిపూర్ రాష్ట్రంలో జనవరిలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో కిరణ్మయి పాల్గొననుంది. మణిపూర్ వెళ్లేందుకు అవసరమైన ప్రయాణ ఖర్చుల కోసం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు రూ. 22వేల ఆర్థిక సహాయాన్ని శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కాపా ఆదినారాయణ మాట్లాడుతూ గ్రామానికి చెందిన కిరణ్మయి ఫుట్‌బాల్‌లో ప్రతిభ చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. జాతీయ స్థాయిలో రాణించి గ్రామానికి, జిల్లాకు పేరు తీసుకు రావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కిరణ్మయిని పలువురు అభినందించారు.

**క్రీడాకారులకు ఫుట్‌బాల్ కిట్లు పంపిణీ :** వి.వెంకటాయపాలెం గ్రామంలోని పాఠశాల ఫుట్‌బాల్ క్రీడాకారులకు పుల్లఖండ పురుషోత్తం సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఫుట్‌బాల్ కిట్లను శుక్రవారం పంపిణీ చేశారు. మొత్తం 22 మంది క్రీడాకారులకు ఈ కిట్లను అందజేశారు. ఫుట్‌బాల్ కిట్లను అందించిన ట్రస్టు నిర్వాహకులకు క్రీడాకారులు, స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.అన్నం ఫౌండేషన్ నిర్వాహకులు అ న్నం శ్రీనివాసరావు, పుల్లఖండ సత్యనారాయణ మూర్తి, మైలవరపు నాగేశ్వరరావు, ఫుట్‌బాల్ కోచ్ కళ్యాణపు ఆదర్శ్, కాంగ్రెస్ నాయకులు కిలారు వెంకట రమణ, బానోత్ కిషోర్, ముత్తయ్య, మూడు శంకర్, సీనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారులు సాయిరాం, గోపిచంద్, వీరబాబు, కోటి పాల్గొన్నారు.



## గల్లంతైన విద్యార్థి మృతదేహం లభ్యం

**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** సాగర్‌కాల్వలో ఈతకు దిగి గల్లంతైన విద్యార్థి యడ్ల శశాంక్ మృతదేహాన్ని గురువారం పోలీసులు గుర్తించారు. బుధవారం ఖమ్మం వికలాంగుల కాలనీ సుల్తాన్‌నగర్‌కు చెందిన తొమ్మిదవ తరగతి వి ద్యార్థి ఎండి అబ్దుల్‌సుహాన్, యడ్ల శశాంక్, ఈశ్వర్లు ఈతకు సమీప సాగర్‌కాల్వకు వెళ్లగా సుహాన్, శశాంక్ నీటిలో దిగి ఈతకొడుతుండగా ప్రవాహంలో గల్లంతైయ్యారు. మృతదేహం లభించగా శశాంక్ ఆచూకి లభించలేదు. గాలింపుల చేపట్టిన పోలీసులకు గురువారం కొణిజర్ల లోని సాగర్ కాల్వ డిప్‌కట్ వద్ద ప్రవాహంలో కొట్టుకువచ్చిన మృతదేహాన్ని స్థానికులు గుర్తించి స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు పరిశీలించి చూడగా గల్లంతైన విద్యార్థి శంశాంక్‌గా గుర్తించి ఖమ్మం టూటౌన్ పోలీసుల కు సమాచారం అందించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్ర భుత్వ ఆస్పత్రికి తరలించారు. తల్లితండ్రులకు సమాచారం ఇచ్చి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. ఇద్దరు విద్యార్థుల మృతితో వారి కుటుంబాలతో రోదనలతో కాలనీలో విషదచాయలు అలముకున్నాయి.

## మున్నేరులో బాలిక మృతదేహం

**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** నగరంలోని ప్రకాశ్‌నగర్ మున్నీరులో శుక్రవారం బాలిక మృతదేహం లభ్యమైంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం రూరల్ మండలం పరిధిలోని ఇటుక బట్టిలో పనిచేసే ఒడిశా రాష్ట్రానికి చెందిన వలసకూలి జమామి(17) గా పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలిచారు. ఆ త్మహత్య లేక ప్రమాదవశాత్తు మున్నేరులో పడి మృతిచెందిదా అనే కో ణంలో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# స్థానికం

REGIONAL NEWS

వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్

## ఉపాధి హామీ చట్టం మార్పు



**ప్రజాపక్షం /జనగామ:** కార్పొరేట్ కంపెనీల లాభాల కోసమే ఉపాధి హామీ చట్టం మార్పులు, పేరు మార్పు చేశారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి అబ్బాస్ అన్నారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సింగారపు రమేష్ అధ్యక్షతన పార్టీ సమావేశం జరిగింది. కార్పొరేట్ శక్తుల కోసం చట్టాన్ని నీరుగార్చడం సరియైంది కాదన్నారు. దేశంలో కమ్యూనిస్టు పార్టీల ప్రజా పోరాటాల ఫలితంగా యూపిఏ ప్రభుత్వం అప్పటి ప్రధానమంత్రి సారథ్యంలో ఉపాధి హామీ చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, కార్యదర్శివర్గ సభ్యులు సాంబరాజు యాదగిరి, రాపర్తి రాజు, ఇర్రి ఆహాల్య, రాపర్తి సోమయ్య, బొట్ల శేఖర్, జిల్లా కమిటీ సభ్యులు బూడిద గోపి, సుంచు విజేందర్, భూక్య చందునాయక్, మునిగల రమేష్, చిట్యాల సోమన్న, బోడ నరేందర్, ఆజారుద్దీన్ పాల్గొన్నారు.

## సిపిఐ 100 సంవత్సరాల వేడుకలు



**ప్రజాపక్షం/ఎల్కతుర్తి :** ఎల్కతుర్తి మండల కేంద్రం అంబేద్కర్ సెంటర్లో ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సిపిఐ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఆదరి శ్రీనివాస్ హాజరై జెండా ఆవిష్క రించినారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం సాగించి, గులాం బతుకులు వద్దని, గుత్పలందుకోమని, బానిస బతుకులు వద్దని బంధూకై పేలి, రజాకార్లతో నాడు రణం చేసి గెలిచింది సీపీఐ అని, నైజాంను పైజామా ఊడిపోయే వరకు తరిమి, తరిమి కొట్టింది రెపరెపలాడే ఎర్రని జెండా అని అన్నారు. సిపిఐ హనుమకొండ జిల్లా కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ ఊట్కూరి రాములు, కర్రే లక్ష్మ ణ్, సిపిఐ ఎల్కతుర్తి మండల కార్యదర్శి శనిగరపు రాజ్ కుమార్, డిహెచ్‌పిఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు నిమ్మల మనోహర్ , మండల సమితి సభ్యులు తండ మొండయ్య, వేముల కృష్ణకర్, మల్లయ్య, మర్రిపల్లి తిరుమల, పిన్ రెడ్డి మోహన్ రెడ్డి, ఎంజాల పోచయ్య, భాషిక ఐలయ్య, తులసి రామ్, తదితరులు పాల్గొన్నారు.

**కేసముద్రంలో...**



కేసముద్రం మండల కేంద్రంలో శుక్రవారం సిపిఐ శతజయంతి ఉత్సవాలను సిపిఐ మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిబా పూలే సెంటర్ నుండి అంబేద్కర్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయ సారథి ముఖ్య అతిథిగా హాజరై ర్యాలీ అనంతరం సిపిఐ జెండాను ఆవిష్కరించారు. సిపిఐ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ 1925 డిసెంబర్ 26న కాన్పూర్లో ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఐ ఆవిర్భవించిందన్నారు. బ్రిటీష్ పాలకుల నుంచి భారత దేశాన్ని విముక్తి చేయుటకు, దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని పోరాటాలు, త్యాగాలు చేసి ఎన్నో కేసులను ఎదుర్కొందన్నారు. సిపిఐ మండల కన్వీనర్ చొప్పరి శేఖర్, సహాయ కార్యదర్శి మంద భాస్కర్, నాయకులు పూజారి రవి, చొప్పరి వెంకటయ్య, దాసరి సాయిలు, మడత నారాయణ, జన్ను రాజేందర్, నలమాస వీరస్వామి, కర్ణాకర్, రాజబోయిన శ్రీను, తాటికాయల యాకయ్య, సింగని బిక్షపతి, మంచాల శ్రీను, మంగి సురేష్, రాజు, నరముల యాకయ్య, పాల్గొన్నారు.

**మహబూబాబాద్‌లో...**



భారత గడ్డపై ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతర రాజీ లేని పోరాటాలలో శతవసంతాలు పూర్తి చేసుకున్న సిపిఐ పోరాట స్ఫూర్తినీ కార్యకర్తలు కొనసాగించాలని పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డిపిలుపునిచ్చారు. సిపిఐ వందేళ్ల ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ కార్యాలయం నుండి ప్రదర్శనగా గుడి సెంటర్లోని కార్మిక విగ్రహాల దగ్గరకు చేరుకొని శతాబ్ది ఉత్సవాల కేక్ కట్ చేసి ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ భారత గడ్డపై వందేళ్ళ సిపిఐ కార్మిక, రైతు ,మహిళా ,విద్యార్థి యువకుల హక్కుల కోసం నిరంతర పోరాటాలు కొనసాగించి, అసమానతలు, వివక్షతకు వ్యతిరేకంగా , ఆదివాసీల హక్కుల కోసం చైతన్యం నింపి, స్ఫూర్తిదాయకమైన పోరాటాలు నిర్వహించిన ఏకైక పార్టీ సిపిఐ అన్నారు. అరుణ పతాకాన్ని సిపిఐ సీనియర్ నాయకులు బుడమ వెంకన్న ఎగురవేయగా, సిపిఐ టౌన్ కార్యదర్శి తురక రమేష్, మండల సహాయ కార్యదర్శి బుర్ర సమ్మయ్య, దూది కట్ల సారయ్య, కన్నే వెంకన్న, బొల్లం ఉప్పలయ్య, కలగూర నాగరాజు, దొంతు రాంమ్మూర్తి ,బోల్లు వెంకన్న, సాయి కమార్, నాగేశ్వరరావు, జన్ను, అనిల్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

**వందేళ్ళ చరిత్రకు వందనం: సిపిఐ బయ్యారం మండల కార్యదర్శి శ్రీనివాస్**

భారతదేశంలో శ్రామిక పీడిత వర్గాల విముక్తి కోసం, సోషలిజం స్థాపన లక్ష్యంతో ఆవిర్భవించిన భారతకమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) వందేళ్ళ చరిత్రకు వందనమని సిపిఐ బయ్యారం మండల కార్యదర్శి సారిక శ్రీనివాస్ అనాన్నరు. సిపిఐ వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సంద్భంగా మండల కేంద్రంలో కలింగరెడ్డి జెండా ఎగురవేశారు.ఈ కార్యక్రమంలో గంగరబోయిన రాజు నాదెండ్ల పద్మ మందనపు రాజు,బోడ కాంతి,గుగులోత్ రవి, నంద, పద్మ,రమేష్,తదితరులు పాల్గొన్నారు.

**ములుగులో...**



భారత కమ్యూనిస్టు పార్టీ అవిర్భవించి నేటికి వంద సంవత్సరాలు పూర్తి చేసుకొని నూట ఒకటవ సంవత్సరంలోకి అడుగుతున్న సందర్భంలో ములుగు జిల్లాలోని ములుగు, మల్లంపల్లి, వెంకటాపూర్, గోవిందరావు పేట, తాడ్వాయి, వెంకటాపూర్ మండల కేంద్రాలలో సిపిఐ పార్టీ ఆవిర్భావ దినోత్సవాల జెండాలు ఆవిష్కరించిం ప్రారంభించుకోవడం జరిగింది. ఈ సందర్బంగా ములుగు జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద జరిగిన 100 సంవత్సరాల జెండా ఆవిష్కరణలో పాల్గొన్న సిపిఐ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి జంపాల రవీందర్ మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 1925 డిసెంబర్ 26వ తేదీన ఆవిర్భవించిన నాటి నుండి కార్మికుల హక్కుల కోసం, వేతనాల పెంపు కోసం, సమ్మె హక్కు కోసం, సంఘాలు ఏర్పాటు చేసుకోవడం కోసం ఉపాధిహామీ చట్టం కోసం అటవీ హక్కుల చట్టం కోసం ఉద్యోగ భద్రత కోసం అనేక పోరాటాలు నిర్వహించి సాధించిన పార్టీ సిపిఐ అన్నారు. అందుకోసమే కార్మిక వర్గంలో రైతాంగం దృష్టిలో బడుగు, బలహీన వర్గాల రక్షణలో 100 సంవత్సరాలుగా కొనసాగుతూనే ఉందన్నారు. ఈ 100 సంవత్సరాలలో అనేకమైన పార్టీలు ఆవిర్భవించి నశించి పోవడం కూడా జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో లావుడ్యా రాములు, చింతపల్లి రవి, నరసయ్య, లంకలపెల్లి రవి, వీరన్న, శ్రావణ్, సాంబయ్య, జంపయ్య, శంకర్, కుమార్, ఆకాష్, నరేష్, సారంగం, కుమార్, అరవింద్, తదితరులు పాల్గొన్నారు.

# దోపిడీ రహిత సమాజమే సిపిఐ లక్ష్యం

సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు పంజాల రమేష్



**ప్రజాపక్షం / నర్సంపేట :** వంద సంవత్సరాలుగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడిన పార్టీ సిపిఐఅని, గాడ్సే గాంధీని చంపితే మోదీ గాంధీ చరిత్రనే లేకుండా చేయాలని చూస్తున్నాడని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్ అన్నారు. నర్సంపేట సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో అంబేద్కర్ సెంటర్లో పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ పతాకాన్ని ఎగురవేసి కేక్ కట్ చేసిన సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ భారతదేశంలో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ పుట్టి వంద సంవత్సరాలు ముగిసి 101లో అడుగుపెట్టిన పార్టీ వంద సంవత్సరాలుగా భారతదేశ వ్యాప్తంగా అనేక ఉద్యమాలను చేపట్టి ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడి అనేక చట్టాలను ప్రజా సమస్యల పరిష్కారం చేసిన పార్టీ సిపిఐ అన్నారు. దున్నే వాడికి భూమి కావాలని వెట్టి చాకిరి చేసే కార్మికులకు ఎనిమిది గంటల పని విధానం కావాలని అనేక కార్మిక చట్టాలను పోరాడి సాధించిన పార్టీ సిపిఐ అనేక పోరాటాలు చేసి సాధించిన చట్టాలను బిజెపి మోదీ ప్రభుత్వం ఎత్తివేసి రైతు నల్ల చట్టాలను 44 కార్మిక చట్టాలను ఎత్తివేస్తూ నాలుగు చట్టాలుగా చేస్తూ రైతు కార్మిక వ్యతిరేక విధానలు అవలంబిస్తూ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని ఎత్తివేయాలని చూస్తున్నారని, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి లేక కరువు కాటకాల్లో రైతులు ప్రజలు పట్టణ ప్రాంతాలకు వలస పోకుండా పల్లె సీమలు పచ్చగా ఉండాలని, యుపిఎ ప్రభుత్వం 2005లో కమ్యూనిస్టు పార్టీ ఎంపిలు 65 మంది ఉండగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని తీసుకురావడానికి పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించడం జరిగిందన్నారు. అప్పటి నుండి గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మూడు నెలల పాటు ఉపాధి కరువు పని లభిస్తాఉన్నదని, అలాంటి ఉపాధి పనిని మహాత్మా గాంధీ పేరు ఉన్నదని ఆయన పేరును తొలగించడం కోసం ఉపాధి హామీ చట్టాన్ని మార్చడానికి నరేంద్ర మోదీ ప్రభుత్వం కుట్ర చేస్తుందని ఇలాంటి కుట్రలను ప్రజలు క్షమించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు సక్రమంగా అమలు కావడం లేదని ఇప్పటికైనా వాటిపై ప్రభుత్వం శ్రద్ధ చూపి అమలు చేయాలని లేకుంటే రానున్న రోజుల్లో ప్రజలు ప్రజా పోరాటాల్లోకి సిద్ధమై ప్రభుత్వాలకు తగిన గుణపాఠం చెబుతారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అయితే యాకోబు, అక్కపెల్లి రమేష్, జిల్లా సమితి సభ్యులు మియాపురం గోవర్ధన్, గుంపెల్లి మునీశ్వర్, సిపిఐ నాయకులు బాధ బోయిన యాదగిరి, ఇల్లందులో సాంబయ్య, పిట్టల సతీష్, గద్దం నాగరాజు, మాతంగి సురేష్, కమ్మల సోములు, శ్రీకళ, గుంటి ఉపేంద్ర, చిలుక స్వప్న తదితరులు పాల్గొన్నారు.

## తోట విజయ్ సేవలు మరువలేనివి

సిపిఐ జిల్లా కార్యదర్శి బి. విజయ సారథి



**ప్రజాపక్షం/మహబూబాబాద్:** సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు జన సేవాదళ్ స్టేట్ ఇన్స్ ట్రక్టర్ అమరజీవి తోట విజయ్ నాలుగవ వర్ధంతి కార్యక్రమం స్థానిక కంకర బోర్డ్‌లోని తోట విజయ్ స్తూపం వద్ద నేడు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయసారథి అమరజీవి తోట విజయ్ స్థూపానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు అనంతరి ఆయన మాట్లాడుతూ మానుకోట ప్రాంతంలో తోట విజయ్ సేవలు మరువలేనివి అన్నారు. ఈ ప్రాంతంలో అనేక ఉద్యమాలలో పాల్గొని యువ నాయకుడుగా ఉమ్మడి రాష్ట్రంలో కేరళ రాష్ట్రంలో ఎంతోమంది యువ జన సేన ద్వారా శిక్షణ ఇచ్చాడని తెలిపారు. అఖిల భారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్‌లో పనిచేసే అనేక యువజన ఉద్యమాలు చేశాడని, ఈ ప్రాంతంలో అనేక ఉద్యమాలు తెలంగాణ ఉద్యమం మరియు జిల్లా ఉద్యమం భూ పోరాటాలు ప్రజా పోరాటాలులలో తన వంతు పాత్ర పోషించి తనకంటూ పేరు సంపాదించుకున్న గొప్ప వ్యక్తి తోట విజయ్ అని ఆయన కొనియాడారు. సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారథి రెడ్డి, తోట విజయ్ సతీమణి తోట రాజకుమారి, సోదరుడు తోట రమేష్, తల్లి ఎల్లమ్మ, కుటుంబ సభ్యులు, సిపిఐ నాయకులు పెరుగు కుమార్, దేశపల్లి నవీన్ ,చింతకుంట్ల వెంకన్న, కట్లోజు పాండురంగాచారి, మామిళ్ల సాంబలక్ష్మి , తండ సందీప్, వీరవెల్లి రవి, వెలుగు శ్రవణ్ ,ఎండి ఫాతిమా, భానోత్ లింగ్య నాయక్, ఆబోతు అశోక్, జలగం ప్రవీణ్ ,కేదాసు రమేష్ ,అజ్మీర వేణు, వంకాయలపాటి చిరంజీవి, ఎండి మహమూద్, గారా రవిచంద్ర బోస్ తదితరులు పాల్గొన్నారు.

## హక్కులను సాధించిపెట్టిన ఘన చరిత్ర సిపిఐదే

సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి



**ప్రజాపక్షం/హసన్‌పర్తి :** దేశంలో వీరోచిత పోరాటాల చరిత్ర కలిగి అసమాన త్యాగాలు చేసి నిర్బంధాలను, జైళ్లను, రాజా ద్రోహ కేసులను ఎదుర్కొని భారత కమ్యూనిస్టు పార్టీ దేశ ప్రజలకి ప్రజాస్వామిక, ఆర్థిక, రాజకీయ, సాంఘిక హక్కుల్ని సాధించి పెట్టిన చరిత్ర ఉందని భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి తెలిపారు. హాసన్ పర్తి మండలం మడి పెల్లి, జయగిరి, అనంత సాగర్ గ్రామాలలో సిపిఐ శత వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఎర్రజెండాలను ఎగురవేశారు. ఈ సందర్భం గా నేదునూరి జ్యోతి మాట్లాడుతూ సిపిఐ శత వసంత ఉత్సవాల సందర్భంగా జనవరి 18, 2026 ఖమ్మంలో జరుగు భారత కమ్యూనిస్టు పార్టీ బహిరంగ స భను అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. దేశ నలుమూలల నుండి 5 లక్ష ల మంది ప్రజలు, 45 దేశాల నుండి కమ్యూనిస్టు నా యకులు, లౌకిక, వామపక్ష పార్టీల నేతలు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బికేఎంయు జాతీయ నాయకులు మోతే లింగారెడ్డి, హనుమకొండ జిల్లా సిపిఐ కార్యవర్గ సభ్యులు నేదునూరి రాజమౌళి, జయగిరి గ్రామ శాఖ కార్యదర్శి గడ్డం చంద్రమౌళి, మడిపల్లి సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి జక్కుల అశోక్, సాంబరాజు, అనంతసాగర్ కార్యదర్శి గిన్నారపు రాజు, సీనియర్ సిపిఐ నాయకులు నాంపల్లి లక్ష్మ య్య, నేదునూరి రామచందర్, దుస్సా వెంకటేశ్వర్లు, ముద్రబోయిన రాజు, పూరి రాము, బుర్ర వెంకటేష్ గౌడ్, ప్రవీణ్ కుమార్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి



**ప్రజాపక్షం/ఆత్మకూరు :** నమ్మకం విశ్వాసం ఉంటేనే సర్పంచ్‌గా రెం డవసారి ప్రజలు ఎన్నుకొంటారని, ప్రజలకు బాధ్యతాయుతమైన పాలన అందిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. ఆత్మకూరు గ్రామ సర్పంచ్ పర్వతగిరి మహేశ్వరి రాజు, వార్డు సభ్యుల ప్రమాణ స్వీకారానికి ముఖ్యఅతిథిగా పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం వారికి ఎమ్మెల్యే శాలువాలతో ఘనంగా సన్మానించా రు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు ప్రజలకు బాధ్యతాయుతమైన పాలన అందిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. గ్రామాభివృద్ధి లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభు త్వం కృషి చేస్తుందని, ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగడమే కాంగ్రెస్ ప్రజా ప్ర భుత్వ లక్ష్యం అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ సంక్షేమ పథకాలే సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలన్నారు. ఎన్నికల్లో ఆత్మకూరులో డబ్బులకు ప్రాధాన్యత ఇవ్వకుండా మంచి వ్యక్తికి ప్రాధాన్యత ఇచ్చినారని,ఎన్నికల్లో డబ్బులే ప్రాధాన్యత అని తగ్గిన రోజే ప్రజాస్వామ్యంలో అర్థం ఉంటుందని అన్నారు. నమ్మకం విశ్వాసం పొందిన వ్యక్తులకు మాత్రమే సర్పంచ్‌గారెండవసారి ప్రజలు ఎన్నుకొంటారని, రాజుకు గ్రామ ప్రజలపై సంపూర్ణమైన విశ్వాసం ఉందన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ పాలకులు ప్రజాల ఆమోదం పొందిన నాయకులను అణచివేసే చర్యలు చేస్తూ కక్ష సాధింపు చర్యలకు పాల్పడ్డారని, తాను రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ఆత్మకూరు అభివృద్ధికి అన్ని విధాలు గా సహకరిస్తానని, గ్రామంలోని సమస్యలను ప్రాధాన్యత క్రమంలోదశలవారీగాపరిష్కారానికికృషిచేస్తానని అన్నారు.

# అత్యవసరమైన ప్రతి చోటా అభివృద్ధి పనులు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నాయిని

**ప్రజాపక్షం/హనుమకొండ :** అభివృద్ధి పనులను ఎబిసి కేటగిరీలలో అత్యవసరం ఉన్న చోట నుంచి తొలి ప్రాధాన్యతగా పనులను చేస్తున్నామని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం రోజున ఎమ్మెల్యే 60 డివిజన్‌లోని టీచర్స్ కాలనీ, వాజ్‌పాల్ కాలనీలో రూ.65లక్షలతో రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో 60 డివిజన్‌లలో సూమర్ రూ.5 కోట్లపై చిలుకు నిధులు కేటాయించడం జరిగిందన్నారు. గతంలో కాంగ్రెస్ కార్పొరేటర్లకు రూ.50 లక్షల నిధులను కేటాయించిన దాఖలాలు కూడా లేవని అన్నారు.ఇప్పటికే నటనలో ప్రధాన సమస్యలుగా ఉన్న రోడ్లను వేయడం జరిగిందన్నారు. రానున్న ఏడాదికాలంలో దాదాపు అంతర్గత రోడ్ల నిర్మాణ పనులను పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు.అభివృద్ధి విషయంలో నాణ్యత ప్రమాణాలు పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.వరంగల్ మహా నగరానికి తలమానికంగా ఉండేలా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను ముఖ్యమంత్రి చేతుల మీదుగా వచ్చే నెలలో ప్రారంభం జరగనున్నదని తెలిపారు. మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ త్వరలోనే పూర్తి చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.మేడారం జాతర దృష్టిలో పెట్టుకుని కాజీపేట ఆర్ఓబి పనులను ప్రజా రవాణాకు అందించేలా ఏర్పాట్లు చేస్తున్నామని కేంద్రం అధీనంలో ఉన్న రైల్వే వారిని కోరడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ అభినవ్,మాజీ కార్పొరేటర్ నాగరాజు,డివిజన్ అధ్యక్షులు పున్నం,నాయకులు సమ్మయ్య,శ్రీనివాస్,యుగేందర్ ,కాలనీ వాసులు,అధికారులు తదితరులు పాల్గొన్నారు.



**ప్రజా ప్రభుత్వంలో అన్ని వర్గాలకు న్యాయం : ఎన్నికల హామీలను అమలు చేస్తున్నాం : ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**

**హనుమకొండ :** ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని, ప్రజా ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు సమాన న్యాయం జరుగుతుందని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి స్పష్టం చేశారు.శుక్రవారం హనుమకొండ 54 వ డివిజన్ పోచమ్మకుంట ప్రాంతంలో విశ్వ బ్రాహ్మణ, సగర (ఉప్పర) కుల సంఘాలకు కమ్యూనిటీ హాల్‌ల నిర్మాణం కోసం ప్రభుత్వం మంజూరు చే సిన భూ కేటాయింపు పత్రాలను ఆయా కుల సంఘాల పెద్దలకు ఎమ్మెల్యే నాయిని అందజేశారు. ముందుగా కేటాయించిన స్థలాలను ఎమ్మెల్యే పరిశీలించారు. స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశం లో మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో పోచమ్మకుంట ప్రజలు పార్టీలకు అతీతంగా తనపై నమ్మకంతో ఓటు వేశారని గుర్తు చేశారు. విశ్వ బ్రాహ్మణ, సగర కుల సంఘాల నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.


## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో జనగామ ముందంజ



**ప్రజాపక్షం / జనగామ :** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో జనగామ జిల్లా ముందంజలో ఉందని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పేదల కలలు సాకారం అవుతున్నాయని, క్షేత్రస్థాయిలో స్పష్టమైన పురోగతి ఉందన్నారు. నిరుపేదలకు నిలువ నీడ కల్పించాలనే ఉద్దేశ్యంలో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టగా లబ్ధిదారులు అందరు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారని మంజూరైన ప్రతి ఇళ్లు వివిధ దశల్లో ఉందన్నారు. మంజూరైన ఇళ్లను త్వరగా గ్రౌండింగ్ చేస్తూ రాష్ట్ర స్థాయిలోనే ప్రథమ వరుసలో ఉన్నామన్నారు. ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం సైతం ఎంతో పకడ్బందిగా అమలు అవుతుందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై రివ్యూలు చేయడం జరుగుతుందని, నిత్యం పర్యవేక్షణల మూలంగా ముందుకు సాగడం జరుగుతుందన్నారు. నిర్దేశిత లక్ష్యాల మేరకు మండల స్పెషల్ అధికారులు, తహశీల్దార్లు, సంబందిత అధికారులను ఎప్పటికీ అప్పుడు పరిశీలనకు పంపడం మూలంగా ఇళ్ల నిర్మాణం శరవేగంగా ముందుకు సాగుతుందన్నారు.

## రైతుల అభివృద్ధే ధ్యేయం

నీటిని విడుదల చేసిన ఎమ్మెల్యే గండ్ర సత్తన్న



**ప్రజాపక్షం/గణపురం:** రైతుల అభివృద్ధే నా ధ్యేయమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శుక్రవారం గణప సముద్రం చెరువు నుండి ఐబి అధికారులతో కలిసి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు త్వరగా నాట్లు వేసుకునేందుకు ముందస్తుగా నీటిని విడుదల చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. రైతులు త్వరగా వరి నారు పోసుకొని నాట్లు వేసుకోవాలని కోరారు రైతులు ముందస్తు పంటలు వేసుకోవడం వల్ల సకాలంలో పంటలు చేతికి వస్తాయన్నారు. గణప సముద్రం చెరువును రిజర్వాయర్‌గా చేసి తాగునీరు. సాగునీరు కు ఇబ్బంది లేకుండా చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఐబిఇఇ బసవ ప్రసాద్ గౌడ్, తహసీల్దార్ సత్యనారాయణ స్వామి, ఎంపిడిఒ ఎల్ భాస్కర్, సర్పంచులు కట్కూరి రాధిక శ్రీనివాస్, కావాటి రజిత రవీందర్, ఇంజపల్లి శ్రీనివాస్, పూజారి రాజేందర్, అంబాల లక్ష్మి సాంబయ్య, ఎలుకపల్లి రమేష్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రేపాక రాజేందర్, విడిదినేని శ్రీలత అశోక్, ఉప సర్పంచ్ ఓరుగంటి కృష్ణ, ఐబిఎఇ సమ్మా రావు, మహేందర్,నాయకులు అధికారులు పాల్గొన్నారు.

## సిటీ లారీ ట్రాన్స్‌పోర్ట్ హమాలీల రేట్ల పెంపు

ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు అజయసారథిరెడ్డి నేతృత్వంలో చర్చలు సఫలం



**ప్రజాపక్షం/మహబూబాబాద్:** సిటి లారీ ట్రాన్స్‌పోర్ట్ హమాలీల రేట్ల పెంపు విషయంపై యజమానులతో ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు బి.అజయసారథి రెడ్డి నేతృత్వంలో జరిపిన చర్చలు సఫలమయ్యాయి. సిటి లారీ ట్రాన్స్‌పోర్ట్ హమాలీల రేట్లు పెంపుకు అంగీకారం కుదిరింది. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని సిటీ లారీ ట్రాన్స్ పోర్ట్ హమాలీల (ఎఐటియుసి అనుబంధం) రేట్ల కోసం జిల్లా కేంద్రంలోని సిమెంట్ మరియు ఫర్టిలైజర్స్ యజమానులతో ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడుఅజయ్ సారథి రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం చర్చలు నిర్వహించారు. ఈ సందర్భంగా యజమానులతో సుదీర్ఘంగా చర్చలు కొనసాగించారు. ఈ సందర్భంగా యజమానులతో ఎఐటియుసి నేతల చర్చలు సఫలం కాగా వెంటనే రేట్లు పెంచడం జరిగింది. ఈ సందర్భంగా బి అజయ్ సారథి రెడ్డి మాట్లాడుతూ మానుకోట జిల్లా కేంద్రంలో ఇటు కార్మికులకు అండగా ఎఐటియుసి నిలబడుతుందన్నారు. యజమానులు ప్రతాపని పాండురంగయ్య, వేమిశెట్టి సోమయ్య, శ్రీరంగం మురళి, చంద్రయ్య, ఉపేందట్,శ్రీనివాస్, లక్ష్మి నారాయణ, ప్రతాపని సత్యనారాయణ, మురళి, మాలే రవి, ఉపేందర్, చౌడవరపు శేషగిరి,వేమిశెట్టి వెంకన్న, భాస్కర్ ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి రేషపల్లి నవీన్, పెరుగు కుమార్,పాల్గొన్నారు.

## చైనా మాంజా విక్రయించినా.. వినియోగించినా.. జైలు తప్పదు

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్




**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** పక్షుల తో పాటు, ప్రజలకు ప్రమాదకరంగా మారిన చైనా మాంజాను ఎవరైనా విక్రయించినా, వినియోగించినా.. వారి పట్ల కఠినంగా వ్యవహారిస్తూ చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వరంగల్ పోలీస్ కమిషనర్ హెచ్చరించారు. సంక్రాతి పండుగ సమిపిస్తున్న వేళ యువత గాలి పటాలను ఎగురవేసేందుకు సిద్ధమవుతున్న తరుణంలో యువత అధికంగా చైనా మాంజా ఉపయోగించి గాలి పటాలను ఎగుర వేయడం ఆసక్తి కనబరుస్తారని, కాని యువత వినియోగించే చైనా మాంజా ( సింథటిక్ దారం, గాజు పొడి) చాలా ప్రమాదకమని, ఈ దారాన్ని ఉపయోగించడం ద్వారా పక్షుల గొంతు, రెక్కలు తెగిపోవడం, మనుషులకు గాయాలు కావడం జరుగుతుందన్నారు.ఎవరైనా చైనా మాంజా విక్రయించిన వినియోగించిన ఏడేళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉంది అని, ఇది చట్టవిరుద్ధమని, ఈ చైనా మాంజా నియంత్రణ కై ప్రత్యేక చేపట్టడం జరుగుతుందని, ఇందులో భాగంగానే టాస్క్ ఫోర్స్ పోలీసులు హన్మకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని కుమార్ పల్లి ప్రాంతం ఆనంద్ అనే వ్యక్తి ఇంటిపై దాడి చేసి సూమారు 2లక్షల 3వేల రూపాయల చైనా మాంజాను స్వాధీనం చేసుకోవడం జరిగిందని. ఎవరైనా చైనా మాంజా విక్రయాలకు పాల్పడితే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని పోలీస్ కమిషనర్ ప్రజలకు సూచించారు.

# కమ్యూనిజం అజేయం..అజరామరం

## ఘనంగా సిపిఐ వందేళ్ల ఉత్సవాలు


భద్రాద్రి కొత్తగూడెంలో...


మహబూబాబాద్‌లో..

**ప్రజాపక్షం/హనుమకొండ :** దేశ సమగ్రత కోసం ఉద్యమిస్తున్నదని కమ్యూనిస్టులేనని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం సిపిఐ వంద సంవత్సరాల ఆవిర్భావ వేడుకలు హనుమకొండ బాలసముద్రం లోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యాలయం ఎదుట సిపిఐ పతాకాన్ని తక్కళ్లపల్లి ఎగురవేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పోతరాజు సారయ్య, పార్టీ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉట్కూరి రాములు, కర్రె లక్ష్మణ్, నేదునూరి రాజమౌళి, ఎన్. అశోక్ స్టాలిన్, మునిగాల బిక్షపతి, బాషబోయిన సంతోష్, మాలోతు శంకర్ నాయక్, కండె నర్సయ్య, యాళ్ల సంజయ్, గుంటి రాజేందర్, కొట్టె వెంకటేష్, లక్ష్మి, గిన్నారపు రోహిత్, రాము తదితరులు పాల్గొన్నారు.

**వరంగల్ :** మతోన్మాదుల మెడలు వంచే శక్తి కమ్యూనిస్టులకే ఉన్నదని సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా అన్నారు. సిపిఐ జిల్లా పార్టీ కార్యాలయం తమ్మెర భవన్‌లో సిపిఐ శత వారోత్సవాల సందర్భంగా సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా


జనగాంలో..


నల్లగొండలో..


సహాయ కార్యదర్శులు దండు లక్ష్మణ్, పనాస ప్రసాద్, నాయకులు గన్నారపు రమేష్, ల్యాదల శరత్, ఓర్సు రాజు, తాళ్లపల్లి జాన్ పాల్, యాకా మ్రాచారి, భవాని, చిట్యాల సువర్ణ, పార్థసారథి, రాజేందర్, నల తీగల కుమార్, జట్టి విజయలక్ష్మి, వనం సౌందర్య, జన్ను రాజు, చిరంజీవి, కుమార్, తీగల రాజేందర్, బిర్రు ప్రభాకర్, భాషెట్టి రంజిత్, తస్లీమ్ తదితరులు పాల్గొన్నారు.

### చరిత్రలో నిలిచిపోయేలా జనవరి 18న బహిరంగ సభ

**ఖమ్మం :** కమ్యూనిజం అజేయం... అజరామరమని మరో వందేళ్లు ప్రజల హృదిలో కమ్యూనిజం నిలిచి ఉంటుందని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సిపిఐ పతాకాన్ని హేమంతరావు ఆవిష్కరించగా పార్టీ కార్యాలయం గిరిప్రసాద్ భవన్ పై పార్టీ పతాకాన్ని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ ఆవిష్కరించారు. అనంతరం గిరిప్రసాద్ భవన్‌లో మందడపు రాణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో బాగం మాట్లాడారు. సభలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, జిల్లా కార్యదర్శి దండి సురేష్, జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రాబాబు, ఎస్‌కె జానిమియా, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు, సిద్దినేని కర్ణకుమార్, అజ్మీర రామ్మూర్తి పాల్గొన్నారు.


రంగారెడ్డి సరూర్‌నగర్‌లో...


నారాయణపేటలో...


పెద్దపల్లిలో...


సిద్దిపేటలో...


సిరిసిల్లలో...

### కార్మికులను బాధల నుండి విముక్తి చేసేది ఎర్ర జెండాయే

**జనగామ :** కార్మికులు, కష్టజీవులను బాధల నుండి విముక్తి కలిగించేది ఎర్ర జెండా మా త్రమే అని సిపిఐ జనగామ జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సిహెచ్ రాజారెడ్డి అన్నారు. సిపిఐ శత వార్షికోత్సవాల ముగింపు సందర్భంగా జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయం గబ్బెట గోపాల్ రెడ్డి భవన్‌లో ఎర్రజెండా ఎగరవేసి అనంతరం చామకూర యాకూబ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాజారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో లింగం రవి, దొడ్డిపట్ల రవీందర్, జోగుల ఆంజనేయులు, కోడి వెంకటేశం, కంచె పోశం, కొత్తపల్లి మహేష్, బొడ్డు లచ్చన్న, లింగమూర్తి, నవీన్, మూడ సుధాకర్, సర్వ శ్రీనివాస్, బాలసాని లక్ష్మణ్, సారంగపాణి, రాకేష్, ఉయ్యాల శంకర్, రాజుకుమార్, రియాజ్ పాల్గొన్నారు.

**నిర్మల్ :** భారత కమ్యూనిసుస్టు పార్టీ శత వార్షికోత్సవ వేడుకలు నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఇంద్రనగర్ సిపిఐ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. సిపిఐ జిల్లా కార్యదర్శి బూక్య రమేష్ పార్టీ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి విలాస్, ఎస్.ఎన్.రెడ్డి, కైలాష్, ఉండలేను రాథోడ్, లక్ష్మి, నాయకులు రజితలక్ష్మి, పూర్ణ లక్ష్మి,చిట్యాల లక్ష్మి,కోట్ల నారాయణ, కోట్ల భూమన్న, లింగన్న, నల లక్ష్మణ్ పాల్గొన్నారు.

### సిపిఐది చారిత్రాత్మకమైన పోరాటం

**నల్లగొండ :** సామ్రాజవాదం, భూస్వామ్య పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా, దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం భారత కమ్యూనిస్టు పార్టీ చేసిన పోరాటాలు చారిత్రాత్మకమైనవని సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. సిపిఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లాకేంద్రంలోని సిపిఐకార్యాలయం మగ్దూమ్ భవన్‌లో ఎమ్మెల్సీ సత్యం ఎర్రజెండా ఎగురవేశారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి లోడంగి శ్రవణ్ కుమార్, పబ్బు వీరాస్వామి, బొల్గురి నర్సింహా, పట్టణ కార్యదర్శి కర్ర సైదిరెడ్డి, శాంతి సంంఘ జిల్లా కార్యదర్శి జిల్లా యాదయ్య, పట్టణ సహాయకార్యదర్శి వి.లెనిన్, ముండ్ల ముత్యాలు, మదర్, యూసుఫ్, ఐతరాజు శంకర్, దోటి పండరి, అక్కలయ్య, విజయ, పార్వతి, గౌస్ పాల్గొన్నారు.

**నిజామాబాద్ :** ప్రజల్లో మత విద్వేషాలు రెచ్చగొట్టి బిజెపి పబ్బం గడుపుకుంటుందని సిపిఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ అన్నారు. శుక్రవారం అంబేద్కర్ కాలనీలోని హమాలీ యూనియన్ ఎఐటియుసి కార్యాలయంలో సిపిఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కార్యదర్శులు సుధాకర్, ఓమయ్య మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు రఘురాం, ముత్యాలు, నర్సింగరావు, అనిల్, ఇమ్రాన ఫిరోజ్, రమేష్, రాధకుమార్, అమర్, స్వరూప, భారతి పాల్గొన్నారు.

**యాదాద్రి భువనగిరి :** భారత గడ్డపై వంద సంవత్సరాలుగా వీరోచిత పోరాటాలను నిర్వహించిన ఘన చరిత్ర సిపిఐకి ఉందని పార్టీ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సిపిఐ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా భువనగిరిలోని జిల్లా పార్టీ కార్యాలయంలోఎర్ర జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండీ ఇమ్రాన్, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు సోమన్న సబిత, పుట్ట రమేష్, సామల శోభన్ బాబు, చింతల మల్లేష్, బద్దం వెంకట్‌రెడ్డి, నరసింహ, వంశీ, కృష్ణా, రమేష్, ముత్యాలు, అంజయ్య, రవీందర్ పాల్గొన్నారు.

### మరో వందేళ్లయినా ప్రజాక్షేత్రంలోనే

**భద్రాద్రి కొత్తగూడెం :** మరో వందేళ్లు కూడా ఇదే స్ఫూర్తితో ప్రజాక్షేత్రంలో మనగలమని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా అన్నారు. సిపిఐ ఆవిర్భవించి వందేళ్లు పూర్తి కావడంతో జిల్లా వ్యాప్తంగా ఆయా ప్రాంతాల్లో ఎర్రజెండాలు ఎగురవేసి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయం శేషగిరి భవన్, పోస్టాఫీస్ సెంటర్లో సాబీర్‌పాషా అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కొత్తగూడెం జిల్లా కేంద్రంలో వేలాది మందితో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కంచర్ల జమలయ్య, దుర్గరాశి వెంకన్న, చంద్రగిరి శ్రీనివాస్, వాసిరెడ్డి మురళీ, కందుల భాస్కర్, ఫయూమ్, వీరస్వామి, జిల్లా సమితి సభ్యులు భూక్యా శ్రీనివాస్, గెద్దాడ నగేష్, మునిగడప వెంకన్న, నెరేళ్ల రమేష్, పోలమూరి శ్రీను, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

### శ్రమజీవుల పేదవాడి పిడికిలి నుంచి పుట్టిందే భారత కమ్యూనిస్టు పార్టీ

**సూర్యాపేటటౌన్ :** శ్రమజీవుల చెమటలోంచి పేదవాడి పిడికిలి నుంచి పుట్టిందే భారత కమ్యూనిస్టు పార్టీ అని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయం బొమ్మగాని ధర్మబిక్షం ప్రాంగణంలో జరిగిన సిపిఐ శత వార్షికోత్సవాల కార్యక్రమానికి హాజరై జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు యల్లావుల రాములు, దూళిపాళ ధనుంజయ నాయుడు,


సిపిఐ వందేళ్ల ఉత్సవాలను పురస్కరించుకొని దీపకాంతులతో హైదరాబాద్‌లోని మఖ్దూమ్‌భవన్

కంబాల శ్రీనివాస్, గుండు వెంకటేశ్వర్లు, బూర వెంకటేశ్వర్లు, దేవరం మల్లీశ్వరి, బొమ్మగాని శ్రీనివాస్, దంతాల రాంబాబు, చామల అశోక్ కుమార్, అనంతుల మల్లీశ్వరి, సీనియర్ జర్నలిస్టు దేగల జనార్ధన్, సముద్రాల మనోహర్ బాబు, ఉప్పతల కోటమ్మ, రేగట్టి లింగయ్య, అయితరాజు లింగయ్య, దంతాల పద్మరేఖ, దేశగాని హేమలత, చిలకరాజు శ్రీను, ఎడెల్లి శ్రీకాంత్, కొమ్మరాజు వెంకట్, పరికె భరత్, దీకొండ మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

**సిద్దిపేట :** పేదల పక్షాన నిరంతరం పోరాటం చేసింది కమ్యూనిస్టులేనని .పోరాటాలా, త్యాగాల చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీదని సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ అన్నారు. శుక్రవారం సిపిఐ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని ఎడ్ల గురువారెడ్డి భవన్‌లో సిపిఐ జెండాను జిల్లా కార్యదర్శి మంద పవన్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు జెర్రిపోతుల జనార్ధన్, పట్టణ కార్యదర్శి గజబింకార్ బన్సిలాల్, సహాయ కార్యదర్శులు ఎస్‌కె హరీఫ్, కర్నాల చంద్రం. మిట్టపల్లి సుధాకర్, రామగళ్ల నరేష్, కనకరాజు పాల్గొన్నారు.

**పెద్దపల్లి :** పీడిత వర్గాల విముక్తి కోసమే ఎర్ర జెండా పుట్టిందని సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం అన్నారు. శుక్రవారం బస్టాండ్ వద్ద సిపిఐ శతవార్షికోత్సవం సందర్భంగా సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో సదానందం ఎర్రజెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో పెద్దపల్లి మండల కార్యదర్శి పూసల రమేష్, సహాయ కార్యదర్శి ఆరెపల్లి మానస్ కుమార్, పట్టణ కార్యదర్శి కల్లేపల్లి నవీన్, బాలసాని లెనిన్, చంద్రగిరి ఉదయ్, పెర్క శివ, పెర్క శ్రీకాంత్, ఆరెపల్లి రాకేష్, కల్లేపల్లి రవి, ఇరుగురాళ్ల వంశీ తదితరులు పాల్గొన్నారు.

**సంగారెడ్డి :** సిపిఐ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండి మహబూబ్‌ఖాన్ ఆధ్వర్యంలో పార్టీ జిల్లా కార్యాలయంపై సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ వి.ప్రకాష్‌రావు ఆరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి ఎంఎ రెహమాన్, జిల్లా కౌన్సిల్ సభ్యురాలు అనురాధ, సిపిఐ జిల్లా కార్యదర్శి సయ్యద్ జలాలుద్దీన్, బస్తీ పెద్దలు అక్తర్, శోభగౌడ్, ఎండిమహబూబ్‌ఖాన్, వి.ప్రకాశ్‌రావు, ఎం.తాజుద్దీన్, షపి, ఎంఎ రెహమాన్, మహబూబ్‌ఖాన్ ఎంఎ ఖాజీ, విష్ణువర్ధన్‌రెడ్డి, శంకర్, రవి,గౌస్, పీరోజ్, లక్ష్మణ్ , భూమయ్య, ఆక్తర్ బీరజీయా, యాదమ్మ పాల్గొన్నారు.

**గజ్వేల్ :** పేదల పక్షాన నిరంతరం పోరాడుతూ అంతరాలు లేని సమసమాజస్థాపనే సిపిఐ లక్ష్యమని సిపిఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్ పేర్కొన్నారు. గజ్వేల్‌లో సిపిఐ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని పార్టీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించి ఇందిరా గాంధీ చౌరస్తా వద్ద సిపిఐ అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో బట్టు దయనందరెడ్డి, జేరిపోతుల జనార్ధన్, శివలింగు కృష్ణ, స్వర్గం రాజేశం, చింత శ్రీను, మిట్టపల్లి సుధాకర్, రామగళ్ల నరేశ్, నర్సింహా రెడ్డి, కానుగుల రామనకర్ పాల్గొన్నారు.

**నారాయణపేట :** సిపిఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నారాయణపేట జిల్లా కేంద్రంలో, డాక్టర్ బిఆర్‌అంబేద్కర్ భవనంలో ఎర్రజెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టి.నరసింహ, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.సంతోష్, మక్తల్ మండల కార్యదర్శి శివన్న, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.సంతోష్, జిల్లా సభ్యులు శివయ్య, నారాయణపేట నాయకులు, తాయప్ప, లింగప్ప, సరోజమ్మ, నారాయణమ్మ, మణెమ్మ, అనంతమ్మ, పద్మమ్మ, సుజాత, మణెమ్మ పాల్గొన్నారు.

### వందేళ్లుగా నిరంతరం పోరాటాలు

**కరీంనగర్ :** అణగారిన వర్గాల హక్కుల కోసం వందేళ్లుగా నిరంతరం పోరాటాలు నిర్వహిస్తోంది భారత కమ్యూనిస్టు పార్టీయేనని సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ అన్నారు. సిపిఐ ఆవిర్భవించి వంద సంవత్సరాలు అవుతున్న సందర్భంగా కరీంనగర్‌లోని సిపిఐ జిల్లా కార్యాలయం బద్దం ఎల్లారెడ్డి భవన్ వద్ద సిపిఐ జెండాను పంజాల శ్రీనివాస్ ఎగురవేశారు. కార్యక్రమంలో పొనగంటి కేదారి, ఔకసిరెడ్డి సురేందర్ రెడ్డి,న్యాలపట్ల రాజు, పైడిపల్లి రాజు, కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, బామండ్లపెల్లి యుగేందర్, బూడిద సదాశివ, బోనగిరి మహేందర్, కొట్టే అంజలి, ఎలిశెట్టి భారతి, గామినేని సత్యం, టి.రామారావు, చెంచల మురళి, కసిబోజుల సంతోష్ చారి, మాడిశెట్టి అరవింద్,బాకం అంజయ్య,తోడేటి శ్రీనివాస్, నగునూరి రమేష్, మామిడిపల్లి హేమంత్ కుమార్, సందీప్‌రెడ్డి, సాంబయ్య పాల్గొన్నారు.

**భూపాలపల్లి :** సమ సమాజ నిర్మాణం కోసం వందేళ్ళు సిపిఐ పోరాటాలు నిర్వహించిందని పార్టీ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ అన్నా రు. సిపిఐ శతజయంతి వేడుకలు స్థానిక రావి నారాయణరెడ్డి భవన్‌లో కొరిమి రాజ్‌కుమార్ జిల్లా నాయకులతో కలిసి సిపిఐ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి గురుజపల్లి సుధాకర్‌రెడ్డి, గనగల జోగేష్, గడ్డం సింహాద్రి, గోలి లావణ్య, మట్టి కృష్ణ, గంప రాజు, ఎండి.అస్లాం, కుమ్మరి రమేష్ చారి,పల్లెల రజిత, పెద్దమాముల సంధ్య, పోతుగంటి స్వప్న, వాసం రజిత, మట్టి నాగమణి, సుభద్ర తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**మహబూబ్ నగర్ :** సిపిఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సురవరం వెంకట్రాంరెడ్డి భవనం నందు జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి సిపిఐ నాయకుడు ఎం.నరేందర్‌రెడ్డి సిపిఐ జెండా ఎగురవేశారు. పట్టణ కార్యదర్శి కోటకద్ర నరసింహ, పి.సురేష్ కొండపల్లి, రాము, కే.పద్మావతి, మహేష్, సత్యనారాయణరెడ్డి, చాంద్‌భాషా, లక్ష్మణ్, వెంకటయ్య, గంటల శ్రీను ఎస్‌కే దావీద్, ఇందిరక్క, అంజమ్మ, పుష్ప, హరి, నరసింహులు, రమేష్ గౌడ్, బాషా పాల్గొన్నారు.

**కుత్బుల్లాపూర్ :** ప్రజాసమస్యలకు కమ్యూనిజమే పరిష్కారం అని సిపిఐ జాతీయ సమితి సభ్యులు ఎండి యూసుఫ్ పేర్కొన్నారు. శుక్రవారం సిపిఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కుత్బుల్లాపూర్ మండంలోని వివిధ ప్రాంతాలలో సిపిఐ పతాక ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో జిల్లా కార్యదర్శి ఉమామహేశ్, మండల కార్యదర్శి కె.స్వామి, సహాయ కార్యదర్శులు హరినాథ్‌రావు, రాములు, నాయకులు వి.శ్రీనివాస్, మహిళా సమైక్య జిల్లా అధ్యక్షురాలు హైమావతి, ప్రజానాట్యమండలి అధ్యక్షుడు ప్రవీణ్, బాబు, సదానంద్, సాయిలు, బక్కరి మల్లేష్, కృష్ణ, నరసయ్య, వీరస్వామి, శ్రీనివాస్ చారి, సహదేవరెడ్డి, కె.వెంకటేష్, కొండయ్య, నరేంద్రచారి, నరసింహారెడ్డి, రమేష్, భాస్కర్, యూసుఫ్, రామ్‌రెడ్డి, సుధాకర్, రామచంద్రరెడ్డి, నరేష్, ఇమామ్, చంద్రయ్య, నాగేచారి, రాజు, వంశీ, అహ్మద్, శ్రీనివాస్‌చారి పాల్గొన్నారు.

### త్యాగధనుల కృషితో వందేళ్లు

**సరూర్‌నగర్ :** త్యాగధనుల కృషితో వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న భారత కమ్యూనిస్ట్ పార్టీ శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని సిపిఐ జాతీయ నాయకులు సయ్యద్ అజీజ్‌పాషా, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందోజు రవీంద్రాచారి కోరారు. శుక్రవారం బాలాపూర్ మండల లెనిన్‌నగర్‌లో మండల కార్యదర్శి ముకుందంగారి చంద్రశేఖర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సయ్యద్ అజీజ్‌పాషా ముఖ్యఅతిధిగా హాజరై పార్టీ జెండా ఆవిష్కరించారు. రంగారెడ్డి జిల్లా కార్యదర్శి బాతరాజునర్సింహా, ఆర్.గోపాల్, మారగోని ప్రవీణ్‌కుమార్‌గౌడ్, జిల్లాల కృష్ణ, మహబూబ్, కమలమ్మ, రమావత్ సక్రునాయక్, గ్యార క్రాంతి కుమార్, వినోద్, ఇస్తారి, గౌనియా, నూర్జహా, ఎల్లమ్మ, విజయ పాల్గొన్నారు.

**రాజన్న సిరిసిల్ల :** నిజాం నిరంకుశ పాలనను అంతమొందించిన ఘనత సిపిఐ పార్టీకి ఉందని సిపిఐ జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో సిపిఐ వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిపిఐ వేములవాడ నియోజకవర్గ ఇంచార్జ్ కడారి రాములు, కేవీ అనసూర్య, అజ్జ వేణు, నల్ల చంద్రమౌళి,వడ్డెపెల్లి లక్ష్మన్, కొంక విజయ్, గాజుల లింగం, అరగొండ శ్రీరాములు, ఆనందం, గాజుల లక్ష్మి , నర్సింగోజీ మారుతి పాల్గొన్నారు.

**మహబూబాబాద్ :** సిపిఐ వందేడ్ల శతాబ్ది ఉత్సవాల సందర్భంగా మహబూబాద్ జిల్లా కేంద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయం వీరభవన్ వద్ద సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి సిపిఐ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బి.అజయ్‌సారథిరెడ్డి, పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, కట్లోజు పాండురంగ చారి, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి, తండ సందీప్, వీరవెల్లి రవి, వెలుగు శ్రావణ్, ఎండి ఫాతిమా, బానోత్ లింగ్యానాయక్, జలగం ప్రవీణ్, కేదాసు రమేష్, ఆబోతు అశోక్, వంకాయలపాటి చిరంజీవి, కొమ్ము నారాయణ, ఎండి మహమూద్ పాల్గొన్నారు.

**నస్పూర్:** భారత కమ్యూనిస్టు పార్టీ వందేళ్ళ ప్రస్థానంలో ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడుతుందని సిపిఐ రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్ అన్నారు. నస్పూర్ మండల కేంద్రంలో సిపిఐ వందేళ్ళ శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. పూజారి రామన్న, మిరియాల రాజేశ్వరరావు, జోగుల మల్లయ్య జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, లింగం రవి, జిల్లా సమితి సభ్యులు దొడ్డిపట్ల రవీందర్,జోగుల ఆంజనేయులు, కోడి వెంకటేశం, కంచె పోశం, కొత్తపల్లి మహేష్, బొడ్డు లచ్చన్న, లింగమూర్తి, నవీన్, మూడ సుధాకర్, సర్వ శ్రీనివాస్, బాలసాని లక్ష్మణ్, సారంగపాణి, రాకేష్, ఉయ్యాల శంకర్, రాజుకుమార్, రియాజ్, రాయమల్లు, బత్తుల క్రాంతి పాల్గొన్నారు.

**వికారాబాద్ :** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ పార్టీ ఆవిర్భావించి నేటికి వందేళ్ళు పూర్తి కావడంతో శుక్రవారం వికారాబాద్ జిల్లా, వికారాబాద్ పట్టణంలో, ఎన్టీఆర్ చౌరస్తా వద్ద సిపిఐ జెండాను వికారాబాద్ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు యేసు రత్నం, గోపాల్‌రెడ్డి, అనంతయ్య, ఫీర్ మోహమ్మద్, వెంకటేష్, సురేష్, అబ్దుల్లా, ఎన్ఎఫ్ఐడబ్లు జగదాంబ, విమలమ్మ, హనుమంతు, బీరయ్య, నర్సిములు, ఖాదర్, తదితరులు పాల్గొన్నారు.


హన్మకొండలో...


మేడ్చల్...కుత్బుల్లాపూర్‌లో...


గజ్వేల్‌లో...


వరంగల్‌లో..


మంచిర్యాలలో..


నిజామాబాద్‌లో..


భూపాల్‌పల్లిలో..


వికారాబాద్‌లో...


ఖమ్మంలో...


కరీంనగర్‌లో...


యాదాద్రి భువనగిరిలో...


మహబూబ్‌నగర్‌లో...


నిర్మల్‌లో...


సూర్యాపేటలో...

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com